అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



మున్సిపల్ పోరుకు ముగిసిన నామినేషన్లు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పర్యవేక్షణ.. ఇక 'గృహ నిర్మాణ సంస్థ' చేతికి 03



సంపుటి 09, సంచిక: 63 | శనివారం | 31-01-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## '21వ శతాబ్దపు లీడర్‌షిప్ కోర్సు' పూర్తి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేసిన హార్వర్డ్ కెన్నెడీ స్కూల్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరో అరుదైన ఘనత సాధించారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్లో నిర్వహించిన '21వ శతాబ్దపు లీడర్షిప్' అనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారిలో మరో 62 మంది విద్యార్థులు కూడా ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగిన ఈ శిక్షణా కార్యక్రమం మైనస్ 15 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ తీవ్ర చలిలో నిర్వహించబడడం విశేషం. సిఎం రేవంత్ రెడ్డి పూర్తి అంకితభావంతో కోర్సు తరగతులకు

తరువాయి 2లో



## మైక్రోసాఫ్ట్‌కు ఎఐ షాక్

### గంటల్లోనే రూ.36 లక్షల కోట్ల ఆవిరి

**న్యూఢిల్లీ:** ప్రముఖ టెక్‌దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో కొన్ని గంటల్లోనే భారీగా నష్టాన్ని చవిచూసింది. కంపెనీ షేరు విలువ ఒక దశలో 12 శాతం కుంగింది. దాంతో ఆ సంస్థ విలువలో 400 బిలియన్ డాలర్ల మదుపర్ల సంపద ఆవిరైంది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ.36 లక్షల కోట్లు. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒక్క రోజులో ఈ స్థాయిలో పతనం కావడం ఇది రెండోసారి. గతేడాది జనవరిలో చైనాకు చెందిన డీప్‌ఫేక్ ఏఐ మోడల్ ప్రవేశంతో చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 593 బిలియన్ డాలర్లు కోల్పోయింది. 2020 మార్చి తర్వాత మైక్రోసాఫ్ట్ ఈ స్థాయిలో నష్టాలు చవిచూడడం ఇదే తొలిసారి. 1986లో ఈ టెక్ సంస్థ ఐపీఓకు వచ్చిన తర్వాత ఈ స్థాయి నష్టాలు చూడటం చాలా తక్కువ. కృత్రిమ మేధ (ఎఐ)పై కంపెనీ చేస్తున్న వ్యయాలతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. కత్రిమ మేధ, కొత్త సాంకేతికతపై చేస్తున్న ఖర్చులపై ఇప్పటికే భారీగా చర్చ నడుస్తోంది. గతేడాది పెట్టిన భారీ పెట్టుబడులకు ఏ మేరకు ప్రతిఫలాలు అందాయో తెలుసుకోవాలని వాటాదార్లు

తరువాయి 2లో




## బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలని రాష్ట్రాలు, యుటిలకు సుప్రీంకోర్టు ఆదేశం
- బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుల పరిరక్షణకు ఇది తప్పనిసరి అని సూచన
- రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది జీవించే ప్రాథమిక హక్కులో భాగమని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికల రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే బాలికలకు ఉచితంగా బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్స్ అందుబాటులో ఉంచాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుల పరిరక్షణకు ఇది తప్పనిసరి చర్య అని కోర్టు పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చింది. 'రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద వచ్చే జీవన హక్కులో భాగం' అని బెంచ్ వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం

తరువాయి 12లో



# అనుమతి ఇవ్వలేదు

- పోలవరం, నల్లమల సాగర్‌కు డిపిఆర్‌ను కూడా అనుమతించలేదు
- ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టుపై వివిధ రాష్ట్రాల అభిప్రాయాలు కోరినట్లు సిడబ్ల్యుసి స్పష్టం చేసింది
- కేంద్ర జలశక్తిమంత్రి సి.ఆర్. పాటిల్‌కు లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- కృష్ణా, గోదావరి జలాల వాటాల్లో ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని మంత్రి స్పష్టీకరణ
- ఎంతదూరమైనా పోరాటం చేసేందుకు సిద్ధమని ప్రకటన
- ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసింది గత బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎపిలోని పోలవరం నల్లమల సాగర్ విషయంలో ఎపి ప్రభుత్వానికి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, డిపిఆర్‌ను కూడా అనుమతించలేదని సెంట్రల్ వాటర్ కమిషన్ (సి డబ్ల్యుసి ) లేఖ ద్వారా స్పష్టం చేసిందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్ విషయంలో అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల అభిప్రాయాలు కోరినట్టు కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ తమకు లేఖ రాసినట్టు స్పష్టం చేశారు. కృష్ణా,గోదావరి నదీజలాల్లో తెలంగాణ రాష్ట్ర వాటాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోబోమని, ఇందుకు ఎంత దూరమైన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు అన్ని వేదికలను ఉపయోగించుకుంటామని అన్నారు. ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసిందే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వమని విమర్శించారు.జూమ్ యాప్ ద్వారా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నల్లమల పోలవరం సాగర్ ఏజెండాలో చేర్చేందుకు తాము ఒప్పుకోబోమని, అంతర్రాష్ట్ర వివాదాల వల్ల ఆగిన ప్రాజెక్ట్‌లపైన చర్చించేందుకు

తరువాయి 2లో

ఆ రెండు ప్రాజెక్టులను

## ఎజెండాలో పెట్టొద్దు

- పోలవరం, నల్లమలసాగర్‌పై కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- తొలిసారి కమిటీ భేటీ
- ఎజెండాలో 12 అంశాలు చేర్చాలని ప్రతిపాదనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును సమావేశ ఎజెండాలో పెట్టవద్దని కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలపై ఏర్పాడిన 'కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ' మొదటి సమావేశం ఢిల్లీలోని కేంద్ర జల సంఘం కార్యాలయంలో జల సంఘం చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సుమారు రెండు గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశానికి సిడబ్ల్యుసి అధికారులు, కృష్ణా నది యాజమాన్య మండలి (కెఆర్ఎంపి ), గోదావరి నది యాజమాన్య మండలి (జిఆర్ఎంబి ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యుడిఎ) ఛైర్మన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అజెండాలో 12 అంశాలు

తరువాయి 2లో

యువకుల వేధింపులు

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్



ఇద్దరు యువకుల వేధింపులతో ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలంలో చోటుచేసుకున్నది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యాతండాకు చెందిన అనిత వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. ఆమెను పెళ్లి చేసుకుంటానని దూరపు బంధువైన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కొమ్మనపల్లి తండాకు చెందిన రాజేందర్ నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. కానీ డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయాలని.. వేరే ఎవరితోనూ చనువుతో మాట్లాడవద్దని కొంతకాలంగా వేధింపులకు పాల్పడ్డాడు. రాజేందర్ వైఖరి నచ్చకపోవడంతో ఈ విషయాన్ని అనిత తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో అనితను ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని రాజేందర్‌కు తెగేసి చెప్పారు. అయినా

తరువాయి 12లో

## భక్తజన గుడారం...

- జాతరకు వెల్లువెత్తుతున్న భక్తులు
- పుణ్యస్నానాలతో జలధారగా మారిన జంపన్న వాగు
- సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి కొండా సురేఖ సహా పలువురు ప్రముఖులు



పోటెత్తిన మేడారం



47 కీలక ప్రతిపాదనలు

## కేంద్రం వద్దే..

- రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా రూ.లక్ష కోట్లకుపైగా నిధులు, ప్రాజెక్టులు పెండింగ్
- తెలంగాణ అభివృద్ధిపై ప్రభావం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా తెలంగాణకు రావాల్సిన కీలక నిధులు, ప్రాజెక్టులు, అనుమతులు ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే నిలిచిపోయాయి. సుమారు 12 విభాగాలకు సంబంధించిన 47 అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు ఆటంకం ఏర్పడుతోందని రాష్ట్ర ప్రభుత్వవర్గాలు పేర్కొంటున్నాయి. మౌలిక వసతులు, రవాణా, పరిశ్రమలు, విద్య, హౌజింగ్ వంటి కీలక రంగాల్లో కేంద్ర సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని, ఫలితంగా పలు ప్రాజెక్టులు అమలుకు నోచుకోవడంలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కిలో మీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అనుమతులతో పాటు రూ. 34,367 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరింది. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ రేడియల్ రోడ్లు రూ.45,000 కోట్లు, ఓఆర్ఆర్ నుంచి

తరువాయి 2లో

## 'గాంధీ' అంటే మోదీకి ఇష్టం లేదు

- మహాత్మాగాంధీతో ముడిపడి ఉన్న ఉపాధిహామీ చట్టం ఎక్కువ కాలం కొనసాగాలనుకోవడం లేదు
- 'ఎంజి నరేగా' రద్దుని నిరసిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' రద్దుకు సంబంధించి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మహాత్మాగాంధీతో ముడిపడి ఉన్న చట్టం ఎక్కువ కాలం కొనసాగాలని ప్రధాని మోదీ అసలు ఇష్టం లేదని విమర్శించింది. ప్రజలకు చట్టబద్ధంగా పని చేసే హక్కు ఉండాలని ఆయన కోరుకోవడంలేదని ఆరోపించింది. 'ఎంజి నరేగా' రద్దుని నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం పనిచేసేందుకు కల్పించిన రాజ్యాంగ హక్కును లాక్కోవడాకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్యకర్తలు 24, అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయం నుండి గాంధీ స్మృతి వరకు మార్చ్ నిర్వహించారు. అయితే, వారిని మధ్యలోనే పోలీసులు అడ్డుకుని గాంధీ స్మృతికి చేరుకోనీయలేదు. నిరసన కార్యక్రమంలో నిరసనకారులు

తరువాయి 12లో




వెనిజులాలో అమల్లోకి

## కొత్త చమురు చట్టం

అమెరికాకు అనుకూలించేదిగా అభివర్ణిస్తున్న పరిశీలకులు

**కారకస్ :** వెనిజులా చమురు పరిశ్రమపై కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. దేశ కార్యనిర్వాహక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ సంతకం చేసిన ఈ చట్టాన్ని అమెరికా అనుకూలమైనదిగా పరిశీలకులు భావిస్తున్నారు. తాజాగా అమల్లోకి వచ్చిన ఈ చట్టం, స్థూలంగా చూస్తే దేశ ఆర్థిక పునరుద్ధరణ కోసం తీసుకున్న సంస్కరణగా కనిపించినప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఇది అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా రూపొందిన వ్యూహాత్మక చర్యగా కూడా అర్థమవుతుంది. ఈ కొత్త చట్టంతో, రెండు దశాబ్దాలుగా కొనసాగిన ప్రభుత్వ ఆధిపత్యాన్ని తగ్గించి, ప్రైవేటు పెట్టుబడులకు తలుపులు తెరిచింది. హ్యూగో చావెజ్ కాలం నుంచి సామ్యవాద సిద్ధాంతానికి కేంద్రబిందువుగా ఉన్న చమురు జాతీయాకరణ విధానానికి ఇది పూర్తిగా విరుద్ధమైన మార్పు. ఈ చట్టం ప్రకారం, చమురు ఉత్పత్తి, విక్రయం వంటి కీలక రంగాల్లో ఇకపై ప్రైవేటు సంస్థలకు నియంత్రణ హక్కులు ఉంటాయి. ఇప్పటివరకు ప్రభుత్వ సంస్థ పిడివిఎస్‌ఎకి మాత్రమే ఉన్న ఏకాధిపత్యం ముగుస్తుంది. ప్రైవేటు కంపెనీలు తమ ఖర్చు, ప్రమాదం మీదే ఉత్పత్తి నిర్వహించాలి, అయితే చమురు నిల్వల యాజమాన్యం మాత్రం రాష్ట్రానిదిగానే ఉంటుంది. అంతేకాదు, వివాదాల పరిష్కారానికి వెనిజులా కోర్టులకే పరిమితం కాకుండా, స్వతంత్ర అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు అవకాశం కల్పించడం ఈ చట్టంలోని కీలక అంశం. ఇది విదేశీ పెట్టుబడిదారులకు భరోసా కలిగించే అంశంగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. స్థూలంగా పరిశీలిస్తే, ఈ చట్టం వెనిజులా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికే రూపొందించినట్టుగా కనిపిస్తుంది. దశాబ్దాలపాటు చమురు ఆదాయాలపై ఆధారపడి, ఆ తర్వాత ధరల పతనం, అవినీతి, దుర్వ్యవస్థ వల్ల

తరువాయి 2లో



## హాంగ్‌కాంగ్ కంపెనీకి రాయితీ రాజ్యాంగ విరుద్ధం

పనామా సుప్రీంకోర్టు తీర్పు

**పనామా సిటీ :** పనామా కాలువ వద్ద ఉన్న కీలక నౌకాశ్రయాలను నిర్వహించే హాంగ్‌కాంగ్ కంపెనీకి ఇచ్చిన కన్సెషన్‌ను పనామా సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇవ్వడం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. హాంగ్‌కాంగ్‌కు చెందిన సికె హచిసన్ హోల్డింగ్స్‌కు అనుబంధ సంస్థ అయిన పనామా పోర్ట్స్ కంపెనీకి, పనామా కాలువకు ఇరువైపులా ఉన్న నౌకాశ్రయాలను నిర్వహించే హక్కు ఉంది. అయితే ఆ హక్కును 2021లో మరో 25 సంవత్సరాల పాటు పొడిగించిన తీరు చట్టబద్ధం కాదని సుప్రీంకోర్టు తేల్చింది.ఈ తీర్పుకు ముందు పనామా కంట్రోలర్ నిర్వహించిన ఆడిట్‌లో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కన్సెషన్ పొడిగింపు సమయంలో అవసరమైన అనుమతులు తీసుకోకపోవడం, చెల్లించాల్సిన మొత్తాలు చెల్లించకపోవడం, లెక్కల లోపాలు, 2015 నుంచి భూత కన్సెషన్ (గోస్ట్ కన్సెషన్) పనిచేసినట్టు అనుమానాలు ఉన్నాయని ఆడిట్ పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి 2021 తర్వాత సుమారు 300 మిలియన్ డాలర్లు, మొదటి 25 ఏళ్ల ఒప్పంద కాలంలో దాదాపు 1.2 బిలియన్ డాలర్ల వరకు నష్టం జరిగిందని కంట్రోలర్ అనెల్ ఫ్లోరెస్ తెలిపారు. ముఖ్యంగా, ఈ పొడిగింపుకు తన కార్యాలయ ఆమోదం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ న్యాయ తీర్పు అమెరికా దీర్ఘకాల లక్ష్యాలకు అనుకూలంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## కెనడా విమానాలపై.. 50 శాతం సుంకం పెంపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** అమెరికా–కెనడాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న వాణిజ్య సంబంధాలు మరోసారి తీవ్రమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అమెరికాలో విక్రయించే కెనడా విమానాలపై 50 శాతం సుంకం (టారిఫ్) విధిస్తామని బెదిరించడం ద్వారా ఈ వాణిజ్య యుద్ధాన్ని మరింత విస్తరించారు. ఈ హెచ్చరిక ప్రధానంగా కెనడాకు చెందిన అతిపెద్ద విమాన తయారీ సంస్థ బాంబార్డియర్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తున్నది. కెనడా, జార్జియాలోని సవన్నాలో ఉన్న గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ తయారు చేసిన విమానాలకు సర్టిఫికేషన్ ఇవ్వడాన్ని నిరాకరించిందని ట్రంప్ ఆరోపించారు. దీనికి ప్రతీకారంగా, అమెరికాలో పనిచేస్తున్న కెనడా విమానాల సర్టిఫికేషన్‌ను రద్దు చేస్తామని, అవసరమైతే అన్ని కెనడా విమానాలపై 50 శాతం టారిఫ్ విధిస్తామని ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అంతేకాదు, బాంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ బిజినెస్ జెట్లను తక్షణమే డీసర్టిఫై చేస్తున్నట్లు కూడా చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో సుమారు 150 బాంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ విమానాలు సేవలందిస్తున్నాయి. ఇవి ప్రైవేట్ యజమానులు, కార్పొరేట్ సంస్థలు, నెట్‌జెట్స్, ఫ్లెక్స్‌జెట్ వంటి ఫ్రాక్షనల్ జెట్ కంపెనీల విస్తృతంగా ఉపయోగంలో ఉన్నాయి. గల్ఫ్‌స్ట్రీమ్, బాంబార్డియర్ రెండూ బిజినెస్ జెట్ మార్కెట్‌లో ప్రత్యర్థులు కావడంతో, ఈ నిర్ణయం వెనుక వాణిజ్య ప్రయోజనాలే ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ ఆరోపణలను బాంబార్డియర్ ఖండిస్తూ, తమ విమానాలు పూర్తిగా అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) ప్రమాణాలకు అనుగుణంగానే సర్టిఫై అయ్యాయని, అమెరికాలో తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ వివాదం త్వరగా పరిష్కారమవ్వకపోతే విమాన రాకపోకలకు, ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని సంస్థ హెచ్చరించింది. ఇదిలా ఉండగా, అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్, అమెరికా–మెక్సికో–కెనడా వాణిజ్య ఒప్పందం సమీక్షకు ముందు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యలు ప్రతికూలంగా మారవచ్చని హెచ్చరించారు.

# షాంఘై చేరుకున్న స్టార్మర్



**బీజింగ్ :** బ్రిటిష్ ప్రధాని కెయిర్ స్టార్మర్ శుక్రవారం చైనా వాణిజ్య కేంద్రం షాంఘై చేరుకున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)తో చైనా సంబంధాలను మరింత పెరుగుపరచుకునే దిశగా ఆయన పర్యటన సాగుతుంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనాతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోకూడదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే స్టార్మర్ షాంఘై చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్టార్మర్ వెంట యాభై కంటే ఎక్కువ మంది ప్రముఖ వ్యాపారవేత్తలు ఉన్నారు. బ్రిటిష్ ప్రధాని చైనా పర్యటనకు రావడం ఎనిమిది సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. మొదట బీజింగ్ చేరుకున్న స్టార్మర్ అ క్కడ చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తోసహా పలువురు కీలక నాయకులతో భేటీ అయ్యారు. పరస్పర సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఇరు దేశాల నాయకులు అంగీకరించారు. ఇయుతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోరాదంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలను బ్రిటిష్ ప్రధాని ఖాతరు చేయలేదు. అంతకు ముందు కెనడాకు కూడా ఆయన ఇదే విధమైన హెచ్చరిక జారీ చేశారు. కానీ, కెనడా ప్రధాన మంత్రి మార్క్ ఆర్నె ఈ నెల ఆరంభంలో చైనాలో పర్యటించారు. ఇప్పుడు స్టార్మర్ కూడా అదే విధంగా, ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోలేదు.

# బహుమతుల సమగ్ర జాబితా విడుదల చేసిన యుఎస్



**న్యూయార్క్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఇతర భారత ప్రభుత్వ ప్రముఖులు యుఎస్ నాయకులకు అందజేసిన బహుమతుల వివరాలతో కూడిన సమగ్ర జాబితాను అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసింది. ఈ వివరాలను అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌లోని ఆఫీస్ ఆఫ్ ది చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్, 2024 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించి చట్టబద్ధంగా సమర్పించింది. ఈ నివేదికలో, విదేశీ ప్రభుత్వాల నుంచి అమెరికా ఫెడరల్ ఉద్యోగులు స్వీకరించిన బహుమతులపై దాఖలైన ప్రకటనలన్నింటిని ఒకేచోట పొందుపరిచారు. ఇందులో భౌతిక బహుమతులతో పాటు ప్రయాణం లేదా ప్రయాణ వ్యయాలకు సంబంధించిన బహుమతుల వివరాలు కూడా ఉన్నాయి. 2024 సంవత్సరానికి కనీస విలువగా అమెరికా ప్రభుత్వం 480 డాలర్లను నిర్ణయించిందని, ఆ విలువను మించిన బహుమతులన్నీ తప్పనిసరిగా నివేదించాల్సి ఉంటుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ జాబితా ప్రకారం, 2023 సెప్టెంబర్ 10న భారత ప్రధాని నరేంద్ర మోదీ, అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చెక్క పెట్టె, స్కార్ఫ్, కుంకుమపువ్వు ఉన్న సీసా, టీ పెట్టెలను బహుమతిగా అందజేశారు. వీటి అంచనా విలువ 562 డాలర్లు. ఈ బహుమతుల్లో చెక్క పెట్టె, దుప్పటి, సీసా, టీ పెట్టెను అమెరికా నేషనల్ ఆర్కైవ్స్‌కు బదిలీ చేయగా, కుంకుమపువ్వు, టీ వంటి పాడయ్యే వస్తువులను అమెరికా సీక్రెట్ సర్వీస్ నిబంధనల ప్రకారం తొలగించారు. జో బైడెన్ 2023 సెప్టెంబర్‌లో భారత్ నిర్వహించిన జి20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి న్యూఢిల్లీకి వచ్చిన సందర్భంగా ఈ బహుమతులు లభించాయి. అలాగే, 2024 జూలై 16న మోదీ బైడెన్‌కు మరో విలువైన బహు మతిగా స్టెర్లింగ్ సిల్వర్ మెటల్ ట్రైన్ సెట్‌ను అందజేశారు. దీని అంచనా విలువ 7,750 డాలర్లు. అదే విధంగా, 2024 అక్టోబర్ 21న మాజీ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌కు మోదీ పాష్మినా షాల్‌ను బహుమతిగా ఇచ్చారు. దాని విలువ సుమారు 2,969 డాలర్లు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవాల్, అప్పటి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేకబ్ సలివన్‌కు 2024 ఆగస్టు 23న కాశ్మీర్ పాష్మినా స్కార్ఫ్‌ను బహుమతిగా అందజేశారు. దీని విలువ 599 డాలర్లు కాగా, జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేశారు. అలాగే, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మోదీ 2024 అక్టోబర్ 18న శ్రీకృష్ణ రాసలీల వెండి పెట్టెను బహుమతిగా ఇచ్చారు. దీని విలువ 1,330 డాలర్లు. ఆమె భర్త డగ్లస్ ఎంహోఫ్‌కు ఇచ్చిన కఫ్‌లింక్స్ విలువ 585.65 డాలర్లు. ఇదే జాబితాలో, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అప్పటి అమెరికా రక్షణ శాఖ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు 2022 నవంబర్ 24న శివ నటరాజ కాంస్య విగ్రహంను బహుమతిగా ఇచ్చినట్టు కూడా పేర్కొన్నారు. దాని అంచనా విలువ 3,700 డాలర్లు కాగా, జీఎస్‌ఏకు బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ బహుమతుల స్వీకరణకు కారణాలుగా, బహుమతులను స్వీకరించకపోతే దాత దేశానికి మరియు అమెరికాకు అసౌకర్యం కలగవచ్చు అనే అంశాన్ని నివేదిక స్పష్టం చేసింది.

## సార్వభౌమాధికారం విషయంలో రాజీ ప్రసక్తే లేదు

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా

**మెక్సికో సిటీ :** తమ దేశ సార్వభౌమాధికారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బామ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన తాజా ఫోన్ సంభాషణ అనంతరం మెక్సికో సార్వభౌమాధికారాన్ని మరోసారి స్పష్టంగా పునరుద్ఘాటించారు. ముఖ్యంగా ఒక మాజీ ఒలింపిక్ స్నోబోర్డర్ డ్రగ్ అక్రమ రవాణా ఆరోపణలపై అరెస్టు అయి అమెరికాకు తరలించిన ఘటన నేపథ్యంలో, మెక్సికో భూభాగంలో అమెరికా జోక్యం ఉందనే అనుమానాలు వెల్లువెత్తడంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై రోజువారీ ప్రెస్ సమావేశంలో క్లాడియా మాట్లాడుతూ, మెక్సికో భూభాగంలో జరిగే భద్రతా సంబంధమైన అన్ని కార్యకలాపాలను స్వదేశీ భద్రతా దళాలే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. తమ దేశంలో అమెరికా ఆపరేషన్లు చేపట్టడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆమె మరోసారి తేల్చి చెప్పారు. ఈ మాటలు, కెనడాకు చెందిన మాజీ ఒలింపిక్ స్నోబోర్డర్ ర్యాన్ వెడ్డింగ్ అరెస్టు చుట్టూ నెలకొన్న వివాదానికి కొనసాగింపుగా పరిశీలకులు భావిస్తున్నారు. మెక్సికో ప్రభుత్వం, అమెరికాలోని మెక్సికన్ రాయబారి రోనాల్డ్ జాన్సన్, వెడ్డింగ్ గత వారం అమెరికా రాయబార కార్యాలయంలో స్వయంగా లొంగిపోయాడని చెబుతుండగా, అతని న్యాయవాది మాత్రం ఈ వాదనను ఖండించారు.

## భారత్‌కు మూడు కాంస్య శిల్పాలను తిరిగి అప్పగించనున్న అమెరికా



**న్యూయార్క్ :** గతంలో, భారతదేశంలోని ఆలయాల నుంచి అక్రమంగా తరలించిన మూడు ప్రాచీన కాంస్య శిల్పాలను అమెరికా భారత్‌కు తిరిగి అప్పగించనుంది. వాషింగ్టన్ డిసిలోని స్మిత్సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఏషియన్ ఆర్ట్, సుదీర్ఘమైన పరిశోధన అనంతరం ఈ శిల్పాలు చట్టవిరుద్ధంగా ఆలయాల నుంచి తొలగించారని నిర్ధారించి, వాటిని భారత ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. మ్యూజియం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ మూడు శిల్పాల్లో ఒకటైన 'శివ నటరాజ' విగ్రహాన్ని దీర్ఘకాలిక రుణ ప్రాతిపదికన మ్యూజియంలోనే ఉంచేందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది. దీని ద్వారా ఆ శిల్పం మూలాలు, అది ఆలయం నుంచి తొలగించబడిన విధానం, తిరిగి భారత్‌కు అప్పగించే ప్రక్రియ వంటి పూర్తి కథను ప్రజల ముందు ఉంచేందుకు అవకాశం కలుగుతుందని మ్యూజియం తెలిపింది. ఇది సంస్కృతిక వారసత్వ పరిరక్షణలో పారదర్శకతకు తమ నిబద్ధతను చాటుతుందని పేర్కొంది. చోళుల కాలానికి చెందిన (సుమారు క్రీ.శ. 990) 'శివ నటరాజ', 12వ శతాబ్దానికి చెందిన చోళుల కాలపు 'సోమాస్కంద', అలాగే 16వ శతాబ్దానికి చెందిన విజయనగర కాలపు 'పరవాయితో సంత్ సుందరర్' శిల్పాలను తిరిగి ఇస్తారు. ఇవన్నీ దక్షిణ భారతదేశంలోని కాంస్య శిల్పకళా సంప్రదాయానికి అద్భుతమైన ఉదాహరణలుగా నిలుస్తాయని, ఆలయ ఉత్సవాల్లో ఊరేగింపులకు ఉపయోగించే పవిత్ర విగ్రహాలుగా ఇవి ఉండేవని మ్యూజియం తెలిపింది. దీర్ఘకాలిక రుణంగా మ్యూజియంలో ప్రదర్శించనున్న 'శివ నటరాజ' విగ్రహం, 'దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా హిమాలయ ప్రాంతాల్లో జ్ఞాన కళ' అనే ప్రదర్శనలో భాగంగా దర్శనమివ్వనుంది. ఈ ఒప్పందానికి సంబంధించిన ఏర్పాట్ల కోసం మ్యూజియం, భారత రాయబార కార్యాలయం పరస్పర సంప్రదింపుల్లో ఉన్నాయని వెల్లడించింది.

# ముగిసిన నామినేషన్‌ల తుది గడువు..రంగంలోకి కొత్త పార్టీలు

ప్రచారానికి స్వల్ప సమయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి కీలక దశకు చేరుకుంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల పరిధిలో నామినేషన్‌ల తుది గడువు శుక్రవారంతో ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లలో ఉన్న అభ్యర్థులందరికీ అధికారులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల తొలి దశ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,996 వార్డులు, డివిజన్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 2,582 మున్సిపల్ వార్డులు, 414 కార్పొరేషన్ డివిజన్లు ఉన్నాయి. నామినేషన్ల పరిశీలన జనవరి 31న జరగనుంది. నామినేషన్లు తిరస్కరించిన అభ్యర్థులకు ఫిబ్రవరి 1 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 3 సాయంత్రం వరకు నామినేషన్‌ల ఉపసంహరణ కొనసాగనుంది. అదే రోజున తుది అభ్యర్థుల జాబితా విడుదల చేసి, ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఫిబ్రవరి 9న ప్రచారం ముగియనుంది. ప్రచారానికి కేవలం ఆరు రోజులే సమయం ఉండటంతో పలువురు అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళలు 26.80 లక్షలు, పురుషులు 25.62 లక్షలు, ఇతరులు 640 మంది ఉన్నారు. పోలింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నామినేషన్‌ల పరిశీలన పూర్తయ్యాక ఎన్ని వార్డులు, డివిజన్‌లలో సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయన్న వివరాలు శుక్రవారం రాత్రికి స్పష్టతకు రానున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**బరిలో కొత్త పార్టీలు – రసవత్తరంగా రాజకీయం**

ఈసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన సిపిఐ, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ(ఎం), బిజెపిలతో పాటు కొత్త పార్టీలు కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో ఈసారి కొత్తగా మూడు రాజకీయ పార్టీలు బరిలోకి దిగాయి. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్' (సింహం గుర్తు) తరపున అభ్యర్థులను బరిలో నిలిపింది. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ పలు కీలక స్థానాల్లో పోటీ చేస్తోంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున తీన్మార్ మల్లన్న నాయకత్వంలో పలు కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాల్లో అభ్యర్థులను పోటీలోకి దించారు. దీంతో కొత్త పార్టీలను ఓటరు దేవుళ్లు ఏవిధంగా ఆదరిస్తారనే విషయం ప్రస్తుతం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో కవిత తొలిసారిగా పురపోరులో అదృష్టం పరీక్షించుకుంటున్నారు. కల్వకుంట్ల కవిత సింహం గుర్తుపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సింహం గుర్తుపై గతంలో పోటీ చేసిన వారు సానుకూలమైన ఫలితాలు సాధించారనే నమ్మకంతోనే కవితను ఈ గుర్తుపై ధీమాతో ఉన్నట్లు జాగృతి కార్యకర్తలు అంటున్నారు.

**ప్రచారానికి స్వల్ప సమయం**

ఫిబ్రవరి 3న గుర్తుల కేటాయింపు పూర్తయిన తర్వాత, అభ్యర్థులకు ప్రచారం కోసం కేవలం 6 రోజులు మాత్రమే సమయం ఉంటుంది. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. దీంతో ఇప్పటికే పలువురు అభ్యర్థులు అనధికారికంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏయే వార్డుల్లో సింగిల్ నామినేషన్లు దాఖలై అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారనే అంశంపై ఈ రాత్రికి స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

## ఎజెండాలో పెట్టవద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం నీటిని వాడుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. కాగా తెలంగాణ రాష్ట్ర అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఎపి ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలను ఖరారు చేసి, లిఖితపూర్వకంగా ఇవ్వాలని సిడబ్ల్యుసి చైర్మన్ సూచించారు. అజెండా అంశాలు ఖరారైన తర్వాత సమావేశ తేదీని ఖరారు చేస్తామని వెల్లడించారు. కాగా ఈనెల 2న కేంద్ర జలశక్తి శాఖ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా మాట్లాడుతూ ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన అజెండాను వెల్లడించలేదని మీడియాకు వివరించారు.

## అనుమతి ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే తాము సిద్ధంగా ఉన్నామని ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసిన విషయన్ని వివరించారు. నీటి ప్రాజెక్టులు, కేటాయింపులపైన పూర్తి అవగాహన ఉన్న, తెలంగాణ ప్రయోజనాల కాపాడే ఆదిత్యనాథ్‌దాస్‌ను తాము సలహాదారునిగా పెట్టుకున్నామని, గతంలో ఎస్‌కె.జోషి ఎపి ప్రాజెక్టుల కోసం పనిచేశారని ఉత్తమ్ తెలిపారు. కేంద్ర ఢిల్లీలో సమావేశాన్ని ప్రస్తావించారని, ఢిల్లీలో హరీశ్‌రావు తెలంగాణ పరభుత్వం, ఎపి ప్రభుత్వం, కేంద్రంతో ఎవరితోనైనా నీటి హక్కుల, నది జలాలో చుక్క నీటికి చర్చలకు సిద్ధమేనని, కానీ ఒక్క చుక్క నీటిని వదులుకునేందుకు సిద్ధంగా లేమన్నారు. మేడిగడ్డ బ్యారేజీ అత్యంత ప్రమాదకరమనే విషయాన్ని కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్‌లో లిఖితపూర్వకంగా సమాధానం చెప్పిన విషయాన్ని ఉత్తమ్ వివరించారు. తమ రెండేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి నది జలాలు ఎక్కువగా వాడుకున్నామని, గోదావరి బేసిన్‌లో ఎక్కువ నీళ్లు ఇచ్చామని, అత్యధికంగా వరి సాగు జరిగిందని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం కూడా కితాబునిచ్చిందని వివరించారు.

సర్వ శక్తులూ ఒడ్డుతున్నాం

తెలంగాణ నీటి హక్కులను కాపాడుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నామని, నీటి చుక్కను కూడా తాము వదులుకునేందుకు సిద్ధంగా లేమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అందుకు ఎపి ప్రభుత్వంపైన అన్ని వేదికపలైన పోరాటం చేస్తామన్నారు. నీటి వాటాల అంశంలో తెలంగాణ రాష్ట్రానికి గత బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో మోసం జరిగిందని, రూ 17 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ 1.8 లక్షల కోట్లు నీటిపారుదల శాఖపై ఖర్చుపెట్టారని, అయినప్పటికీ ఒక్క ప్రాజెక్ట్‌ను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని ఆరోపించారు. ఒక కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే డిజైన్ చేసి,నిర్మించడం కూలిపోవడం మొత్తం బిఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. కృష్ణా నదిజలాలల్లో ఎపికి 811 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసి నీరు సరిపోతుందని సాక్షాత్తు కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాటి సిఎం కెసిఆఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు రాసి ఇచ్చారని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణకు 299 టిఎంసి నీరు సరిపోతుందని రాసి ఇచ్చిన ఘనత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి, కెసిఆర్‌కు, హరీశ్‌రావుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కృష్ణా నదిలో తెలంగాణకు 70 శాతం వాటా కేటాయించాని కేంద్ర ప్రభుత్వానికి, కెఆర్‌ఎంబికి నివేదించామని, ఆ దిశగానే పోరాటం చేస్తున్నామని వివరించారు.

'రాయలసీమ' ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లిందే కెసిఆర్ : గోదావరి నీటిని రాయలసీమ తీసుకెళ్తామని, రాయలసీమను రత్నాల సీమగా మారస్తామని చెప్పిన కెసిఆర్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎపితో కుమ్మక్కు అయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. ఎపి సిఎం జగన్‌మోహన్ రెడ్డితో కెసిఆర్ అలయ్ బలాయ్ చేసుకుని, అపెక్స్ సమావేశాన్ని మార్చుకున్నారని, రాయలసీమ ప్రాజెక్ట్‌కు ఎపి ముందుకు తీసుకెళ్లే విధంగా సహకరించారన్నారు. బనకచర్ల పేరు మార్చి నల్లమల సాగర్ నిర్మించడాన్ని కూడా తాము వ్యతిరేకించామని, ఈ విషయమై న్యాయస్థానంలో సూట్ కూడా దాఖలు చేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి బిఆర్‌ఎస్, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం వింత, వికారమని ఉత్తమ్ అన్నారు. ఇరిగేషన్ శాఖను నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక దోపిడీ వ్యవస్థగా మార్చిందని మండిపడ్డారు.

## కొత్త చమురు చట్టం

(మొదటి పేజీ తరువాయి)

కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టేందుకు విదేశీ పెట్టుబడులు అత్యవసరం అనే వాదన బలంగా వినిపిస్తోంది. చమురు ఉత్పత్తి పెరిగితే ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయం పెరుగుతాయనే ఆశ కూడా ఉంది. అయితే ఈ మార్పులు నిజంగా వెనిజులా ప్రజల కోసం ఎంతవరకు ఉపయోగపడతాయన్నది ప్రశ్నార్థకమే. ఈ చట్టం అమెరికాకు మరుగున లాభం చేకూర్చే విధంగా ఎలా పనిచేస్తుందో గమనిస్తే, ముందుగా అమెరికా అవసరాలను ప్రస్తావవించాలి. ప్రపంచంలోనే అతి పెద్ద చమురు వినియోగ దేశాల్లో అమెరికా ఒకటి. వెనిజులాకు ప్రపంచంలోనే అత్యధిక నిర్ధారిత చమురు నిల్వలు ఉన్నాయి. ఈ రెండు అంశాలను కలిపితే, వెనిజులా చమురు రంగం అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంత ముఖ్యమో అర్థమవుతుంది. గతంలో చావెజ్, మదూరో ప్రభుత్వాలు జాతీయీకరణ, సామ్యవాద విధానాల పేరుతో అమెరికా కంపెనీలను దూరం పెట్టాయి. ఎక్సాన్‌మొబిల్, కొనోకోఫిలిప్స్ వంటి దిగ్గజ సంస్థలు తమ పెట్టుబడులు కోల్పోయాయి. ఇప్పుడు కొత్త చట్టం ద్వారా అదే అమెరికా కంపెనీలకు తిరిగి ప్రవేశ ద్వారం తెరుచుకుంది. ఇదే సమయంలో, ఈ చట్టం అమల్లోకి వచ్చిన సమయాన్ని గమనించాలి. అమెరికా ఖజానా శాఖ ఒకవైపు వెనిజులా చమురుపై ఉన్న ఆంక్షలను సడలించడం, మరోవైపు అమెరికా ఎనర్జీ కంపెనీల కార్యకలాపాలకు అనుమతులు పెంచడం జరిగింది. ఇదే సమయంలో వెనిజులా ప్రభుత్వం ప్రైవేటీకరణకు సన్నద్ధమవడం యాదృచ్ఛికం కాదు. ఆంక్షలు.. సంస్కరణలు అనే రెండు చర్యలు కలసి, వెనిజులా చమురు రంగాన్ని అమెరికా ప్రభావానికి మరింత లోబరుచుకునే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. మూడవ అంశంగా డాలర్ ఆధిపత్యాన్ని చూడాలి. చమురు వ్యాపారం ఎక్కువగా డాలర్లలోనే జరుగుతుంది. వెనిజులా చమురు ఉత్పత్తి, విక్రయం మళ్లీ అంతర్జాతీయ మార్కెట్లో చురుకుగా జరిగితే, ఆ లావాదేవీల్లో డాలర్ పాత్ర పెరుగుతుంది. ఇది అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని బలోపేతం చేసే అంశం. అంతేకాదు, చమురు అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తుంది, దానిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు అనే విషయంపై అమెరికా పర్యవేక్షణ ఉండేలా వ్యవస్థలు రూపొందే అవకాశం ఉంది. ఇది రాజకీయంగా కూడా వెనిజులాపై అమెరికాకు ప్రభావం చూపే సాధనంగా మారవచ్చు.

భౌగోళిక రాజకీయ కోణం. రష్యా, చైనా వంటి దేశాలు గత దశాబ్దంలో వెనిజులాలో తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. కొత్త చట్టం ద్వారా అమెరికా కంపెనీలు, పెట్టుబడులు పెద్ద ఎత్తున ప్రవేశిస్తే, ఆ ప్రభావాన్ని సమతుల్యం చేయడం లేదా తగ్గించడం అమెరికాకు సాధ్యమవుతుంది. అంటే ఇది కేవలం ఆర్థిక సంస్కరణ కాదు... భౌగోళిక రాజకీయ వ్యూహంలో భాగం. ఈ చట్టంతో వెనిజులా ప్రజలకు వచ్చే ప్రయోజనాలపై అనేక సందేహాలు ఉన్నాయి. పారదర్శకత, జవాబుదారీతనం లేకపోతే, ఈ ప్రైవేటీకరణ మరోసారి అవినీతికి దారి తీయవచ్చు. చమురు సంపద దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా, విదేశీ కంపెనీలు, కొద్ది రాజకీయ వర్గాల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ప్రతిపక్ష నేతలు కోరుతున్నట్లుగా బలమైన పర్యవేక్షణ వ్యవస్థలు లేకపోతే, ఈ చట్టం సామాన్య ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు తేననే గ్యారంటీ లేదు. ఏదిఏమైనా, వెనిజులా చమురు పరిశ్రమను ప్రైవేటీకరించే ఈ చట్టం దేశ ఆర్థిక పునరుద్ధరణ పేరుతో తీసుకున్న చర్యగా కనిపించినప్పటికీ, అమెరికాకు దీర్ఘకాలికంగా శక్తి భద్రత, ఆర్థిక లాభాలు, రాజకీయ ప్రభావం తీసుకొచ్చే విధంగా రూపొందినదిగా చెప్పవచ్చు. ఇది వెనిజులాకు ఒక అవకాశం కావచ్చు, కానీ అదే సమయంలో అది కొత్త ఆధారపడే సంబంధానికి ఆరంభమా కాదా అన్న ప్రశ్నకు సమాధానం మాత్రం భవిష్యత్తే చెప్పాలి.

## మైక్రోసాఫ్ట్‌కు ఎఐ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ తన క్లౌడ్, ఏఐ విభాగాలపై పెట్టుబడుల్లో 66 శాతం పెరుగుదల కనిపించింది. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో ఈ విషయం వెల్లడైంది. కానీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అజ్యూర్ వద్ధి గత త్రైమాసికంతో పోలిస్తే మందగించింది. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రాబోయే ఏడాది కాలంలో డేటా సెంటర్ల మీద గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టనున్నాయి. దానికోసం గూగుల్ తప్ప మిగతా కంపెనీలన్నీ రుణాల బాట పట్టనున్నాయి. ఏఐతో తమకు స్వర్ణయుగం వస్తుందనే ఆశతోనే అప్పులు చేస్తున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ రానున్న సంవత్సరాల్లో 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని చెబుతోంది. అయితే 2030కి గానీ లాభాలు రావని ఇప్పటికే వెల్లడించింది.

## లీడర్‌షిప్ కోర్సు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

హాజరై, అంతర్జాతీయ స్థాయి నాయకత్వ పాఠాలను అధ్యయనం చేశారు. కోర్సు ముగింపు సందర్భంగా హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ ఫ్యాకల్టీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వ లక్షణాలు, ప్రజాపాలనపై ఆయనకు ఉన్న స్పష్టమైన దృక్పథాన్ని ఫ్యాకల్టీ ప్రశంసించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## కేంద్రం వద్దే..

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌ఆర్‌ఆర్ కు కలుపుతూ కొత్తగా 10 రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదలను సిఎం ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. వీటికి రూ. 45,000 కోట్ల నిధుల మంజూరు కోరింది. హైదరాబాద్ మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో రైల్ ఫేజ్–2 ప్రాజెక్టు ఫేజ్ 2ఎ, ఫేజ్ 2బి లకు సంబంధించిన రూ.44,028 కోట్ల పప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గోదావరి నుంచి మూసీకి నీటిని మళ్లించే లింక్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.6,000 కోట్ల ఆర్థిక సాయం కోరింది. వరంగల్ భూగర్భ డ్రైనేజీ (యుజిడి) ప్రాజెక్టుకు కేంద్ర నిధులు, హైదరాబాద్ సమగ్ర మురుగు నీటి మాస్టర్ ప్లాన్ (అమృత్ 2.0 / స్పెషల్ ప్రాజెక్ట్), బందర్ పోర్ట్ హైదరాబాద్ డ్రై పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రూ.17,000 కోట్లు, బందర్ పోర్ట్ నుంచి హైదరాబాద్ సమీప డ్రై పోర్ట్ వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం, దాదాపు రూ.17 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని కోరింది. విమానాశ్రయాల అభివృద్ధిలో భాగంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, బసంత్ నగర్ విమానాశ్రయాలు, ఇటీవలే వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్‌లకు ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించాల్సి ఉంది. రైల్వే మార్గాల అనుసంధానం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ – కృష్ణ కొత్త రైలు మార్గం, కల్వకుర్తి – మాచర్ల రైలు లైన్, గద్వాల్–డోర్నకల్ రైలు మార్గం, కాచిగూడ – జగ్గయ్యపేట రైలు మార్గం, పటాన్‌చెరు– ఆదిలాబాద్ రైలు లైన్, బోధన్–లాతూర్ రోడ్ లైన్, అక్కన్నపేట బైపాస్ రైలు లైన్, పాండురంగాపురం–భద్రాచలం రోడ్ లైన్ తదితర రైల్వే లైన్ల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇదిలా ఉండగా, పరిశ్రమలు, పెట్టుబడులకు ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చడం, ఖమ్మం లేదా మహబూబాబాద్ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, పిఎం మిత్ర కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం సాయం, తెలంగాణ రైజింగ్ విజన్–2047 లక్ష్యానికి అనుగుణంగా లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా విద్యుత్ రంగంలో 'పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్' కింద 6 ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, 'పిఎం కుసుమ్' కింద సోలార్ పంప్ సెట్ల కేటాయింపు, సింగరేణికి బొగ్గు బ్లాకుల గుర్తింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–2 మైనింగ్ లీజ్ కేంద్రం చేపట్టాల్సి ఉంది. విద్యారంగంలో నవోదయ విద్యాలయాలు లేని జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల మంజూరు, కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాల్సి ఉంది. గృహ నిర్మాణ రంగంలో పిఎంఎవైజిలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల మంజూరు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు పిఎంఎవైయు విస్తరణ జరగాల్సి ఉంది.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని, భవిష్యత్‌లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా సిఎస్ కె.రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జిఎడి సర్వీసెస్ శాఖలపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సిఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్‌లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సిఎస్ సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రానున్న సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీపై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సిఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని, పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని సిఎస్ అధికారులకు సూచించారు. సహకార డెయిరీ సంస్థల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



## జలాశయాల్లో చేపల పెంపకంపై కార్యాచరణ

చేపల ఉత్పత్తి పెంపు, చెరువులు, కుంటలు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరు, పాలేరు తదితర జలాశయాల్లో చేపల పెంపకంపై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారుల సంక్షేమ పథకాలు సమయానికి లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహించకూడదని సిఎస్ స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. పౌర సరఫరాల పరిధిలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, సరఫరా వ్యవస్థ పనితీరు, ప్రధానంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, లబ్ధిదారులకు సన్న బియ్యం, గోదాముల్లో నిల్వలు, రేషన్ దుకాణాల పనితీరు, ఈపాస్ యంత్రాల వినియోగం, ఆహార భద్రత చట్టం అమలు, రేషన్ కార్డుల జారీ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బిఎండి ఎక్కా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ సువర్ణ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మత్స్యశాఖ కమిషనర్ నిఖిల, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, ఇ.శ్రీధర్, డైరెక్టర్ సెన్సెస్ భారతీ హోళికేరి, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక వ్యవస్థను శాసించేది మూలధనం కాదు.. నైపుణ్యమే

### 'ఫీస్టా 2026' సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతను ప్రస్తుత అంతర్జాతీయ స్థాయి అవసరాలకు అనుగుణంగా 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆ దిశగా యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శుక్రవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఇంటెలిజెంట్ అండ్ ఎవాల్వ్ స్ట్రాటజీస్ ఇన్ టాలెంట్ అక్విజిషన్(ఫీస్టా) 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించేది మూలధనం కాదని, నైపుణ్యం మాత్రమేనన్నారు. నిరంతరం నేర్చుకునే తత్వం ఉన్న చోటే ప్రతిభ నిలుస్తుందని, అదే వృద్ధికి అసలైన ప్రాతిపదిక అన్నారు. భారత వృద్ధి రేటు సుమారు 7 శాతం వరకు ఉండొచ్చని తాజాగా విడుదలైన కేంద్ర ఆర్థిక సర్వే అంచనా వేసిందన్నారు. ఇది శుభపరిణామని, అయితే... ఈ వృద్ధిని నిలబెట్టుకోవాలంటే కేవలం బడ్జెట్ కేటాయింపులు సరిపోవని, సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసర ముందన్నారు. కృత్రిమ మేధపై ఆధారపడటం కంటే, దానిని సమర్థవంతంగా వాడుకునేలా సంస్థలు రూపాంతరం చెందాలని, లేకపోతే... దీర్ఘకాలంలో సవాళ్లు ఎదురయ్యే ప్రమాదముందన్నారు. అత్యుత్తమ మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణను నిలపడంలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, ఐకాం, లైఫ్ సైన్సెస్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటర్నేషన్ స్కూల్స్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ టెక్ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ హెడ్స్, సోషల్ టాలెంట్ ఫౌండర్ జానీ క్యాంప్ బెల్, క్యారలాన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండి పవన్ సచ్ దేవా, క్రౌడ్ స్ట్రైక్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ మీనన్, ప్రముఖ నటి, రచయిత్రి మందిరా బేడీ, ఫీస్టా 2026 ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు హరికృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పారిశ్రామిక–ఐటి మౌలిక సదుపాయాలపై రీకో బృందం అధ్యయనం

### టిజిఐఐసిని సందర్శించిన రాజస్థాన్ ఉన్నత స్థాయి ప్రతినిధులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ఆధునిక పారిశ్రామిక, ఐటి మౌలిక సదుపాయాల విధానాలను అధ్యయనం చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన రీకో (ఆర్ఐఐసిఐ) ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించింది. రాజస్థాన్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (రీకో) మేనేజింగ్ డైరెక్టర్ శివంగి స్వర్ణ కార్ నేతృత్వంలో ఈ బృందం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిజిఐఐసి) ఆధ్వర్యంలోని కీలక పారిశ్రామిక, ఐటి కేంద్రాలను సందర్శించింది. పెట్టుబడులకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తెలంగాణను నిలిపిన టిజిఐఐసి అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) అవగాహన చేసుకోవడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో రీకో బృందం హైటెక్ సిటీ, మైండ్‌స్పేస్ ఐటి పార్క్, జీనోమ్ వ్యాలీతో పాటు రవిర్యాల, మహేశ్వరం (ఈ–సిటీ)లోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించింది. క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం రీకో ప్రతినిధి బృందం టిజిఐఐసి ప్రధాన కార్యాలయంలో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంకతో పాటు ఇతర విభాగాధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా శశాంక తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కార్యాచరణను వివరించారు. రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ వేగంగా ముందుకెళ్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వం, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మార్గదర్శకత్వంలో తెలంగాణ పారిశ్రామిక రంగం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని పేర్కొన్నారు.

**టిజిఐఐసి విధానాలపై ప్రశంసలు**

భూ కేటాయింపులు, పారిశ్రామిక పార్కుల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో టిజిఐఐసి అనుసరిస్తున్న సరళీకృత విధానాలను రీకో ఎం.డి శివంగి స్వర్ణ కార్ అభినందించారు. తెలంగాణలోని ఐటి, లైఫ్ సైన్సెస్ రంగాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె ప్రశంసించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No.48/EE/CIR-49/SLPZ/GHMC/1/2025-26 తేదీ: 29-01-2026

**పని కేటగిరి:** ఇతర పనులు, **అంచనా విలువ:** రూ.32.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 31.01.2026న మ.03.00గం.ల నుండి 07.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సర్కిల్-49, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9000115410.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14712-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మాదాపూర్ సర్కిల్-50**

Lr No.04/GHMC/MPR-50/EE/2025-26 తేదీ: 30-01-2026

**NIT No.**04/GHMC/MPR-50/EE/2025-26, తేదీ: 30-01-2026, **పని పేరు:** ఏర్పాట్లను అందించడం, **అంచనా విలువ:** రూ.1.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 30.01.2026న మ.03.00గం.ల నుండి 02.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మాదాపూర్ సర్కిల్-50, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14764-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్.

టెండర్ నోటీస్ నెం. 01/SE/SHBD/GHMC/2025-26, తేదీ: 24.01.2026, (7 రోజులు)కు సవరణ

| ఐటమ్ నెం. | పని పేరు | అమౌంట్ (రూ. లక్షలలో) |
|---|---|---|
| 1 | 2026-27 సంవత్సరానికి జిహెచ్ఎంసి, ఆదిభట్ల సర్కిల్-15, తొర్రూర్, 53వ వార్డులోని వర్షపు నీటి కాలువలు, డ్రెయిన్లు మరియు కుంట కాలువల్లో పూడికతీత పనులు. | 79.00 |
| 2 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, నాదర్‌గుల్, 57వ డివిజన్‌లోని వివిధ నాలాల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 63.00 |
| 3 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, బడంగ్‌పేట్, 61వ డివిజన్‌లోని వివిధ నాలాల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 55.00 |
| | మొత్తం | 197.00 |

| | ఈవెంట్స్ | ప్రస్తుత తేది & సమయం | సవరించిన తేది & సమయం |
|---|---|---|---|
| I | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 28.01.2026@03.00PM | 30.01.2026@10.00AM |
| II | డౌన్‌లోడ్ ఆఖరి తేది | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |
| III | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |
| IV | ప్రైస్ బిడ్స్ ప్రారంభం | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |

**అధికారి చిరునామా:** శ్రీ డి. కిష్టప్ప, సూపరింటెండింగ్ ఇంజనీర్, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14770-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026


# పేరు మాత్రమే మారింది.. జల దోపిడీ ఆగలేదు

### మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్లమల సాగర్ డిపిఆర్‌ను, ప్రాజెక్ట్ అనుమతుల ప్రక్రియను, ప్రీ ఫీజుబులిటీ రిపోర్టును ఆపినట్టుగా ఎపి ప్రభుత్వం లేదా?, కేంద్రం హామీనిచ్చిందా? అని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల లేదా నల్లమల సాగర్ ఏదైనా కేవలం పేరు మాత్రమే మారిందని, ఎపి జల దోపిడి మాత్రం ఆగలేదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరుకు జలవివాదాల మీటింగ్ అని, మన 200 టిఎంసిలను గంపగుత్తగా తరలించేందుకు నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్ర అని అన్నారు. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మీటింగ్‌లో కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్‌లు అన్నీ అక్రమ ప్రాజెక్టులని, వీటిని నిలిపి వేయాలని యుపి సిఎం ఆదిత్యానాథ్ దాస్ సూచించినట్టు హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఎపికి అప్పగించడమే 'ఢిల్లీ చర్చల లక్ష్యమా' అని ఆయన ప్రశ్నించారు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదని, పొడిచేది రేవంత్ రెడ్డినేనని ఆరోపించారు. గోదావరిలో 400 టిఎంసిలకు గతంలో కెసిఆర్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చారని, దీనిపైన పది డిపిఆర్‌లను పంపించి, ఏడు ప్రాజెక్టులకు అనుమతులు సాధించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో ఒక్క డిపిఆర్‌ను పంపిందని, ఒక్క అనుమతిని కూడా తీసుకొచ్చింది లేదని తెలిపారు. వార్ధా, కాళేశ్వరం మూడో టిఎంసిలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డిపిఆర్‌లు వాపస్ వచ్చాయని, రేవంత్ రెడ్డి పాలనలో డిపిఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని, 2 కోట్ల 20లక్షల ఎకరాల మాగాణిగా మారిందని, కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చిందని, కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైందని, 32 లక్షల ఎకరాల ఆయకట్టు బిఆర్ఎస్ సాధించిందని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా నోరు పారేసుకోక పోవడం మంచిదని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీకి, దావోస్ కు తిరగడమే తప్ప పాలనపైన దృష్టి లేదన్నారు. పోలవరం, నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారమే ఎపికి సహకరిస్తున్నదని ఆరోపించారు.


## మహాత్ముని అడుగుజాడలే మనకు మార్గదర్శకం

### ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, ఆయన పోరాట పటిమను సిఎం గుర్తుచేసుకున్నారు. 'అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా మార్చుకుని, అలుపెరగని పోరాటంతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహోన్నతవ్యక్తి మహాత్మా గాంధీ' అని ముఖ్యమంత్రి కొనియాడారు. బాపు జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం, సహనం, మానవత్వాన్ని నేర్పే ఒక అమూల్యమైన పాఠమని ఆయన అన్నారు. గాంధీజీ ఆశయాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా, వాటిని మన నిత్య జీవితంలో ఆచరించడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే 'అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా, దేశ రక్షణ కోసం, స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరులందరిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి త్యాగాలు దేశానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

**నేటి సమాజానికి గాంధీ మార్గమే శరణ్యం**

నాంపల్లిలోని గాంధీ భవన్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన సత్యం, అహింస, సమానత్వం వంటి విలువలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. గాంధీజీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హార్కర్ వేణుగోపాల్, వి.హనుమంతరావు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత ఆక్షేపణీయం

### ఐపిఎస్ అధికారుల సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీణవంక మినీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గురువారం పోలీసుల మీద చేసిన వ్యాఖ్యలను, వారి ప్రవర్తనను తీవ్రంగా ఐపిఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం కార్యదర్శి విక్రమ్‌సింగ్ మాన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గుంపులుగా వెళ్లడమే కాకుండా, బాధ్యత గల ప్రజాప్రతినిధి అయి ఉండి కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ వెళ్ళడానికి ప్రయత్నించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. అక్కడ ఉత్పన్నమయ్యే శాంతి భద్రతల పరిస్థితి గురించి, కోర్టు ఉత్తర్వుల గురించి పోలీసు అధికారులు ఎమ్మెల్యే పూర్తిగా వివరించినప్పటికీ వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక మహిళా పోలీసు అధికారులపట్ల కూడా దురుసుగా ప్రవర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం గర్హనీయమన్నారు. ఒక బాధ్యత గల ఎమ్మెల్యే పోలీసు అధికారుల మత ప్రస్తావన తేవడం అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. పైగా అక్కడ ప్రత్యక్షంగా లేని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ని ఉద్దేశించి, మత ప్రస్తావన చేస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవన్నారు. ప్రజల పట్ల, శాంతి భద్రతల పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ పోలీసుల ఖ్యాతిని ఎవరూ విస్మరించలేరని గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థ మీద మత పరమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత గర్హనీయం. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వెంటనే తన అసంబద్ధ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, పోలీసు అధికారులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి కూడా ఖండించారు. వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.




# ఇది కులగణన కాదు.. జనగణన మాత్రమే


### కాంగ్రెస్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరోసారి వెనుకబడిన వర్గాలను మోసం చేసిందని, ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు అని మాత్రమే పేర్కొని ఓబిసిలను, అలాగే అన్ని కులాలను విస్మరించి, అవమానించిందని కాంగ్రెస్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మరో జాతీయ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభిస్తుందని చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనవరి 22న విడుదల చేసిన 33 ప్రశ్నలతో కూడిన గెజిట్‌లో క్వశ్చన్ 12లో ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు అని మాత్రమే పేర్కొని, ఓబిసి, జనరల్ అనే విభాగాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించిందని విమర్శించారు. అలాగే, ఆ ఫారంలో ఎక్కడా క్యాస్ట్ అనే పదాన్ని ఉపయోగించకపోవడం ద్వారా ఇది కుల గణన ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ నినాదం 'జిస్కీ జిత్ని ఆబాది, ఉస్కీ ఉత్ని హిస్సేదారి' అనుసరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శనంలో అసెంబ్లీలో గెజిట్ విడుదల చేసి, మూడు నెలల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా నివేదిక సిద్ధం చేసిందని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాల లెక్కలను అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుకు తీసుకువచ్చారని, అలాగే 80కి పైగా ప్రశ్నలతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించారని రుద్ర సంతోష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామి, ఓబిసి కన్వీనర్ కేతూరి వెంకటేష్, అధికార ప్రతినిధి కౌశిక్ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఓబిసి వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, విజయ్ భాస్కర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గాంధీ బోధనలు నేటి తరానికి అవసరం

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మాగాంధీ బోధనలు నేటి తరానికి ఎంతో అవసరమని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆ తదుపరి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ ప్రపంచమంతా నేడు ఉద్రిక్తత వాతావరణం చూస్తున్నా మనము, దేశాల మధ్య సుద్భావన, సోదర భావం నెలకొనేందుకు గాంధీ శాంతి మార్గమే ఏకైక మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, అసిస్టెంట్ సెక్రటరీ మనోహర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

04
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
31-01-2026
www.prajapaksham.in
స్థానికం
LOCAL NEWS

# కాంగ్రెస్‌తోనే పట్టణాల సమగ్రాభివృద్ధి

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్టలో కాంగ్రెస్, సిపిఐ 'నగారా'..

అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలో హోరెత్తిన జనసందోహం

ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర నాయకుడు గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని చాటుకుంది. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ గుట్ట వీధుల్లో జనసంద్రాన్ని తలపించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు ముఖ్య అతిథులుగా హాజరై అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. పట్టణంలోని లక్ష్మి నరసింహ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. కాంగ్రెస్, సిపిఐ జెండాలు, ఉత్సాహభరితమైన నినాదాల మధ్య కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు. ర్యాలీ పొడవునా ప్రజలు అభ్యర్థులకు, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. పట్టణాల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే సత్తా కాంగ్రెస్ కౌన్సిలర్లకే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోంది. తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు మహిళా సంఘాల బలోపేతానికి, యువత ఉపాధికి తమ పార్టీ కట్టుబడి ఉంది. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయని ఏకైక పార్టీ కాంగ్రెస్. రాబోయే ఎన్నికల్లో మన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, యాదగిరిగుట్టను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందాం' అని అయిలయ్య పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో మిత్రపక్షాలుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలన చేసిన బిఆర్ఎస్ పాలకులు యాదగిరిగుట్టను అభివృద్ధి పేరిట విధ్వంసం చేశారని స్థానికులకు ఉపాధి లేకుండా బతుకుదెరువు లేకుండా చేశారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ఓటు వేస్తే అభివృద్ధి జరగదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ ర్యాలీ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కాంగ్రెస్ గాలి బలంగా వీస్తోందని, మెజారిటీ వార్డుల్లో పార్టీ జెండా ఎగరడం ఖాయమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండ్రు శోభారాణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, ముక్కెర్ల మల్లేష్, గుండ్లపల్లి భరత్, సాదునేని మధుకర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి మహేందర్, సీనియర్ నాయకులు పేరు బోయిన పెంటయ్య, భారీ సంఖ్యలో కాంగ్రెస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13 వార్డులకు 84 నామినేషన్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026 భాగంగా భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి 13 వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా ముగిసింది. కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి సిపిఎం స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొదటిరోజు 2, రెండవ రోజు 16 మూడవరోజు 56 మొత్తం 84 నామినేషన్లు వేసినట్టు సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ 31, బిఆర్ఎస్ 31, బిజెపి 19, సీపీఎం 2, స్వతంత్రులు 1 చొప్పున 61 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఉదయం నుంచి మొదలైన నామినేషన్ల ప్రక్రియ నెమ్మదిగా మొదలయ్యి చివరి నిమిషంలో అన్ని పార్టీల నుంచి జోరుగా నామినేషన్ల పర్వం కొనసాగింది. మద్దతుదారులతో భారీ ర్యాలీలతో వచ్చి కీలక పార్టీ మున్సి చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు వేయటం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్లు ముగిశాయి. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



## కన్నయ్యకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ సత్యం

దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత



**ప్రజాపక్షం/నాంపల్లి:** నాంపల్లి మండలం దేవత్‌పల్లి కి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త దివ్యాంగుడు ముదిగొండ కన్నయ్య కు దివ్యాంగుల ఎలక్ట్రానిక్ బ్యాటరీ ట్రై సైకిల్‌ని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నల్లగొండలో అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఎల్ బి సి సొరంగమర్గం, నక్కలగండి ప్రాజెక్టు పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గంకు సాగునీరు అందించి శశ్యామలం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో 2023 మే నెలలో చేపట్టిన పాదయాత్రలో దివ్యాంగుడైన కనకయ్య దివంగత్వాన్ని లెక్కచేయకుండా పాదయాత్రలో ముందు నడిచిన సమయంలో కాలు లేక ఇబ్బంది పడడం చూసి ఇచ్చిన ట్రై సైకిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చి హామీ మేరకు సైకిల్ అందజేయడం జరిగిందన్నారు.జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన వారికీ పారదర్శకంగా అందజేయాలన్నారు. కన్నయ్య మాట్లాడుతూ తన ఆరోగ్య పరిస్థితి,పడుతున్న బాధలు గ్రహించి,వంటికాలుతో ఇబ్బంది పడుతున్న తనకు బ్యాటరీ ట్రై సైకిల్ సహకారం అందించిన ఎమ్మెల్సీ సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం: ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవ్వడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ఏవియం.స్కూల్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, నిరుపేదలు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,లయన్ క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్ మోహన్, వై. మోహన్ రెడ్డి, కొండ సంతోష్ ,బుడిగె శ్రీనివాసులు ఎ.న్. రామ్మోహన్ రావు,కందాళ పాపిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

చివరి రోజున భారీ ఎత్తున నామినేషన్ల దాఖలు

కొందరు అభ్యర్థులు డబుల్ నామినేషన్ సెట్ల దాఖలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటి లకు జరుగుతున్న రెండవ సాధారణ 2026 ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రెండు మున్సిపాలిటికిలకు సంబంధించి మూడవ రోజు ఆశావాహులు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్, బిజెపి, సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీల నుండి పోటీచేయదలిచిన అభ్యర్థులు రెండు, మూడు నామినేషన్ల సెట్లను దాఖలు చేయడం జరిగింది. స్క్రూట్నీలో ఎంతమంది ఆశావాహులు నామినేషన్ల తిరస్కరణకు గురవుతాయో ఎంతమంది నామినేషన్లు యాక్సెప్ట్ అవుతాయో వేచిచూడాల్సిందే. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28 వార్డులలో , నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలోని 15 వార్డులలో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు అయ్యాయి. హుజూర్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో నిలిచేందుకు వివిధ పార్టీలు, రెబల్, ఇండిపెంటెంట్ అభ్యర్థులు నామినేషన్లు 00 దాఖలు చేయగా, నేరేడుచర్ల మున్సిపాలిటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు 90 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల నుండి పోటీ చేయదలిచిన కొందరు అభ్యర్థులు రెం డు, మూడు నామినేషన్లుసెట్లు దాఖలు చేయడంతో పాటు వారి సమీప బం ధువులు, స్నేహితులతో నామినేషన్లు దాఖలు చేయించడం జరిగింది.

## 90మంది 117 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/చండూరు:** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా మూడు రోజుల నామినేషన్ల స్వీకరణలో చండూరు మున్సిపాలిటీలో మొత్తం 90మంది కి 117 నామినేషన్లను దాఖలు చేశారు. మొదటి రోజు నాలుగు నామినేషన్లు , రెండవ రోజు 29 నామినేషన్లు , నామినేషన్లకు చివరిరోజు శుక్రవారం రోజున ఏకంగా 60మంది 84 నామినేషన్లు దాఖలు చేశారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులకు గాను మొత్తం 117 నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల సహాయ అధికారి, చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం తెలిపారు. కాంగ్రెస్ నుండి 45 నామినేషన్లు, బిఆర్ఎస్ నుండి 26 నామినేషన్లు, బిజెపి నుండి 20 నామినేసన్లు, బిఎస్‌పి నుండి 03 నామినేషన్లు , సిపిఐ నుండి 02 నామినేషన్లు, ఇతర రిజిస్టేషన్ పార్టీల నుండి 05, స్వతంత్రులు 16 మంది తమ నామినేషన్లను దాఖలు చేశారు.

## హాలియాలో 135 నామినేషన్లు



**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది.హాలియా మున్సిపాలిటీలో మొత్తం 135 నామినేషన్లు దాఖలు అయినట్లు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం 95 నామినేషన్లు వచ్చినట్లు ఆయన చెప్పారు. మొత్తం 108 మంది అభ్యర్థులు, 135 నామినేషన్లు వేసినట్లు చెప్పారు. ఇందులో బిజెపి 11,బిఎస్‌పి4,కాంగ్రెస్ పార్టీ నుంచి61,బీఆర్ఎస్ నుంచి40 నామినేషన్లు వచ్చినట్లు,రిజిస్టర్ అయిన పార్టీల నుంచి ఒకటి,స్వతంత్ర అభ్యర్థుల నుంచి 18 నామినేషన్లు దాఖలు అయినట్లు చెప్పారు.అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువమంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం.

## ఓట్ల లెక్కింపునకు అనువైన కేంద్రాలు చూడాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు గాను అనువైన కేంద్రాన్ని చూడాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసి గోదామును మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై పరిశీలించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న 6 మున్సిపాలిటీలు,నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఒకే చోట చేపట్టే విధంగా ఓట్ల లెక్కింపు కేంద్రం ఉండాలని,ప్రతి మున్సిపాలిటీకి ఒక కౌంటింగ్ హాల్ తో పాటు,స్ట్రాంగ్ రూమ్,సీలింగ్ రూమ్ తదితర సౌకర్యాలు ఉండాలని, ఆ విధంగా అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రాలను చూడాలని చెప్పారు.ఆర్జాల బావి ఎస్‌డబ్ల్యూసి గోదాంతో పాటు,ఇంకా ఏవైనా అనువైన భవనాలలో ఓట్ల లెక్కింపుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డిని ఆదేశించారు.ముఖ్యంగా అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపుకు అనువైన విధంగా హాల్స్,పోటీ చేసిన అభ్యర్థులు,ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరికీ సౌకర్యంగా ఉండేలా రవాణా సదుపాయం అన్నింటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఎస్ బ్ల్యుసి రీజనల్ మేనేజర్ వీరమల్లు, మేనేజర్ మురళి ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర,స్థానిక తహసిల్దార్ పరశురాం కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

143 కళాశాలల నుండి 9,251మంది విద్యార్థులకు..

86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు

ఫిబ్రవరి 2 నుండి 11వరకు పరీక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఇంటర్మీడియట్,సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల పై సమావేశం నిర్వహించారు.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 11వరకు ఉంటాయని,ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు.ఈ పరీక్షలకు జిల్లాలోని 143 జూనియర్ కళాశాలల నుండి మొత్తం 9,251మంది విద్యార్థులు హాజరుకానున్నారని,ఇందులో జనరల్ విభాగంలో 6,092 మంది,వొకేషనల్ విభాగంలో3,159 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.అలాగే రెండవ సంవత్సరం విద్యార్థుల్లో ఎంపిసి లో 3,850 మంది, బైపిసిలో 2,016 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో57 జనరల్ జూనియర్ కళాశాలలు,29 వొకేషనల్ జూనియర్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు.జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్,ప్రిన్సిపల్స్ రాకేందు కుమార్,ధనరాజ్ ,పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

## బాధ్యతతో సమర్థవంతంగా మున్సిపల్ ఎన్నికలు

ఎన్నికల అబ్జర్వర్ పి.గౌతమి ఐఎఎస్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ఫిబ్రవరి 11న జరిగే పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026లో ప్రతి ఎన్నికల అధికారి బాధ్యతతో సమర్థంగా పనిచేసి ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించాలని భువనగిరి జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్ పి.గౌతమి అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం ఆమె పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోద్ మందిరం వద్ద ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏర్పాట్లు చూసి సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డిని ఎస్ఐ భాస్కర్ రెడ్డిని అభినందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డిని ఆమె ఎన్నికల సిబ్బంది ఆర్వోలు ఏఆర్ఓల వివరాలు ఓటర్ల జనాభా జాబితా వార్డుల వారిగా స్త్రీ, పురుషుల ఓటర్ల సంఖ్య కౌన్సిలర్ల కేటగిరీల వారిగా రిజర్వేషన్లు పోలింగ్ కేంద్రాల సంఖ్య, బూత్‌ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల లోకేషన్స్, పోలీసు భద్రత సిబ్బంది, వాహనాల సంఖ్య పోలీస్ సిబ్బంది తదితర ఎలక్షన్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌ల పరిశీలన, విత్‌డ్రా, తుది జాబితా, గుర్తుల కేటాయింపు, ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్ పూర్తయి విజేతల ప్రకటించే వరకు ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తంగా ఉండి క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. 2011 నాటి పోచంపల్లి జనాభా సెన్సెస్ ఓటర్ల జాబితా 17010, ప్రస్తుత మున్సిపల్ పరిధిలోని ఓటర్ల ఫోటో గుర్తింపు జాబితా 15827 లాంటి వివరాలను ఆమెకు అందించారు. సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, నాగేశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, మజీద్ దామోదర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆదిత్య, మైథిలి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ఎమ్మెల్యే కుటుంబసభ్యుల నామినేషన్



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఆఖరు రోజు శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు ముగ్గురు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. ఎమ్మెల్యే సతీమణి బత్తుల మాధవి 39వ వార్డు, పెద్ద కుమారుడు బత్తుల సాయిప్రసన్నకుమార్‌రెడ్డి 40వ వార్డు నుంచి, చిన్న కుమారుడు బత్తుల గణేష్‌ఈశ్వర్‌రెడ్డి 28వ వార్డు నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పదవి మహిళా జనరల్ రిజర్వేషన్ కావడంతో సతీమణి మాధవిని వార్డు అభ్యర్థిగా నిలబెట్టారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మిర్యాలగూడ పుర పీఠంపై ఎవరు కూర్చొనేది వచ్చే నెల 13న తేలనుంది.

## ముగిసిన నామినేషన్ల పర్వం

రాత్రి పొద్దుపోయేంత వరకు సాగిన నామినేషన్ల దాఖలు



**ప్రజాపక్షం/సూర్యాపేట** : మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలాల శుక్రవారం ముగిసింది. చివరి రోజు కావడంతో ఆయా పార్టీల నుండి నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమైన నామినేషన్ల దాఖలాలు సాయంత్రం 5 గంటల వరకు ముగియాల్సి ఉండగా సాయంత్రం 4 గంటల తరువాత ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆయా మున్సిపాలిటి కార్యాలయాల వద్దకు భారీగా తరలివచ్చారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయంలోకి 5 గంటలలోపు వచ్చిన వారందరికి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. సూర్యాపేట, హుజూర్‌నగర్ మున్సిపాలిటిలలో దాఖలైన నామినేషన్లు ఎన్ని అనేది అధికారులు అధికారికంగా రాత్రి పొద్దుపోయేంత వరకు వెల్లడించలేదు.

### దాఖలైన నామినేషన్ల వివరాలు...

కోదాడ మున్సిపాలిటిలో శుక్రవారం మొత్తం 35 వార్డులకు గాను 283 నామినేషన్లు దాఖలు కాగా మొత్తం 333 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 152, బిఆర్ఎస్ నుంచి 73, బిజెపి నుండి 28, టిడిపి నుండి 4, సిపిఎం 3, బిఎస్‌పి నుండి ఒక్కరు, ఇతర పార్టీల నుండి 8, స్వతంత్రులుగా 64 మంది నామినేషన్ల దాఖలాలు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా చివరి రోజు 102 నామినేషన్లు దాఖలు కాగా మూడు రోజులు కలిపి మొత్తం 160 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 73, బిఆర్ఎస్ నుంచి 39, బిజెపి నుండి 24, సిపిఎం 3, ఇతర పార్టీల నుండి 3, స్వతంత్రులుగా 18 మంది నామినేషన్ల దాఖలయ్యాయి. నేరేడుచర్ల మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా చివరి రోజు 52 నామినేషన్లు దాఖలు కాగా మూడు రోజుల్లో మొత్తం 90 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 33, బిఆర్ఎస్ నుంచి 19, బిజెపి నుండి 18, సిపిఎం 4, టిడిపి 1, ఇతర పార్టీల నుండి 2, స్వతంత్రులుగా 13 మంది నామినేషన్ల దాఖలాలు చేశారు.

## నల్లగొండలో ఒక కార్పొరేషన్ 6మున్సిపాలిటీలలో 1706 నామినేషన్లు

చిట్యాల మున్సిపల్‌లో ట్రాన్స్ జెండర్ నామినేషన్

నేడు నామినేషన్ల పరిశీలన

**ప్రజాపక్షం/నలగొండ:** కార్పొరేషన్ మున్సిపల్ పోరుకు నామినేషన్ల దాఖల పర్వం శుక్రవారంతో ముగిసింది. నల్లగొండ జిల్లాలో ఒక్క కార్పొరేషన్ తోపాటు ఆరు మున్సిపాలిటీ లో 162వార్డులకు గత మూడు రోజులవారీగా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి దాఖాలు చేశారు. మొదటి రోజు43మంది అభ్యర్థులకు 44నామినేషన్ లు దాఖలు చేయ గా రెండో రోజు 532మంది అభ్యర్థులు 597నామినేషన్ రాగ చివరి రోజు 1706 నామినేషన్ దాఖలు చేశారు. గడువు ముగిసే సమయానికి కార్యాలయాల ఆవరణలో ఉన్న వారందరికీ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక అనుమతిని కల్పించారు. దీనితో చివరి నిమిషం వరకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా భారీ ఎత్తున పత్రాలను సమర్పించారు. నల్లగొండ కార్పొరేషన్ లో 48వార్డులకు 334 మంది అభ్యర్థులు 582నామినేషన్ లు వేశారు. హాలియాలో 108మంది అభ్యర్థులు 135నామినేషన్,చండూరు 90 మంది అభ్యర్థులు 117నామినేషన్ లు, చిట్యాల లో106 మిర్యాలగూడలో 327మంది అభ్యర్థులు 507నామినేషన్, దేవరకొండ 138మంది 164 నామినేషన్,నందికొండలో 95నామినేషన్‌లు దాఖలు చేశారు.అయితే చిట్యాల మున్సిపాలిటీలో మొట్టమొదటిసారిగా జనరల్ ఎస్‌సి స్థానమైన 1వ వార్డు (శివనేనిగూడెం) స్థానంలో అదే వార్డుకు చెందిన ట్రాన్స్‌జెండర్ నాగిళ్ళ కావేరి (సుధాకర్) నేడు నామినేషన్ సమర్పించారు. చిట్యాల ఎన్నికల చరిత్రలో ఒక ట్రాన్స్‌జెండర్ నామినేషన్ దాఖలు చేయడం మొదటి సారి కావడం విశేషం.

నేడు నామినేషన్ల పరిశీలన :ఈ ఎన్నికల ప్రక్రియలో తదుపరి అధికారులు నామినేషన్ల పరిశీలనచేపట్టనున్నారు.అభ్యర్థులు సమర్పించిన పత్రాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా లేదా అని నిశితంగా పరిశీలిస్తారు.ఆ తరువాత నిబంధనల ప్రకారం ఉన్న నామినేషన్లను ఆమోదించి పేర్లను ప్రకటిస్తారు. వచ్చే నెల 3వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.రాజకీయ సమీకరణాలు,బుజ్జగింపుల పర్వం ముగిసిన తర్వాత అదే రోజు సా యంత్రం పోటీలో తుది అభ్యర్థుల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు.

## చివరి రోజు 327 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మూడో రోజైన శుక్రవారం రికార్డు స్థాయిలో 327 నామినేషన్లు దాఖలు అయ్యాయి. తొలి రోజు కేవలం 4 నామినేషన్లు దాఖలు కాగా రెండవ రోజు 176 నామినేషన్లు రాగా చివరి రోజు 327 నామినేషన్లను కలిపి పట్టణంలోని 48 వార్డులకు గాను 327 మంది అభ్యర్థులు 507 నామినేషన్లు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. పార్టీల వారీగా చూస్తే ఆమ్ ఆద్మీ పార్టీ 5, బీజేపీ 56, బీఎస్పీ 5, సీపీఎం 11, కాంగ్రెస్ 213, ఎంఐఎం 1, బీఆర్ఎస్ 139, టీడీపీ 2, అదర్ రిజిస్టర్ పార్టీల తరుపున 19, ఇండిపెండెంట్లు 56తో కలిపి 507 నామినేషన్ సెట్లను స్వీకరించినట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తయిన అనంతరం కమీషనర్ గనవేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీసు శాఖలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు బాలు, కోటయ్య, వెంకన్న, అంజయ్య, జ్ఞానేశ్వరి తదితరులు ఉన్నారు.

## చిట్యాల మున్సిపాలిటీలో 106 నామినేషన్లు దాఖలు

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి జరగనున్న ఎన్నికల కోసం 12 వార్డులకు గాను శుక్రవారం నామినేషన్‌ల గడువు ముగిసే సరికి మొత్తం 106 మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ ఆశావాహులు 34 మంది, బిఆర్ఎస్ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న 33 మంది, బిజెపి నుండి 15, సిపిఎం నుండి 3, బిఎస్‌పి నుండి 3, ఇండిపెండెట్లు 7, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుండి 11 మంది నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. ఇందులో పలువురు అభ్యర్థులు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. నేడు శనివారం దాఖలైన నామినేషన్‌లను అధికారులు పరిశీలించి చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు.

## కాంగ్రెస్‌లోనే ఉంటా:శశి థరూర్



**తిరువనంతపురం:** తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ఊహాగానాలకు కాంగ్రెస్ సినియర్ నేత శశి థరూర్ తెరదించారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లబోనని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసిన మరుసటి రోజే థరూర్ ఈ ప్రకటన చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. శశి థరూర్ కొన్ని నెలలుగా ఆర్ఎస్ఎస్, బిజెపి, ప్రధాని మోదీపై సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. అకస్మాత్తుగా ఆయన ప్రవర్తన మాడంతో కాంగ్రెస్ పార్టీని వీడుతారనే ఊహాగానాలు వెలువడ్డాయి. ఎన్నో నెలలుగా ఈ ఊహాగానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వీటిపై స్పందించలేదు. తాజాగా ఖడ్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం స్పందించారు. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతత్వంలోని యూడిఎఫ్ గెలుపుకోసం తాను ముందుండి పనిచేస్తానని థరూర్ చెప్పారు. కేరళ ప్రచారంలో చురుకుగా పాల్గొంటానని, కాంగ్రెస్‌కు బలంగా నిలుస్తానని తెలిపారు. తనపై వస్తున్న పార్టీ మార్పు వార్తలకు ఎలాంటి ఆధారం లేదని తేల్చిచెప్పారు. అదేసమయంలో రాహుల్ గాంధీపై థరూర్ ప్రశంసల వర్షం కురిపించారు. రాహుల్‌కు స్పష్టమైన రాజకీయ ఆలోచన ఉందని, సంప్రదాయ విభజనకు వ్యతిరేకంగా నిలబడే నాయకుడని అన్నారు. తన దష్టి అంతర్గత రాజకీయాలపై కాదని, దేశానికి సంబంధించిన అంశాలపైనేనని స్పష్టం చేశారు. 2009 నుంచి తాను ఇదే తరహా వైఖరి కనబరుస్తున్నానని, పార్టీ అధికారిక నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. తన విధేయతపై పదేపదే ప్రశ్నలు రావడంపై థరూర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని మళ్లీ మళ్లీ చెప్పాల్సిన అవసరం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. ఇలాంటి సందేహాలు తనకే ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని, అయినా తాను కాంగ్రెస్‌తోనే గట్టిగా నిలబడతానని చెప్పారు. ఖడ్గే, రాహుల్ గాంధీతో జరిగిన భేటీ గురించి థరూర్ వివరించారు. పార్లమెంట్ భవనంలో జరిగిన ఈ సమావేశం గంట నలభై ఐదు నిమిషాల పాటు సాగిందని తెలిపారు. సమావేశంలో తన ఆవేదనలను నాయకుల దష్టికి తీసుకెళ్లానని, చర్చ చాలా సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని అన్నారు. ఇప్పుడు అందరం ఒకే దారిలో కలిసి ముందుకు సాగుతున్నామని, ఇక చెప్పడానికి ఏమీ మిగలలేదని వ్యాఖ్యానించారు.

## 'సంచార్ సాథీ'తో 1.52 కోట్ల మొబైల్ నెంబర్లు బ్లాక్




**న్యూఢిల్లీ :** సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్‌నకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా మంది సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్ సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్ ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలను ఎదుర్కొనే బలమైన ఆయుధంగా సంచార్ సాథీ పనిచేస్తోందన్నారు. గతంలో విదేశీ కాలర్ల నుంచి సుమారు 1.35 కోట్ల నకిలీ కాల్స్ రికార్డు అయ్యేవని.. ప్రస్తుతం అటువంటి కాల్స్ దాదాపు 95 శాతం మేర తగ్గాయని మంత్రి వివరించారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెడుతుందనే ఆరోపణల్లో నిజం లేదని మంత్రి పేర్కొన్నారు. అసలు స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని పేర్కొన్నారు.

# జాతిపితకు ఘన నివాళి

### రాష్ట్రపతి, ప్రధాని శ్రద్ధాంజలి



**న్యూఢిల్లీ:** జాతిపిత మహాత్మా గాంధీకి జాతి ఘన నివాళి అర్పించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గాంధీ స్మృతివనం వద్ద గాంధీ సమాధికి పూలమాలలు వేసి... శ్రద్ధాంజలి ఘటించారు. 1948 జనవరి 30న ఢిల్లీలోని బిర్లా భవన్(ప్రస్తుతం గాంధీ స్మృతి)లోని ప్రార్థనా సమావేశంలో నాథూరాం గాడ్సే కాల్పులు జరపడంతో గాంధీ ప్రాణాలు కోల్పోయారు. ఈ రోజును దేశవ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. 'జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. పూజ్య బాపు ఎల్లప్పుడూ స్వదేశీని నొక్కిచెప్పారు. ఇది అభివద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి మూలస్తంభం. ఆయన వ్యక్తిత్వం, విజయాలు భారతీయులు విధి మార్గం అనుసరించడానికి ప్రేరేపిస్తాయి' అని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మహాత్ముని 78వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాజ్‌ఘాట్ వద్ద అధికారిక నివాళులు, ప్రార్థనా కార్యక్రమాలు జరిగాయి. ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధులు బాపు సమాధుల వద్ద ఘన నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జీవితం అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, సర్వోదయం వంటి సూత్రాలతో నిండినది. 'హే రామ్' అంటూ ప్రాణాలు విడిచిన ఆ మహానుభావుడి ఆదర్శాలు ఇప్పటికీ ప్రపంచానికి శాంతి, సమానత్వం మార్గాన్ని చూపుతున్నాయి. ఆయన మార్గమే దేశ భవిష్యత్తుకు శిరోధార్యంగా నిలుస్తోంది.

**గాంధీ ఒక ఆలోచనా విధానం**

రాహుల్ గాంధీ మహాత్మా గాంధీ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని ఒక ఆలోచనా విధానమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. మహాత్మా గాంధీని 'భారతదేశ అమర ఆత్మ' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు జాతిపితకు నివాళులు అర్పించారు. 'స్వాతంత్ర్యంతో పాటు జాతిపిత మనకు సత్యంకు చెందిన శక్తి అధికార శక్తి కంటే గొప్పదని, హింస, భయం కంటే అహింస, ధైర్యం గొప్పవని ప్రాథమిక సూత్రాన్ని ఇచ్చారు. ఈ ఆలోచనా విధానాన్ని తుడిచిపెట్టలేము. ఎందుకంటే గాంధీ భారతదేశ ఆత్మలో అమరుడు' 'ఎక్స్' పోస్ట్‌లో హిందీలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మహాత్మా గాంధీ పాడిన భజనలోని పంక్తులను పంచుకుంటూ, 'బాపు నుంచి మనల్ని వేరు చేసిన ద్వేషం... దాని పరిష్కారం కూడా బాపు మార్గంలో ఉంది. సత్యంకు చెందిన వెలుగు, అహింసకు చెందిన శక్తి, కరుణ. అమరవీరుల దినోత్సవం సందర్భంగా జాతిపితకు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 1948లో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి రాసిన రెండు వేర్వేరు లేఖలను గుర్తుచేసుకున్నారు, వాటిలో వారు హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను తీవ్రంగా విమర్శించడంతో పాటు ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్) కె.సి.వేణుగోపాల్ మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ... '1948లో ఈ రోజున భారతదేశానికి, ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిన గొప్ప ఆత్మ 'మా నుంచి లాక్కోబడింది' అని అన్నారు.

## వాషింగ్ మెషిన్‌లో శుభ్రం చేశారా?

### అన్నా డిఎంకే అవినీతిపై బిజెపికి స్టాలిన్ ప్రశ్న



**చెన్నై:** అవినీతి కేసుల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ కూటమి భాగస్వామి అన్నాడిఎంకేను వారి 'వాషింగ్ మెషీన్' లో శుభ్రం చేశారా అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం బిజెపిపై తీవ్ర దాడి చేశారు. డిఎంకేపై 'నిరాధార ఆరోపణలు' చేస్తున్నందుకు కాషాయ పార్టీని లక్ష్యంగా చేసుకుని ఎన్‌డిటీవీ తమిళనాడు సమ్మిట్‌ను ప్రారంభించిన తర్వాత స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడు వద్ధిని జీర్ణించుకోలేని వారు 'వాట్సాప్ విశ్వవిద్యాలయం' ద్వారా అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. 'మాపై చేసిన ఆరోపణలన్నీ పాత స్క్రిప్ట్‌ను అనుసరిస్తాయి. వీటిలో మొదటిది రాజకీయ రాజవంశ ఆరోపణ. నేను ఇప్పటికే దీనికి సమాధానం ఇచ్చాను. రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ఎవరయినా స్వేచ్ఛగా ఉండవచ్చు. కానీ వారు ప్రజల ముందు నిలబడాలి. వారి నమ్మకాన్ని సంపాదించాలి. విజయం సాధించడానికి ఓట్లు గెలుచుకోవాలి. ఇది క్షేత్రస్థాయిలో మమ్మల్ని ఎదుర్కోలేని వారు చేసిన నిరాధారమైన ఆరోపణ' అని డిఎంకే అధినేత అన్నారు. 'వారు మాపై చేసిన రెండవ ఆరోపణ 'అవినీతి'. ఇప్పటివరకు ఎవరైనా మాపై చేసిన ఒక్క ఆరోపణను నిరూపించారా' అని ఆయన ప్రశ్నించారు. 'ప్రస్తుతం మీతో ఉన్న వారు అవినీతిలో నిజంగా పాల్గొన్నవారు. ముఖ్యంగా అన్నాడిఎంకే, వారు అవినీతి కేసుల్లో సుప్రీం కోర్టు ద్వారా దోషులుగా నిర్ధారించబడ్డారు. మీరు వారితో పొత్తు పెట్టుకోనప్పుడు, మీరు వారిపై ఎన్ని ఆరోపణలు చేశారు?. ఇప్పుడు మీరు వాటిని మీ వాషింగ్ మెషీన్‌లో కడిగారా? అని సిఎం స్టాలిన్ అన్నారు.

## సీట్ల పంపిణీపై డిఎంకెతో త్వరలో చర్చలు

### టిఎన్‌సిసి అధ్యక్షుడు సెల్వ పెరుంతగై



**చెన్నై:**కాంగ్రెస్‌డిఎంకె సంబంధాలలో ఎలాంటి చీలికలు లేవని, రెండు పార్టీలు సిట్ల పంపకాల చర్చలను వారంలో ప్రారంభిస్తాయని టీఎన్‌సిసి అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై శుక్రవారం తెలిపారు. డిఎంకేతో చర్చల సందర్భంగా తమ పార్టీకి ఆశించిన సంఖ్యలో సిట్లు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'మేము మా మిత్ర పక్షంపై ఒత్తిడి తీసుకురావడం లేదు. మేము అడిగి మాకు కావలసినవి పొందుతాం. డిఎంకే (మాకు) ఇస్తుంది' అని సెల్వపెరుంతగై తిరువళ్లూరులో విలేకరులతో అన్నారు. ఇటీవల దేశ రాజధానిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో డిఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కనిమొళి సమావేశం గురించి టీఎన్‌సిసి మాట్లాడుతూ 'మేము చర్చలు జరుపుతున్నాం. మళ్లీ ఒక వారంలో చర్చలు ప్రారంభిస్తాం' అని అన్నారు. అన్నాడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ముఖానికి 'ముసుగు' వేసుకుని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. 'ఆ సమావేశంలా కాకుండా, మా నాయకురాలితో కనిమొళి సమావేశం సూటిగా, గౌరవప్రదంగా ఉందని అన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిఎంకే 25 సిట్లు కేటాయించింది. కానీ 18 సెగ్మెంట్లలో విజయం సాధించింది. ఇదిలాఉండగా, ట్యూటికోరిన్ పర్యటనలో ఉన్న కనిమొళి విలేకరులతో మాట్లాడుతూ డిఎంకేకాంగ్రెస్ మధ్య చర్చలు 'సజావుగా సాగుతున్నాయి' అని తెలిపారు. 'చర్చలు ముగిసిన తర్వాత మా పార్టీ అధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తారు' అని రాహుల్ గాంధీతో తన సమావేశం గురించి వివరాల్లోకి వెళ్లకుండానే లోక్‌సభ సభ్యురాలు అన్నారు.

## సోషల్ మీడియా వాడొద్దు

### నితీశ్ సర్కార్ హెచ్చరిక



**పాట్నా:** బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వాడకంపై కఠిన ఆంక్షలు విధించింది. డిజిటల్ వేదికల్లో అనుచిత వ్యాఖ్యలు లేదా దురుసుగా ప్రవర్తించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అనుమతి లేకుండా ఖాతాలు సష్టించడం, రీల్స్ చేయడం, ప్రత్యక్ష ప్రసారం చేయడం, ఏదైనా పాలసిపై వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తపరచడంపై పూర్తిగా నిషేధం విధించింది. ఒకవేళ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సోషల్ మీడియా ఖాతా సష్టించే ముందు సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందడం తప్పనిసరి చేసింది. అనామక లేదా నకిలీ ఖాతాలు ఉపయోగించడంపైనా పూర్తిగా నిషేధం విధించింది. ఒకవేళ ఉల్లంఘనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడానికి బీహార్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లో అనుచిత వ్యాఖ్యలు చేసే లేదా దురుసుగా ప్రవర్తించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రతిష్టను కాపాడటానికి ఈ నియమం అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేబినెట్ మార్గదర్శకాల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా విధుల్లో ఉన్నప్పుడు కంటెంట్‌ను సష్టించడం నిషేధం. 'ఏ రకమైన రీల్, వీడియో, ఫొటో లేదా ప్రత్యక్ష సంభాషణను ప్రసారం చేయడం నిబంధనలను నేరుగా ఉల్లంఘించినట్లుగా పరిగణించబడుతుంది. ఇటువంటి వీడియోలు తరచుగా ప్రతికూల సందేశాన్ని పంపుతాయని, కార్యాలయ గోప్యతను ఉల్లంఘిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ విధానాలు, పథకాలు లేదా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు నిర్ణయాలపై ఏ ఉద్యోగి కూడా తమ వ్యక్తిగత అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

### మహారాష్ట్ర అధికార చక్రాన్ని మలుపుతిప్పిన...

# రాజకీయ 'పెద్దన్న' అజిత్‌పవార్

**రెండు ఎన్‌సిపి విలీన చర్చల్లో ' పురోగతి'**

**తన బాబాయి శరద్ పవార్ అనుమతితో 'ఎన్‌సిపి విలీనం సాకారం అవుతుందని' చివరి వ్యాఖ్యలు**

**ముంబయి:** మహారాష్ట్రలో సుదీర్ఘకాలం ఉపముఖ్యమంత్రిగా కొనసాగిన అజిత్‌పవార్ మరణం మహారాష్ట్రలోని రాజకీయ సమీకరణాలను వేడెక్కిస్తోంది. రెండు రోజుల క్రితం విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), అతని మామ శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి పార్టీ రెండింటి విలీనం 'చాలా పురోగతి'లో ఉంది. అయితే ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి ముందే ఈ విలీన చర్చలు ముందస్తు దశకు చేరుకున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించడం ఒక ఆసక్తికర పరిణామం. అయితే ఈ విలీనం అనేది అధికార గతిశీలతలో కూడా పెనుమార్పును తీసుకువస్తుందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఎందుకంటే సీనియర్ నాయకుడు శరద్‌పవార్ ఇప్పుడు సహజంగానే ఏకీకృత కేడర్‌ను నడిపించడంలో 'కీలక భూమిక'ను తిరిగి పోషిస్తారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్‌ఎస్‌పి) శిబిరం విశ్వసిస్తోంది.ఇదిలా ఉంటే దివంగతనేత అజిత్ పవార్ సతీమణి రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్‌ను ఉపముఖ్యమంత్రిగా ప్రతిపాదించి అజిత్‌పవార్ రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికార నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నిశిత పరిశీలన చేస్తోంది. కాగా అజిత్‌పవార్ బతికున్న సమయంలోనే ఎన్‌సిపి పునరేకీకరణ కోసం చర్చలు ప్రారంభమయ్యాయని, ఆ నేపథ్యంలోనే రెండు ఎన్‌సిపి పార్టీలు కూడా పురపాలక ఎన్నికలలో పుణే, పింప్రీ, చించ్‌వాడ్‌లో కలిసికట్టుగా పోటీ చేయడం జరిగింది. ఎన్‌సిపిని శరద్‌పవార్ 1999లో స్థాపించారు. అజిత్‌పవార్ 2023 జులైలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో చేరడంతో ఎన్‌సిపిలో చీలిక ఏర్పడింది. అజిత్ పవార్ డిప్యూటీ సిఎంగా నియమితులయ్యారు. 2024 నవంబరులో అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పవార్ ఉపముఖ్యమంత్రి పదవిలోనే కొనసాగారు. ఎన్‌సిపి పార్టీ పేరు, ఎన్నికల చిహ్నంపై వాదన ఇరువర్గాలలో తీవ్రపోటీని కలిగించింది. అజిత్‌పవార్ శిబిరం ఒరిజినల్ 'ఎన్‌సిపి' పేరు ద్వారా అలారం గడియారం ఎన్నికల చిహ్నాన్ని పొందడం జరిగింది. ప్రస్తుతం ఎన్‌సిపి మహాయుతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండగా, ఎన్‌సిపి(ఎస్‌పి) మాత్రం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)లో ఉన్నారు. 66ఏళ్ల అజిత్‌పవార్ 'దాదా'గా (పెద్దన్న)గా పేరొందారు. బుధవారం ఉదయం పుణేలో బారామతి వైమానికతలం సమీపంలో ఛార్టర్డ్ విమానంలో ప్రయాణిస్తుండగా జరిగిన ఘోర ప్రమాదంలో అజిత్‌కుమార్ సహా నలుగురు మృతిచెందారు. ఈ హఠాత్ పరిణామానికి రాజకీయ వర్గాలు, ఆయన అనుచరులు సహా సామాన్యులు కూడా దిగ్భ్రాంతికి గురయ్యారు. అజిత్‌పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేసింది. పురపాలక ఎన్నికల తర్వాతే రెండు ఎన్‌సిపి వర్గాలు కూడా విలీనందిశగా చర్చించి రాజకీయ ప్రయోజనం పొందాలని ఆకాంక్షించాయి. ఎన్‌సిపి (శరద్ పవార్). అజిత్‌పవార్ పార్టీ మధ్య చర్చలు పురోగతి దశలో ఉన్న సమయంలో బుధవారం నాటి విమాన ప్రమాదం చర్చలకు విఘాతం కలిగించింది. వాస్తవానికి రెండు ఎన్‌సిపిల విలీనం విషయాన్ని త్వరలోనే జరగబోయే జిల్లా పరిషత్, పంచాయతి సమితి ఎన్నికలలో ఫిబ్రవరి 8న ప్రకటించాలని భావించారు. 'కుటుంబాన్ని, పార్టీని కలిపి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)కి పూర్వ వైభవం సాధించే ప్రక్రియ దిశగా ఆ పార్టీల ముఖ్యనేతలు ముందడుగు వేశారు. సీనియర్ లీడర్లతో వచ్చిన ఈ విరామాన్ని పూడ్చేందుకు 'అజిత్ దాదా' స్వయంగారంగంలోకి దిగి పలుదఫాలుగా చర్చలు జరిపారు' అని వర్గాలు పిటిఐకి తెలిపాయి.అయితే ఇరు పార్టీలు ఏకమై సంయుక్తంగా గడియారం ఎన్నికల గుర్తుపై పుణే, పింప్రీచించ్‌వాడ్ పురపాలక ఎన్నికలలో పోటీచేయడం ఆ పార్టీల దిశగా అందరి దృష్టిని మరల్చింది. విలీనం జరిగితే ఎన్‌సిపి(శరద్‌పవార్) నాయకులు రాష్ట్రపరిపాలన, పార్టీ ఆర్గనైజేషన్‌లో కీలక పాత్ర పోషిస్తారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 9మంది లోక్‌సభ సభ్యులు, 51మంది ఎమ్మెల్యేలతో కూడిన బలీయమైన ఐక్యకలయిక మహారాష్ట్రలోని అధికార మహాయుతి లేదా ప్రతిపక్ష మహావికాస్ అఘాడీలో సమతుల్య మార్పులకు సోపానం కానున్నది. అయితే ప్రస్తుతానికి ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకులు మాత్రం వారు పోటీచేయబోయే ఫిబ్రవరి 7న జరుగనున్న స్థానిక ఎన్నికల్లో విజయమే తమ ప్రాధాన్యత అని చెబుతున్నారు. అజిత్‌పవార్ నేతృత్వంలోని వర్గంతో సమన్వయమే దివంగత నాయకుడికి చివరి రాజకీయ ప్రయత్నాలకు ఇచ్చే నివాళిగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా 2029 ఎన్నికలను, పార్టీ ఔచిత్యానియ్య దృష్టిలో ఉంచుకని, దీర్ఘకాలిక రాజకీయ దృక్పథంతో రెండు ఎన్‌సిపి వర్గాల పున:కలయికను అజిత్ పవార్ పరితపించారు. 'విలీనం చివరికి కార్యరూపం దాలుస్తుంది' అని, ముఖ్యంగా తన బాబాయి శరద్‌పవార్ అనుమతితో ఎన్‌సిపి ఇరు పార్టీల విలీనం సాకారం అవుతుందని ఆయన నమ్మకంగా ఉండేవారని అజిత్‌పవార్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్‌సిపి ఇరుపార్టీల విలీనం, భవిష్యత్తు వ్యూహానికి సంబంధించిన ఉన్నత స్థాయి చర్చలలో శరద్ పవార్, సుప్రియా సూలే, అజిత్‌పవార్ , జయంత్ పాటిల్ భాగస్వాములయ్యారు. ఈ చర్యలు విస్తృత రాజకీయ దిశ, నాయకత్వ అమరిక, దీర్ఘకాలిక ఎన్నికల వ్యూహంపై దృష్టి సారించాయి. ద్వితీయ స్థాయి చర్చయలను నాయకులు శశికాంత్ షిండే, రాజేష్ టోపే, అమోల్ కొల్హే తదితరులు నిర్వహించారు. వారు వ్యూహాత్మక, సంస్థాగత సమస్యలను విలీన చర్చల్లో ప్రస్తావించారు.

## సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసిన ఎన్‌సిపి నేతలు



**ముంబయి:** మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నాయకులు కలిశారు. విమాన ప్రమాదంలో మరణించిన డిప్యూటీ సిఎం అజిత్ పవార్ పోర్ట్‌ఫోలియోలపై చర్చించారు. ఆయన నిర్వహించిన మంత్రి పదవులపై తమ పార్టీకే హక్కు ఉన్నదని తెలిపారు. శుక్రవారం ఎన్‌సిపి సినియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజ్‌బల్ కలిసి సిఎం ఫడ్నవీస్ అధికార నివాసానికి వెళ్లారు. అజిత్ పవార్ నిర్వహించిన కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలతో సహా అన్ని మంత్రిత్వ శాఖలు ఎన్‌సిపి కోటాలోనే కొనసాగాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను సమర్పించారు. కాగా, సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం తర్వాత ఎన్‌సిపి కీలక నేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలో తాము భాగస్వాములని తెలిపారు. అజిత్ పవార్ నిర్వహించిన పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి సరైన నిర్ణయం తీసుకోవాలని ఫడ్నవీస్‌ను కోరినట్లు చెప్పారు. మరోవైపు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పార్టీతోపాటు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నదని ప్రఫుల్ పటేల్ తెలిపారు. 'దుఃఖం నుంచి కోలుకోవడానికి అజిత్ పవార్ కుటుంబానికి కొంత సమయం ఇవ్వాలి. మేం త్వరలోనే సునేత్ర పవార్, ఇతర కుటుంబ సభ్యులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తాం' అని అన్నారు.

### అజిత్ పవార్ విమాన ప్రమాదంపై

# రంగంలోకి దిగిన సిఐడి



**ముంబయి :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణానికి కారణమైన బారామతి విమాన ప్రమాదంపై రాష్ట్ర నేర దర్యాప్తు విభాగం (సిఐడి) అధికారికంగా విచారణను ప్రారంభించింది. ఈ ఘోర ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాన్ని నిగ్గు తేల్చనుంది. పుణె రూరల్ పోలీసుల పరిధిలో నమోదైన ఈ కేసును తక్షణమే సిఐడికి బదిలీ చేశారని ఒక సినియర్ అధికారి స్పష్టత ఇచ్చారు. ఈ కేసులో సిఐడి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిఐడి ప్రధానంగా 'సాబోటేజ్' కోణంలో దర్యాప్తు చేయనుంది. అంటే విమానం ముంబయి నుంచి బయలుదేరడానికి ముందే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విమానంలో సాంకేతిక లోపాలు సృష్టించారా? అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు. బారామతిలో జరిగిన ఈ ఘటనపై తొలుత పుణె రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 194 కింద దీనిని 'ప్రమాదవశాత్తు జరిగిన మరణం'గా నమోదు చేశారు. ఇప్పుడు ఆ ఎఫ్ఐఆర్ సంబంధిత పత్రాలన్నింటినీ సిఐడికి అప్పగిస్తున్నారు. సిఐడి బృందం పుణె రూరల్ పోలీసుల నుంచి డాక్యుమెంట్లను సేకరిస్తోంది. విచారణలో భాగంగా సిఐడి అధికారులు బారామతిలోని ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు. ఈనెల 28న జరిగిన ఈ ఘోర ప్రమాదం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అజిత్ పవార్ (66) ప్రయాణిస్తున్న 'లియర్ జెట్ 45' విమానం ముంబయి నుంచి బయలుదేరింది. ఆయన సొంత ఊరైన బారామతికి చేరుకుంది. ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తుండగా, రన్ వే అంచుకు కేవలం 200 మీటర్ల దూరంలోనే విమానం కుప్పకూలింది. క్షణాల్లో మంటలు చెలరేగి విమానం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అత్యంత అనుభవజ్ఞులైన పైలట్లు ఉండటం గమనార్హం. కెప్టెన్ సుమిత్ కపూర్‌కు ఏకంగా 16,000 గంటలకుపైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. కోపైలట్‌గా ఉన్న కెప్టెన్ శాంభవి పాఠక్ కూడా 1,500 గంటలకు పైగా అనుభవం ఉంది. అజిత్ పవార్ వ్యక్తిగత భద్రతా అధికారి విదిప్ జాదవ్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి వీరందరూ ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మరోవైపు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' కూడా తన విచారణను ప్రారంభించింది.

## 'వెళ్లి చావు' అనడం ఆత్మహత్యకు పురికొల్పడం కాదు: కేరళ హైకోర్టు



**తిరువనంతపురం:**భార్యాభర్తల మధ్య గొడవ సందర్భంగా 'వెళ్లు, చావు' అని అనడంపై కేరళ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఒక కుటుంబ వివాదంలో హైకోర్టు తీర్పు వెలువరిస్తూ భార్యాభర్తలు కోపంగా 'వెళ్లిపో', 'చనిపో' వంటి పదాలను ఉపయోగించడం ఆత్మహత్యకు ప్రేరేపించబడదని పేర్కొంది. భారత శిక్షాస్మతి సెక్షన్ 306 ప్రకారం నేరాన్ని నిర్ధారించాలంటే... నిందితుడు ఆత్మహత్యకు ప్రేరేపించాలనే ఉద్దేశాన్ని కలిగి ఉన్నాడని నిరూపించాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు ఒక మహిళ, ఆమె చిన్న కుమార్తెకు సంబంధించినది. భర్త తిట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రాసిక్యూషన్ ప్రకారం ఆ మహిళ భర్త మరో వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం భార్యకు తెలిసి.. భర్తను ప్రశ్నించింది, దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అక్రమ సంబంధంపై దంపతుల మధ్య గొడవ జరిగిన తరువాత... భర్త ఆ మహిళతో 'నువ్వు వెళ్లి చావు' అని చెప్పాడని, ఆ తర్వాత ఆ మహిళ తన ఐదున్నర ఏళ్ల కుమార్తెతో సెప్టెంబర్ 15, 2023న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీని తరువాత, కాసర్గోడ్‌లోని మెల్పరంబా పోలీస్ స్టేషన్ ఆ మహిళ భర్తపై కేసు నమోదు చేసింది. కాసర్గోడ్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు నిందితుడిపై అభియోగాలు మోపాలని నిర్ణయించింది. ఆ తర్వాత ఆ మహిళ భర్త హైకోర్టును ఆశ్రయించి... ఆ మాటలు కోపంతో పలికానని, తన భార్యను ఆత్మహత్యకు రెచ్చగొట్టడానికి ఉద్దేశించినవి కాదని తెలిపాడు. దీనిపై తీర్పు ఇస్తూ హైకోర్టు సుప్రీం కోర్టు నిర్ణయాన్ని ఉదహరించింది. గొడవ సమయంలో కోపంతో మాట్లాడే సాధారణ లేదా అజాగ్రత్త పదాలు ఆత్మహత్యను ప్రేరేపించే ఉద్దేశంగా పరిగణించబడవని పేర్కొంది. ఈ కేసులో 'వెళ్లి చావు' అనే పదం వాగ్వాదం సమయంలో పలికారని, మతురాలి ఆత్మహత్యకు ప్రేరేపించే ఉద్దేశం లేకుండానే ఈ వ్యాఖ్యలు చేశారని కేరళ హైకోర్టు పేర్కొంది.

## 'ఎస్ఐఆర్' పై మమత పోరాటం

### 2న రాజధానికి పయనం



**కోల్‌కతా:** ఎస్ఐఆర్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎస్ఐఆర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని మమత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ నేతత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వచ్చే వారం ఢిల్లీలో భారీ కవాతు నిర్వహించేందుకు ప్రణాళిక రచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రత్యేక సర్వే నిర్వహించింది. దీంతో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించింది. అప్పటి నుంచి ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తృణమూల్ విమర్శలు చేస్తోంది. ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించారని ఆరోపించింది. ఈ కేసును వచ్చేవారం సుప్రీంకోర్టు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ లేదా సుప్రీం కోర్టు, జంతర్ మంతర్ వరకు మమతా బెనర్జీ ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉందని వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఫిబ్రవరి 2 సాయంత్రం 4 గంటలకు ఇద్దరు సహచరులతో మమతా బెనర్జీ సమావేశమయ్యేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అపాయింటమెంట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1 సాయంత్రం లేదా ఫిబ్రవరి 2 తెల్లవారుజామున మమత ఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. దీని కోసం పెద్ద ఎత్తున జనసమూహాన్ని మమత ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ:** కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సష్టించింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని ఓ ప్రయాణికుడు గుర్తించి... సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు. శుక్రవారం ఉదయం 6.40 గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను కిందకు దించేసి, విమానంలో తనిఖీలు చేశారు. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నారు.

# ఐదేళ్లలో ఉన్నతాదాయ దేశంగా వియత్నాం!

వియత్నాం దేశాన్ని పరిపాలిస్తున్న వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సిపివి) 2030 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి వందేళ్ళు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో జనవరి 19– 23 తేదీలలో రాజధాని హనోయ్ నగరంలో జరిగిన సిపివి 14వ జాతీయ మహాసభ ప్రాధాన్యత సంతరించుకుంది. మార్క్సిజం–లెనినిజం బాటలో, ఆధునిక వియత్నాం జాతిపిత హోచిమిన్ ఆలోచనల వెలుతురులో అర్ధశతాబ్దంగా అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రజలే కేంద్రంగా సమసమాజ వ్యవస్థ దిశగా అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడింది ఈ ఆగ్నేయాసియా దేశం. ప్రపంచం అబ్బురపడేలా నేటి నవ్య వియత్నాం అద్భుత విజయాలను సొంతం చేసుకుంటున్నది. వాటిని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు ఐదేళ్ళకు ఒకసారి జరిగే సిపివి మహాసభ మార్గదర్శనం చేసింది. దేశవ్యాప్తంగా అరకోటికి పైగా ఉన్న పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 1,586 మంది వచ్చే ఐదేళ్ళ కాలానికి (2026–2030) వరకు సాధించాల్సిన లక్ష్యాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

వచ్చే మహాసభ జరిగే నాటికి సిపిసి వందేళ్ళసంబురాన్ని సంకేతాత్మకంగా నిర్వహించుకునేందుకే పరిమితమవకుండా, ప్రజల జీవితాల్లో మరింత గుణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు మహాసభ కంకణబద్ధమైంది. ఆధునిక వియత్నాం జాతిపిత హోచిమిన్ ఆదర్శాలు, జాతీయ విముక్తి ఉద్యమ చారిత్రక లక్ష్యాలను సాధించేందుకు 2030 – 2045 కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుంది. అందులో భాగంగా 2030 నాటికి వియత్నాం మధ్య తరగతి నుంచి ఎగువ తరగతి ఆదాయ స్థాయిని సాధించి, సిర్థమైన, శక్తివంతమైన సోషలిస్టుదేశంగా ఎదగాలని నిర్దేశించుకుంది. కేవలం అంకెలతో కాకుండా ప్రజల జీవన ప్రమాణాలలో వాస్తవిక మెరుగుదలలో ఆదాయాభివృద్ధిని అంచనావేయాలని నొక్కి చెప్పింది. అలా కొనసాగిస్తూ 2045 నాటికి అభివృద్ధి చెందిన, స్వాతంత్ర్య, సోషలిస్టు దేశంగా ఎదగాలని గురిపెట్టుకుంది. అలాగే సిపివి మహాసభలో గడిచిన ఐదేళ్ళ ప్రస్థానంపై కూడా ఆత్మశోధన కూడా చేసుకున్నారు. సంస్థాగత బలహీనతలను గుర్తిస్తూనే ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, అంతర్జాతీయ స్థిరత్వం విషయంలో గణనీయమైన పురోగతి సాధించడం పట్ల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతమైన సుస్థిర అభివృద్ధి కేంద్రంగా సామాజిక–ఆర్థిక అభివృద్ధి వ్యూహాన్ని మహాసభ నిర్దేశించుకుంది. ప్రభుత్వ మార్గదర్శక పాత్రను నిలబెట్టుకుంటూనే సోషలిస్టు ఆధారిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే పురోగమించాలని పునరుద్ఘాటించింది. సామాజిక న్యాయం, సమానత్వాన్ని అనుసంధానిస్తూనే డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, పారిశ్రామికీకరణ, హరిత అభివృద్ధి, వైవిధ్యంతో కూడిన ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చింది.

వియత్నాం గత విజయాలను పరికిస్తే మహాసభ లక్ష్యాలు సాధించడం కష్టమేమీ కాదు. రెండు దశాబ్దాల వియత్నాం యుద్ధం ముగిసి 1975లో కమ్యూనిస్టు పార్టీ అధికారం చేపట్టే నాటికి, అది ప్రపంచంలోనే అత్యంత పేద దేశాలలో ఒకటి. పంచవర్ష ప్రణాళికలు పెద్దగా ప్రభావం చూపలేదు. 1980 దశాబ్దం నాటికి తలసరి ఆదాయం 200–300 డాలర్ల మధ్యే ఊగిసలాడేది. దీనిని సవాలుగా తీసుకున్న వియత్నాం కమ్యూనిస్టు పార్టీ 1986లో 'డోయి మొయి' పేరుతో ఆర్థిక, రాజకీ సంస్కరణలకు రూపకల్పన చేసింది. ప్రభుత్వ మార్గదర్శకత్వాన్ని కొనసాగిస్తూనే ప్రభుత్వ, సహకర, ప్రైవేటు రంగాలను ప్రోత్సహించింది. దేశాన్ని 'సోషలిస్టు ఆధారిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థ'గా తీర్చిదిద్దింది. కఠినమైన, పిడివాద వైఖరితో కాకుండా, దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాలను అన్వయించుకుంటూ వియత్నం తన స్వంత పంథాలో సోషలిజాన్ని సృష్టించుకుంది.

నేడు వియత్నాం ప్రపంచంలోనే ఎదుగుతున్న మార్కెట్‌లలో ఒకటిగా ముందంజలో ఉంది. పదేళ్ళలో (2010–2023) కటిక పేదరికాన్ని 14 శాతం నుంచి 4 శాతాని తగ్గించింది. 2025 నాటికి తలసరి ఆదాయం 5000 డాలర్లకు ఎగబాకింది. ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో కూడా జిడిపి 8.02 శాతం వృద్ధిని రికార్డు చేసింది. 930 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్యం చేసి, తొలి 20 వాణిజ్య ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. వ్యవసాయ ఎగుమతులలో అగ్రగామి. తయారీరంగం, ఎలాక్ట్రానిక్స్ రంగ సహా, ఐటి రంగంలో కూడా అబ్బురపరిచే ఘనతలు వియత్నాం సొంతం.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనే అతి పెద్ద క్యాన్సర్ అవినీతి. సోషలిజాన్ని పరిరక్షించుకునేందుకు అవినీతి వ్యతిరేక పోరును తీవ్రతరం చేయాలని సిపివి మహాసభ కర్తవ్యరూఢురాలైంది. ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి అవినీతి అంతర్గత ముప్పుగా గుర్తించింది. దీనిని అధిగమించేందుకు కఠిన క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకతను బలంగా ప్రకటించింది. నేటికీ సోషలిజానికే ప్రాసంగికత ఉందని తమ అనుభవాన్ని ప్రపంచం ఎదుట సాక్షాత్కరింపజేసింది వియత్నాం. చివరలో మహాసభ నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి టు లామ్‌ను తిరిగి ఎన్నుకోవడం సహా, 200 మంది సభ్యులతో నూతన కేంద్ర కమిటీ, అందులో నుంచి పొలిట్ బ్యూరో, క్రమశిక్షణ కమిటీ ఎన్నికైంది. పార్టీ నిర్మాణంపై దృష్టి పెడుతూ సైద్ధాంతిక దృఢత్వం, నైతిక స్వచ్ఛత, సంస్థాగతంగా బలం మరింత పెరుగుపరుచుకునేందుకు పార్టీ శ్రేణుల శిక్షణ, క్రమశిక్షణకు పెద్ద పీట వేయాలని నిర్ణయం తీసుకుంది.


స్వతంత్ర, స్వీయప్రకాశిత, శాంతియుత విదేశాంగ విధానానికి కట్టుబడుతూనే, అన్ని దేశాలతో సమానత్వం, పరస్పర గౌరవం, జోక్యరహిత సంబంధాలను కొనసాగించేందుకు నిర్ణయించింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమానికి సంఘీభావాన్ని బలోపేతం చేసుకోవాలని నూతన నాయకత్వం నిబద్ధతతో ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఆదాయ అసమానతలను తీవ్రతరం చేసిన పెట్టుబడిదారి విధానానికి ప్రత్యామ్నాయంగా సమాభివృద్ధిని విజయవంతంగా అమలు చేస్తున్న వియత్నాం నమూనా ఆదర్శనీయం. దేశాభివృద్ధిలో భాగమయ్యేందుకు విదేశాలలో స్థిరపడిన వియత్నాం వాసులు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. గతానుభవాల రీత్యా భావి లక్ష్యాలను సాధిస్తామనే విశ్వాసం వియత్నామీయులలో మెండుగా కనపడుతోంది. ●



## ఆర్థిక పతనం ప్రమాదంలో యుఎన్ఒ

**చెల్లించని బకాయిలు, బడ్జెట్ నిబంధన కింద ఖర్చు చేయని డబ్బు తిరిగి చెల్లింపు కారణంగా ఐక్యరాజ్య సమితి (యుఎన్ఒ) 'ముంచుకొస్తున్న ఆర్థిక పతన' ప్రమాదంలో ఉంది. ఈ సంక్షోభం తీవ్రమవుతోంది. ఇది కార్యక్రమాల అమలుకు ముప్పు కలిగిస్తూ, ఆర్థిక పతనానికి దారితీస్తోంది. సమీప భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారుతుంది.**

సభ్య దేశాలకు యుఎన్ సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ లేఖ




# ఎఐ.. ప్రపంచ దేశాలకు లాభమా నష్టమా?

ప్రస్తుతం ఎఐ(కృత్రిమ మేధస్సు) ప్రపంచానికి లాభమా? నష్టమా? ఇది లాభాలు అందిస్తోంది, కానీ ఉపాధి పరంగానష్టాలు కొన్ని ఉన్నాయి అనేది నిపుణుల అభిప్రాయం. ఎఐ యొక్క నికర ప్రభావం దేశాలు, సంస్థల నిర్వహణపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కానీ దేశ ఆర్థిక వ్యవస్థకు 2030 నాటికి 15.7 ట్రిలియన్ డాలర్లు సంపద జోడిస్తుందని అంచనా. ఆరోగ్యం, వ్యవసాయం లాంటి రంగాల్లో పరిష్కారాలు చూపుతూ సహాయపడుతుంది అనేది అంచనా. ఎఐ ఇది నిర్ణయాలు మెరుగుపరుస్తూ, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేస్తుంది. వివిధ దేశాల్లో ఎఐ ని ప్రయోజకరంగా చూస్తున్నారు, ముఖ్యంగా ఆసియా దేశాల్లో ఎఐ నష్టాలు, ఉపాధి నష్టాలు, డీప్‌ఫేక్‌లు, సమాచార గోప్యత ఉల్లంఘనలు, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయి.

ఎఐ వాడకం ద్వారా పర్యావరణానికి పెను భారంగా మారి మానసిక ఆరోగ్య సమస్యలు కలిగిస్తుంది అనేది అంచనా మాత్రమే. అభివృద్ధి చెందిన దేశాల్లో అమెరికా, రష్యా, చైనా, లాంటి దేశాల్లో అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎఐ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మార్చడం ద్వారా లాభాలు అందిస్తుంది అనేది విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే అని చెప్పుకోవచ్చు. కానీ రిస్కులు నిర్వహణ దీనికి చాలా అవసరం. 2025లో ఆశావాదం పెరిగినప్పటికీ, అవకాశవాదం, సమానత్వం ద్వారా భవిష్యత్తు ప్రభావంపైన ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ దేశాలు ఎఐని ప్రోత్సహిస్తూనే నియంత్రణలు విధిస్తున్నారు. అమెరికా, చైనా ఎఐ అభివృద్ధిలో ముందుండగా, ఇయు మాత్రం కఠిన నియమాలు తీసుకుంది. 75 దేశాల్లో ఎఐ చట్టాలు గణనీయంగా 21% నిబంధనలు పెరిగాయి అమెరికా, చైనా, ఎఐ కి ఇన్నోవేషన్‌కు స్వేచ్ఛ ఇచ్చి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14179 ద్వారా నియంత్రణలు తగ్గించింది. చైనా ఎఐ ని జాతీయ ప్రాధాన్యతగా చేసి 2030 నాటికి అగ్రస్థానమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యానికి సంబంధించిన టాబ్లెట్లు ఇంజక్షన్ల తయారీల్లో ఈ రెండు దేశాలు ఎఐ వినియోగంతో టాప్‌లో ముందు వరుసలో ఉన్నాయి. యూరప్, ఇతర దేశాలు ఇయు ఎఐ యాక్ట్ ఫ్రాన్స్ ఏ109 బిలియన్లు, కెనడా $2.4 బిలియన్లు, భారత్ $1.25 బిలియన్లు ఇన్వెస్ట్ చేస్తోంది. సింగపూర్, సౌత్ కొరియా, ఎస్టోనియా వంటి దేశాలతో పోలిస్తే ఎఐ అడాప్షన్‌లో ముందు భారత్ కనిపిస్తోంది. భవిష్యత్ భారత్ ఎఐ వినియోగంలో చైనాతో సమానంగా ఉండి బ్యాంకింగ్, ఇ–కామర్స్‌లో సమఉజ్జీగా నిలుస్తోంది. 45 దేశాలు ఎఐ నీ తయారు చేస్తున్నాయి, ఎఐపై ప్రపంచ దేశాలు సెమినార్ నిర్వహించగా (దేశ ప్రధాని మోదీతో) సహా ఎఐతో రాబోయే 50 సంవత్సరాల వరకు ఉద్యోగ నష్టాలు కానీ గణనీయమైన లాభాలు ఉండవని తేల్చి చెప్పారు. కానీ వివిధ రాష్ట్రాల్లో ఎఐని తమ స్వార్థాలకు ఉపయోగించుకుంటున్నారు సామాజిక మాధ్యమాల్లో ఎఐ పాత్ర బాగా ఉపయోగపడుతుంది.

కొన్ని యూట్యూబ్ ఛానల్స్ లో ఎఐ ని ఉపయోగించి ఒక మహిళ యాంకర్‌గా మార్చి ద్వంద్వార్థ డైలాగులతో ప్రజలను తికమక పెడుతున్నారు. అసభ్య పదజాలంతో జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం కానీ నియమనిబంధనలు కట్టుదిట్టంగా విధించి ఉంటే బాగుండేది ఇకనైనా ఇలాంటివి జరగకుండా చూడాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెంకట్ పులిపాటి

# టేబుల్ దగ్గర లేకుంటే.. మెనూలో ఉంటాం!

*ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆలోచింపజేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇష్టారీతిన టారిఫ్‌ల విధింపు, ఇతర దేశాలపై దుందుడుకు వ్యవహారం నేపథ్యంలో కొత్త వ్యవస్థ అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కెనడా ప్రధాని కార్నీ ప్రసంగంలో ముఖ్య భాగాలు...*

మిత్రులారా...

కెనడా, ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ కీలకమైన సమయంలో మీతో ఉండటం ఆనందంగా ఉంది. ఈ రోజు నేను ప్రపంచ వ్యవస్థ విచ్ఛిన్నమవటం గురించి, ఒక ఆహ్లాదకరమైన కల్పన ముగింపు, కఠినమైన వాస్తవం ఆరంభం గురించి మాట్లాడుతాను. అగ్ర శక్తి (అమెరికా) భౌగోళిక రాజకీయాలు ఎలాంటి పరిమితులు, అడ్డంకులకు లోబడి ఉండవు.

మరోవైపు, ఇతర దేశాలు, ప్రత్యేకించి కెనడా వంటి మధ్యంతర శక్తులు, శక్తిహీనులు కాదని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. మానవ హక్కుల పట్ల గౌరవం, స్థిరమైన అభివృద్ధి, సంఘీభావం, సార్వభౌమాధికారం, వివిధ దేశాల ప్రాదేశిక సమగ్రత వంటి మన విలువల ను కలిగి ఉన్న కొత్త వ్యవస్థ నిర్మించగల సామర్థ్యం వారికి ఉంది. తక్కువ శక్తి కలిగిన వారి బలం నిజాయితీతో ప్రారంభమవుతుంది.

దశాబ్దాలుగా, కెనడా వంటి దేశాలు నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ అని మనం పిలిచే దాని కింద అభివృద్ధి చెందాయి. మేము దాని సంస్థలలో చేరాం. దాని సూత్రాలను ప్రశంసించాం. దాని అంచనా నుండి మేము ప్రయోజనం పొందాం. దాని కారణంగా, దాని రక్షణలో విలువల ఆధారిత విదేశాంగ విధానాలను మనం అనుసరించగలిగాం. అంతర్జాతీయ నియమాల ఆధారిత వ్యవస్థ గురించిన కథనం పాక్షికంగా తప్పు అని మాకు తెలుసు.

బలవంతులు తమకు అనుకూలమైనప్పుడు తమ ను తాము మినహాయించుకుంటారని, వాణిజ్య నియమాలు అసమానంగా అమలు చేయబడతాయని, నిందితుడు లేదా బాధితుడి గుర్తింపును బట్టి అంతర్జాతీయ చట్టం కఠినత్వం వివిధ స్థాయిలలో వర్తిస్తుందని మాకు తెలుసు.

ఈ కల్పన ప్రయోజనకరంగా ఉంది. ముఖ్యంగా అమెరికన్ ఆధిపత్యం ప్రజా సౌకర్యాలు, అందుబాటులో సముద్ర మార్గాలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, సామూహిక భద్రత, వివాదాల పరిష్కారానికి చట్రాలకు మద్దతును అందించడంలో సహాయపడింది. కాబట్టి, వాగాడంబారానికి, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాలను ఎక్కువగా ప్రస్తావించలేదు.

ఈ బేరసారాలు ఇక పనిచేయవు. నేను నేరుగా చెప్పాలంటే మనం పరివర్తన(దశ)లో కాదు, బద్దలయ్యే దశలో ఉన్నాం. గత రెండు దశాబ్దాలుగా, ఆర్థికం, ఆరోగ్యం, ఇంధనం, భౌగోళిక రాజకీయాలలో వరుస సంక్షోభాలు ప్రపంచ ఏకీకరణలోని తీవ్ర ప్రమాదాలను బయటపెట్టాయి. కానీ ఇటీవల, అగ్ర శక్తులు ఆర్థిక ఏకీకరణను ఆయుధాలుగా, సుంకాలను పరపతిగా, ఆర్థిక మౌలిక సదుపాయాలను బలవంతంగా, సరఫరా గొలుసులను దుర్బలత్వాలుగా దోపిడీకి ఉపయోగించడం ప్రారంభించాయి. మీ చేతికింద ఉండేందుకు కలిసుండడం అనేది మూలంగా మారినప్పుడు, కలిసి ఉండడం ద్వారా పరస్పర ప్రయోజనం అనే అబద్ధంలో మీరు జీవించలేరు. మధ్యతరహా శక్తులు(మిడిల్ పవర్స్) ఆధారపడిన డబ్ల్యుటిఒ, యుఎన్, కాప్ వంటి బహుళపాక్షిక సంస్థల సమిష్టి సమస్య పరిష్కార నిర్మాణమే ముప్పులో ఉన్నాయి. ఫలితంగా, అనేక దేశాలు ఇంధనం, ఆహారం, కీలకమైన ఖనిజాలు, ఆర్థిక, సరఫరా గొలుసులలో ఎక్కువ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అభివృద్ధి చేసుకోవాలనే ఒకే రకమైన నిర్ణయానికి వచ్చాయి. ఈ ప్రేరణ అర్థం చేసుకోదగినదే. తనను తానుగా పోషించుకోలేని, ఇంధనం ఏర్పాటు చేసుకోలేని లేదా తనను తాను రక్షించుకోలేని దేశానికి కొద్ది ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉంటాయి. నియమాలు ఇకపై మిమ్మల్ని రక్షించనప్పుడు, మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి. కానీ ఇది ఎక్కడికి దారితీస్తుందో స్పష్టంగా తెలుసుకుందాం.

దుర్గం వంటి వారి ప్రపంచం బలహీనంగా, పెళుసుగా, తక్కువ స్థిరమైనదిగా ఉంటుంది. మరొక నిజం కూడా ఉంది. అగ్రరాజ్యాలు తమ అధికారం, ప్రయోజనాలను అడ్డంకులు లేకుండా సాధించడం కోసం నియమాలు, విలువలు అనే నటనను కూడా వదిలివేస్తే, లావాదేవీల నుండి వచ్చే లాభాలను పునరావృతం చేయడం కష్టం అవుతుంది. ఆధిపత్యవాదులు తమ సంబంధాలను నిరంతరం డబ్బుగా మార్చుకోలేరు. అనిశ్చితి నుండి రక్షణ కోసం మిత్రదేశాలు వైవిధ్యభరితంగా ఉంటాయి. వారు సార్వభౌమత్వాన్ని పునర్నిర్మించడానికి ప్రత్యామ్నాయాలను వేగవంతం చేస్తారు. ఒకప్పుడు నియమాలపై ఆధారపడిన సార్వభౌమాధికారం నుంచి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యంతో నిలబడాతారు.




దావోస్‌లో ప్రసంగిస్తున్న కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ

అయితే, ప్రతి ఒక్కరూ తమ సొంత దుర్గాలను నిర్మించుకోవడం కంటే తిరిగి నిలబడేందుకు సమిష్టి పెట్టుబడులు చౌకగా ఉంటాయి. ఉమ్మడి ప్రమాణాలు విచ్ఛిన్నాలను తగ్గిస్తాయి. అందుకు సానుకూలమైన విషయం పరిపూరకంగా లభిస్తుంది.

### మేము ముందుగా మేల్కొన్నాం

ఇప్పుడు కెనడా మొదటగా మేల్కొలుపు పిలుపు విన్న దేశాలలో ఒకటి. ఇది మా వ్యూహాత్మక వైఖరిని ప్రాథమికంగా మార్చడానికి దారితీసింది. మన భౌగోళిక శాస్త్రం, కూటమి సభ్యత్వాలు వాటంతట అవే శ్రేయస్సు, భద్రతను ఇస్తాయనే మన పాత సౌకర్యవంతమైన అంచనాలు. ఆ ఊహ ఇకపై చెల్లదని కెనడియన్లకు తెలుసు. మా కొత్త విధానం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'విలువ ఆధారిత వాస్తవికత' అని పిలిచిన దానిపై ఆధారపడి ఉంటుంది.

లేదా, ఇంకో విధంగా చెప్పాలంటే, మేము సూత్రప్రాయంగా, ఆచరణాత్మకంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ప్రాథమిక విలువలు, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత,(యుఎన్ చార్టర్‌కు అనుగుణంగా ఉంటే) బలప్రయోగం నిషేధం సహా మానవ హక్కులను గౌరవించడంలో సూత్రబద్ధంగా కట్టుబడి ఉంటాం.

పురోగతి తరచుగా పెరుగుతుందని గుర్తించడం, ఆసక్తులు భిన్నంగా ఉంటాయని, ప్రతి భాగస్వామి మా విలువలన్నిటినీ పంచుకోలేరని ఆచరణాత్మకంగా ఉండాల ని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. కాబట్టి, మేము కళ్ళు తెరిచి విస్తృతంగా, వ్యూహాత్మకంగా నిమగ్నమై ఉన్నాము. మనం ఉండాలనుకునే ప్రపంచంకోసం వేచి ఉండకుండా, మనం ఉంటున్న ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరిస్తాం.

మేము మా సంబంధాలను క్రమబద్ధం చేస్తున్నాము. కాబట్టి వాటి లోతు మన విలువలను ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతానికి ప్రపంచ అస్థిరత, దీని కారణంగా కలిగే నష్టాలు, తదుపరి దానికోసం ఉన్న అవకాశాల ను బట్టి, మా ప్రభావాన్ని పెంచుకోవడానికి విస్తృత సంభాషణలకు మేము ప్రాధాన్యత ఇస్తున్నాము. మనం ఇకపై మన విలువల బలం మీద మాత్రమే ఆధారపడటం లేదు. మన బలం విలువపై కూడా ఆధారపడుతున్నాము. మేము ముందు మా ఇంట్లో ఆ బలాన్ని పెంచుకుంటున్నాము. మా ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి, మేము ఆదాయాలు, క్యాపిటల్ గెయిన్స్, వ్యాపార పెట్టుబడులపై పన్నులను తగ్గించాము.

అంతర్‌ప్రాంతీయ వాణిజ్యానికి ఉన్న అన్ని సమాఖ్య అడ్డంకులను తొలగించాము. మేము విదేశాలలో కూడా వేగంగా వైవిధ్యభరితంగా మారుతున్నా ము. యూరోపియన్ రక్షణ సేకరణ ఏర్పాట్లలో సేఫ్(ఎస్ఎఎఫ్ఇ)లో చేరడం సహా ఇయుతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మేము అంగీకరించాము.ఆరు నెలల్లో నాలుగు ఖండాలలో 12 ఇతర వాణిజ్య, భద్రతా ఒప్పందాలపై మేము సంతకం చేసాము. గత కొన్ని రోజులుగా, మేము చైనా, ఖతార్‌లతో కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాల ను చేసుకున్నాము. భారతదేశం, ఏషియాన్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, మెర్కోసూర్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై మేము చర్చలు జరుపుతున్నాము.

మేము ఇంకో పని కూడా చేస్తున్నాం. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో సహాయపడటానికి, మేము వేర్వేరు లెక్కలను అనుసరిస్తు న్నాం, మరో మాటలో చెప్పాలంటే, ఉమ్మడి విలువలు, ఆసక్తుల ఆధారంగా విభిన్న సమస్యల కోసం విభిన్న సంకీర్ణాలు. కాబట్టి, ఉక్రెయిన్ విషయంలో మేము కోవాలేషన్ ఆఫ్ విల్లింగ్‌లో ప్రధాన సభ్యులం. దాని రక్షణ, భద్రతకు అతిపెద్ద తలసరి సహకారులలో ఒకరిగా ఉన్నాము.

అలాగే ఆర్కిటిక్ సార్వభౌమాధికారం విషయంలో, మేము గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్‌లకు గట్టిగా మద్దతు ఇస్తున్నాము. గ్రీన్‌ల్యాండ్ భవిష్యత్తును నిర్ణయించే వారి ప్రత్యేక హక్కుకు పూర్తిగా మద్దతు ఇస్తున్నాము. గ్రీన్‌ల్యాండ్ సుంకాలను కెనడా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

### టేబుల్ దగ్గర లేకపోతే... మెనూలో ఉంటాం..

ఇది అమాయకమైన బహుళపాక్షికత కాదు, లేదా వారి సంస్థలపై ఆధారపడటం కూడా కాదు. ఇది సమస్యల వారీగా కలిసి పనిచేయడానికి తగినంత ఉమ్మడి క్షేత్రాన్ని పంచుకునే భాగస్వాములతో పనిచేసే సంకీర్ణాలను నిర్మిస్తోంది. మధ్యస్థాయి దేశాలు కలిసి పనిచేయాలి. ఎందుకంటే మనం దగ్గర లేకపోతే, మనం మెనూలో ఉన్నట్లే.

కానీ అగ్ర శక్తులు ప్రస్తుతానికి ఒంటరిగా ముందుకు సాగగలవని నేను కూడా చెబుతాను. వాటికి మార్కెట్ పరిమాణం, సైనిక సామర్థ్యం, నిబంధనలను నిర్దేశించే పరపతి ఉన్నాయి.

మధ్య స్థాయి శక్తులు అలా చేయవు. కానీ మనం ఆధిపత్యం ఉన్న వ్యక్తితో ద్వైపాక్షికంగా మాత్రమే చర్చలు జరిపినప్పుడు, మనం బలహీనత ఆధారంగా చర్చలు జరుపుతాము. వారు ఏదిస్తే దానిని మనం అంగీకరిస్తాము. అత్యంత అనుకూలత కలిగి ఉండటానికి మనం ఒకరితో ఒకరు పోటీ పడతాము.

### మధ్య శక్తులు నిజంలో జీవించడం అంటే అర్థమేమిటి?

మొదట, దీని అర్థం వాస్తవాన్ని చెప్పడం. ఇప్పటికీ ప్రచారం చేస్తున్నట్లుగానే నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవ్యస్థను వేడుకోవడం ఆపండి. దానిని ఏమని పిలవాలంటే, అగ్రరాజ్యం కోసం పోటీని తీవ్రతరం చేసే వ్యవస్థ అని. ఇక్కడ అత్యంత శక్తివంతమైనవారు తమ ప్రయోజనాలను కొనసాగిస్తారు, ఆర్థిక ఏకీకరణను బలవంతంగా ఉపయోగిస్తారు.

దీని అర్థం స్థిరంగా వ్యవహరించడం, మిత్రదేశాలు, ప్రత్యర్థులకు ఒకే ప్రమాణాలను వర్తింపజేయడం. మధ్యస్థాయి శక్తులు ఒక దిశ నుండి ఆర్థిక బెదిరింపులను విమర్శించినప్పుడు, మరొక దిశ నుండి వచ్చే ఆర్థిక బెదిరింపుల పట్ల మౌనంగా ఉంటున్నాయి. పాత వ్యవస్థ పునరుద్ధరించబడే వరకు వేచి ఉండటం కంటే, మనం విశ్వసిస్తున్నామని చెప్పుకునే వాటిని నిర్మించడమే దీని అర్థం.

ఇప్పటి వరకు చెప్పినట్లుగా పనిచేసే సంస్థలు, ఒప్పందాలను సృష్టించడమే దీని అర్థం. దీని అర్థం బలవంతం చేయడానికి వీలు కల్పించే పరపతిని తగ్గించడం. అంటే బలమైన దేశీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించడం. ఇది ప్రతి ప్రభుత్వం తక్షణ ప్రాధాన్యతగా ఉండాలి.

అంతర్జాతీయంగా వైవిధ్యీకరణ అనేది కేవలం ఆర్థిక వివేకం మాత్రమే కాదు, నిజాయితీగల విదేశాంగ విధానానికి ఇది ఒక భౌతిక పునాది. ఎందుకంటే దేశాలు ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశాన్ని తగ్గించడం ద్వారా సూత్రప్రాయమైన స్థానాలకు హక్కును సంపాదిస్తాయి.

పాత వ్యవస్థ తిరిగి రాదని మాకు తెలుసు. పాత వ్యామోహం ఒక వ్యూహం కాదు. దాని గురించి మనం ఏడ్చుకుంటూ కూర్చోవద్దు. కానీ ఛిద్రమవడం నుండి, మనం పెద్ద, మెరుగైన, బలమైన, మరింత న్యాయమైనదాన్ని నిర్మించగలమని మేము విశ్వసిస్తున్నాము. ఇది మధ్య స్థాయి శక్తుల పని. ఎందుకుంటే అవే దుర్గాల ప్రపంచం నుండి ఎక్కువగా కోల్పోయే దేశాలు, నిజమైన సహకారం నుండి ఎక్కువగా లబ్ధి పొందే దేశాలు.

బలవంతులకు వారి శక్తి ఉంటుంది. కానీ మనకు కూడా ఏదో ఉంది. అది నటించడం మానేయడం, వాస్తవికతను పేర్కొనడం, ఇంట్లో మన బలాన్ని పెంచుకోవడం, కలిసి పనిచేయడం. అదే కెనడా మార్గం. మేము దానిని బహిరంగంగా, ఆత్మవిశ్వాసంతో ఎంచుకుంటాం. దానిని మాతో తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న ఏ దేశానికైనా మార్గం తెరిచి ఉంటుంది.

*ధన్యవాదాలు...*

# ఇంటింటి సమస్య 'ఇఎంఐ'

లేఖ

మనిషి జీవితం పూర్వమే బాగుండేదేమో టెక్నాలజీ పెరుగుతుందని సంతోషపడాలో లేక, మనుషుల పతనం మొదలైందని బాధపడాలో అర్థం కావడం లేదు. పూర్వం ఒక వస్తువుని కొనాలంటే డబ్బు ఉంటే కొనేవాళ్ళు లేదంటే వస్తువు మార్పిడి చేసుకునే వారు, ఆ రోజుల్లో మనుషులు ఒక ప్రశాంతమైన జీవితాన్ని గడిపేవారు. కానీ ప్రస్తుతం ఏదైనా ఒక వస్తువుని కొని ఆ వస్తువుకి ప్రతి నెల 'ఇఎంఐ' అంటూ తల పట్టుకుంటున్నారు. దానికి తోడు సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ చేయాలనుకుంటారు అందులో ఎంత నిజం ఎంత అబద్ధం ఉందో గమనించలేని పరిస్థితిలో ఉన్నాం. మనం బ్రతకాలి అంటే కొన్ని వస్తువుల మీద ఆధారపడి ఉంటాం. ఆ వస్తువులు మనకు అవసరం ఉండొచ్చు అవసరం ఉండకపోవచ్చు, కొన్ని మనం బ్రతకడానికి కొనుక్కుంటాం మరికొన్ని మన స్థాయిని చూపించుకోడానికి కొంటుంటాం. దాన్నీ చూపించే క్రమంలో మనిషి సగం జీవితం ఇఎంఐ లోనే బ్రతుకుతున్నారు. మారుతున్న కాలంతో పాటు ఈ సమాజంలో సోషల్ మీడియా కూడా పెరుగుతూ వచ్చింది. ఫోన్ చేతిలో ఉన్న ప్రతి ఒక్కరూ తన సెల్ ఫోన్‌లో ఏదో ఒక వీడియో చూసి ప్రభావితం అవుతూ ఉంటారు. అందులో జీవితాన్ని మార్చుకునే వారు కొందరు ఉంటే, మరి కొంతమంది లగ్జరీ జీవితాన్ని గడపాలని ఉంటారు. ఒకప్పుడు మన చేతిలో డబ్బు ఉంటేనే ఒక వస్తువుని కొనడానికి ఆశక్తి చూపించే వారు. ఇప్పుడు కాలం మారిపోయింది...చేతిలో డబ్బు ఉన్న లేకపోయినా ఇఎంఐల ద్వారా మనిషికి ఇష్టమైన వస్తువుని కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ఈ ఇఎంఐ ల వల్ల మనిషి తన జీవితంలో సగం ప్రశాంతత కోల్పోతుంటాడు.

**పక్కవారితో పోలిక :** యుక్త వయసు గల వారు ఇలాంటి వాటికి చాలా త్వరగా ఆకర్షించబడతారు. మన చుట్టు ఉన్న వారు ఒక వస్తువు కొంటే ఆ వస్తువు మనకు కొనాలి అనిపిస్తుంది. యువకులు తన స్నేహితులు ఏది కొనుకున్నా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ వస్తువుని కొనుకోవాలి అనుకుంటారు ఆ వస్తువు విలువ గురించి, ఇంట్లో స్థితి గతు గురించి, ఆలోచించరు. ఎలాగో మనకి ఇఎంఐ ద్వారా తీసుకునే అవకాశం ఉంది కాబట్టి ఎంతో కొంత డబ్బు కట్టి ఆ వస్తువుని కొంటారు. ఈ ఇఎంఐ లోనైనా 50 శాతం లేదా 60 శాతం కూడా నగదు చేతికి ఇవ్వకుండా 10 శాతం 20 శాతం నగదు కట్టి మిగతా మొత్తం ఇఎంఐ లోనే. నగదు చెల్లించడం వల్ల వడ్డీ రేట్లు ఎక్కువ అవుతుంది. ఒక 60, 70 శాతం నగదు చెల్లించడం ద్వారా వడ్డీ రేట్ల నుంచి కొంత తప్పించుకోవచ్చు. ఈ సమాజంలో చాలా మంది వ్యక్తులు ఎదుటి వారికి ఉంది నాకు లేదు అనే భావనతోనే ఎంత విలువ చేసే వస్తువునైనా ఇఎంఐల ద్వారా సులభంగా కొంటున్నారు.



**నియంత్రించే విషయాలు :** మనిషికి చూసిన వస్తువుని కొనాలనిపించడం సర్వసాధారణం. ఒక వస్తువుని కొనేముందు వారం రోజులు దాని గురించి ఆలోచించండి. ఈ వారం రోజులు ఆ వస్తువుని కొనాలి అనిపిస్తే అప్పుడు కొనండి? ఈ వారం రోజులు ఆలోచించడం వల్ల మీకు ఆ వస్తువుని కొనాలని ఆశ సచిపోవచ్చు. యుక్త వయసులో ఉన్న వారికి వీటిపై అవగాహన లేక లోన్‌లు తీసుకోవడం, జఎంఐ ద్వారా తనకి నచ్చిన వస్తువుని తీసుకొని ఇఎంఐ ని కట్టలేక తరువాత ఇబ్బంది పడుతుంటారు. మన స్థాయికి మించి, మన సంపాదనను మించి, వస్తువులు కొనేముందు ఒక్కసారి ఆలోచించండి.

మనం ఒక వస్తువుని కొన్నప్పుడు మనం కట్టే ఇఎంఐ మన సంపాదన కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి ఒక వస్తువుని ఇఎంఐ ల ద్వారా కొనేముందు, ఇఎంఐ ల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉంటే, అప్పుల బాధ నుంచి తప్పించుకున్నవారు అవుతారు.

**గణేష్,** భద్రాద్రి కొత్తగూడెం

## మేడారం రూట్‌లో 'ట్రాఫిక్ జామ్'



**ప్రజాపక్షం/తాడ్వాయి:**తాడ్వాయి ఆర్చి నుండి మేడారం పోయే దారి మొత్తం ట్రాఫిక్ స్తంభించి సుమారు రెండు గంటల వరకు ట్రాఫిక్ జామ్ అవడంతో గంటలు గంటలుగా బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి లక్షలాదిగా భక్తులు తరలిరావడంతో బస్సులు విఐపి వాహనాలు ఈ దారి గుండా వెళ్ళడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్ నియంత్రించడంలో అధికారులు విఫలమవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల్లో ప్రయివేట్ వాహనాల్లో దాహం ఆకలితో అలమటించారు. ట్రాఫిక్ జామ్ అవకుండా పటిష్ట చర్యలు చేపడితే ఈ సమస్యలు ఎదురయ్యేవి కావని భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

## మహా జాతరలో సింగరేణి రెస్క్యూ సేవలు



**ప్రజాపక్షం/ములుగు:**మేడారం జాతరలో సమ్మక్క సారలమ్మ దర్శనార్థం రోజు లక్షల సంఖ్యలో భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జాతరలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందిస్తున్నారు. సుమారు 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది మూడు బ్యాచ్‌లు గా విడిపోయి గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలి గాయాలపాలైన వారిని గద్దెల ప్రాంగణంలో అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందిస్తూ వారిని ఆసుపత్రికి అంబులెన్స్ వద్దకు చేరుస్తున్నారు. ఈ సహాయక చర్యలు వలన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి రెస్క్యూ సిబ్బంది ప్రతి మేడారం జాతరకు సేవలుఅందించడంఅనవాయితీగావస్తుందనిరెస్క్యూ సిబ్బంది వారు తెలిపా రు.

## నకిలీ టీ పౌడర్ పట్టివేత




**ప్రజాపక్షం/ఆత్మకూరు :** హన్మకొండ జిల్లా గూడెప్పాడు సెంటర్ లోని ఎంఎం మార్ట్‌లో ఆహార భద్రత అధికారులు నకిలీ టీ పౌడర్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మార్ట్‌లో ప్రాణాంతక క్యాన్సర్‌కు కారణమైన జుట్టుకు వేసే కలర్‌తో తయారు చేసిన టీ పౌడర్ విక్రయిస్తున్నారు.దీంతో ఈ మార్ట్ లో తనిఖీలు చేసిన గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు కృష్ణమూర్తి, ఫుడ్ మౌనిక నకిలీ టీ పౌడర్ ను గుర్తించారు. నకిలీ టీ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నవారు నకిలీ వస్తువుల పట్ల అవగాహన కలిగి ఉండి నకిలీ ఏదో, అసలు ఏదో గుర్తించాలని, ఎలా గుర్తించాలో మీడియా ముందు వివరించారు. టీ పౌడర్ లో నీళ్ల పోయగానే రంగులోకి మారితే అది నకిలీ అని, రంగు మారకుంటే అది అసలుది అని ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అన్నారు. ఈ తనిఖీల్లో శాయంపేట సిఐ రంజిత్ రావు, ఎస్ఐ పరమేశ్వర్ పాల్గొన్నారు.

## బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు..



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో గల ఐసిసిసి, అకౌంట్స్ విభాగం, ఐటి విభాగం, ఇంజనీరింగ్ విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన దస్త్రాలు భద్రపరిచే గది, వెటర్నరీ విభాగం, పోస్ట్ ఆడిట్, హార్టికల్చర్ విభాగం, ఇంజనీరింగ్ రికార్డ్ సెక్షన్‌ను సందర్శించి ఫైళ్ళ నిర్వహణ తీరును అడిగి కమిషనర్ తెలుసుకున్నారు. సందర్శన నేపథ్యంలో కమిషనర్ వివిధ విభాగాల గదుల స్థితిగతులు, ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బంది నిర్వహించే విధుల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కమిషనర్ వెంట ఏంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సూపరింటిండెంట్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి సేవలో అధికారులు..

### వెలవెలబోతున్న మండల కార్యాలయాలు

**ప్రజాపక్షం/నెక్కొండ:**మేడారం జాతర అంటే భక్తుల పాదయాత్ర మాత్రమే కాదు..పాలన కూడా తల్లి సేవలో భాగస్వాములయ్యే మహా సమయం. మేడారం జాతరలో ప్రత్యేక విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అన్ని శాఖల అధికారులను జాతర విధుల్లో నియమించడంతో మండల కేంద్రం నిశ్శబ్దంగా మారింది. ప్రస్తుతం తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. కార్యాలయాలకే కాదు..వ్యాపారాలకు కూడా ఇదే పరిస్థితి. కస్టమర్ల రాక తగ్గడంతో దుకాణాలు బోసిపోయాయి. సాధారణంగా సందడిగా ఉండే మార్కెట్ ప్రాంతాలు మౌనమయ్యాయి. తల్లి జాతర కోసం పాలన యంత్రాంగం మొత్తం మేడారం వైపు కదలడం, ఆ పవిత్ర పిలుపుకు ఉన్న ప్రాధాన్యతను మరోసారి చాటుతుంది. మండలంలో కనిపిస్తున్న ఈ వెలవెల ఒక తాత్కాలిక దృశ్యమే అయినా, మేడారం జాతర మహిమకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.

## ప్రతి గ్రామానికీ సాగు నీరు: పల్లా



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొంతగట్టు నాగారం, బొత్తల పర్రె గ్రామాలలో వెలిసిన ఏడు పోచమ్మ తల్లి, సమ్మక్క, సారలమ్మ తల్లికి ఎత్తు బంగారం, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యే పల్లాకి ఘనంగా డప్పు చప్పులతో ఎడ్లబండి మీద ఘనంగా స్వాగతం పలికా రు. అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లయ్య, రవి, రాజు, శ్రీనివాస్, ధనుష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి లింగం, మండల నాయకులు జుంలాల్ నాయక్, పోషయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌కుమార్, యాదగిరి, రాజేశ్వర్ గౌడ్, సుధీర్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ సైద్ధాంతిక సిద్ధాంత విలువలను తెలిపేదే చరక

'సర్వోదయ చరక సంఘటన్'ను ప్రారంభించిన మీనాక్షి నటరాజన్

మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..



**ప్రజాపక్షం/హనుమకొండ:** జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ డిసిసి భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, హనుమకొండ డిసిసిఅధ్యక్షుడుఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడుఅయ్యూబ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట శాసన సభ్యుడు కెఆర్ నాగరాజు పాల్గొన్నారు.తొలుత హనుమకొండ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం డిసిసిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ సత్యం, అహింస, స్వదేశీ, సర్వోదయం వంటి సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలనే ఉద్దేశంతో చరక అభ్యాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీజీ ఆశయాలకు ప్రతీకగా ఉన్న చరకానికి నూలు వడకడం ద్వారా స్వావలంబన, స్వదేశీ భావన ప్రాముఖ్యతను నాయకులు ప్రజలకు వివరించారు.అనంతరం డిసిసి భవన్‌లో ఏర్పాటు చేసిన సర్వోదయ చరక సంఘటన్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ గాంధీ సైద్ధాంతిక సిద్ధాంత విలువలను తెలిపేదే చరక అని తెలిపారు.ఈ చరక ద్వారా గాంధీ ఆలోచనలను వ్యక్తపరచవచ్చు అని దూది నుంచి నూలు దారాన్ని ఎలా తీస్తామో సమాజంలో ఉన్న సమస్యలను వీడడానికి మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుంది అని పేర్కొన్నారు.ఈ చరక మనిషిని మనిషిగా ప్రేమ,సత్యాన్ని కలుపుతుందని,ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో జరుపుకోవడం అందులో గాంధీ వర్ధంతి రోజున నిర్వహించడం నాకు చాలా సంతోషంగా అనిపించిందన్నారు. ఇదే మహాత్మా గాంధీకి ఇచ్చిన నిజమైన నివాళి అని,అతి గొప్ప శ్రద్ధాంజలి అని అన్నారు.గాంధీజీ చూపిన మార్గమే నేటి సమాజానికి దిశానిర్దేశకమని, ఆయన సిద్ధాంతాలను కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అవుతుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ గాంధీ ఆశయాలను విధానంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకెళ్తోందని అన్నారు. గాంధీజీ బోధించిన సత్యం, అహింస మార్గమే దేశానికి శాశ్వతమైన బలం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం,రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్,రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,ఈవి శ్రీనివాస్ రావు,దుద్దిళ్ల శ్రీనుబాబు,మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్ రావు,జాతీయ కో ఆర్డినేటర్ పులి అనిల్,కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 'బంగారం' సమర్పించుకున్న ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**తెలంగాణ కుంభమేళాగా పిలవబడే ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని శ్రీ స మ్మక్క సారలమ్మ మహా జాతరలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పద్మ (గణపు రం మాజీ జెడ్‌పి టిసి) దంపతులు వన దేవతలను దర్శించుకుని, మొ క్కు లు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రా వు తన బరువుకు సమానంగా 71 కేజీల బం గారం (బెల్లం)ను వన దేవ తలకు నైవేద్యంగా స మర్పించారు.

**గట్టమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు**

మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ తల్లుల దర్శనం కన్నా ముందు ఎమ్మెల్యే దంపతులు ములుగు పట్టణానికి సమీపంలోని గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు అధికారులు, పూజారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. మేడారం గిరిజన జాతరకు వెళ్లే భ క్తులకు గట్టమ్మ ఆలయం గేట్ వే ఆఫ్ మేడారంగా ప్రసిద్ధి చెందింది.

**కమలాపూర్ శ్రీ సమ్మక్క - సారలమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు**

భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ శి వారులో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతరలో ఎమ్మెల్యే దంపతులిద్ద రూ పాల్గొని, వన దేవతలను దర్శించుకుని మొ క్కులను చెల్లించారు. కాగా, జాతర కమిటీ ని ర్వాహకులు,కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దం పతులకు శాలువాలు కప్పి డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు.

## వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ వన దేవతలు శ్రీ సమ్మక్క సారలమ్మ వీర వనితల జాతరను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేవూరి మాట్లాడుతూ వనదేవతల దీవెనలు భక్తులకు ఉండాలని, సమ్మక్క సారలమ్మ తల్లులు ఆశీస్సులతో పరకాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, మరింతగా అభివృద్ధి చెంది ప్రజలు సుభిక్షంగా ఉండాలని వనదేవతలను వేడుకున్నట్లు తెలిపారు. అన్ని రకాల ఏర్పాట్లుచేసినవివిధ శాఖల అధికారులను సిబ్బందిని అభినందించారు.

## ఘన్‌పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

### వరంగల్ ఎంపిడాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్:** 18 వార్డుల్లో గెలిచి స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘన్‌పూర్ మున్సిపాలిటీ నాయకులు, ఆశావాహులు, ఇన్‌చార్జులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఎంపి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతీ ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీ గెలుపు కోసం పనిచేయాలన్నారు. మనందరం కలిస కట్టుగా పనిచేసి 18కి 18 వార్డుల్లో గెలిచి ప్రతిపక్షాలకు కాంగ్రెస్ పార్టీ బలం ఏంటో చూపించాలన్నారు. అందరం కలిసి కట్టుగా ఉంటేనే మనందరికీ ఎవరూ ఎదురురాలేరన్నారు. చిన్న చిన్న బేదాభిప్రాయాలకు పోయి పార్టీకి నష్టం కలిగించవద్దన్నారు. అందరికీ అవకాశాలు ఒకేసారి రావని, ప్రజాధారణ ఉండి గెలిచే అవకాశం ఉన్న వారికే పార్టీ అవకాశం ఇస్తుందన్నారు. అది కూడా పక్కా సర్వే ఫలితాల ద్వారా పీసీసీ నిర్ణయిస్తుందన్నారు. ఎక్కడ ఏ చిన్న సమన్వయ లోపం జరిగినా పార్టీకే నష్టం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికే రూ. 50 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపిస్తే మరో రూ. 50 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది, ఎమ్మెల్యేది అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, అభ్యర్థులు, వివిధ మండలాల నుంచి వచ్చిన వార్డు ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరకాల సబ్ జైలును సందర్శించిన జైళ్ల శాఖ డిజి

**ప్రజాపక్షం/పరకాల :** జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ శుక్రవారం పరకాల సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలు ప్రాంగణాన్ని సమగ్రంగా పరిశీలించి, ఖైదీలకు అందుతున్న వసతులు, సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సంక్షేమం, జీవన పరిస్థితులు, పునరావాస చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలను మానవీయంగా చూడటం, సంస్కరణాత్మక విధానాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె ఈ సందర్భంగా సూచించారు.అనంతరం సబ్ జైలు, పరాకలలో పదవీ విరమణ ఫెలిసిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. 31 జనవరి 2026న సూపర్ అన్యుయేషన్ వయస్సు పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయనున్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ గడ్డం దైనమ్మ సేవలను ఈ సందర్భంగా ఘనంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమానికి డీజీ సౌమ్య మిశ్రా ఐపీఎస్, వరంగల్ రేంజ్ డీఐజీ ఆఫ్ ప్రిజన్స్ ఎం. సంపత్, వరంగల్ డీఎస్జేఓ పి. వెంకటేశ్వర స్వామి, సబ్ జైలు, పరకాల సూపరింటెండెంట్ ఎన్. ప్రభాకర్, ఇతర కారాగార శాఖ అధికారులు, సిబ్బంది, అలాగే పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ మాట్లాడుతూ గడ్డం దైనమ్మ నిష్కలంకమైన సేవలు, శాఖ పట్ల చూపిన నిజాయితీ, అంకితభావాన్ని ప్రశంసించారు. సేవలకు గుర్తింపుగా ఉద్యోగుల నెలవారీ విరాళాలతో కూడిన వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కును పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగికి అందజేశారు.

## భూపాలపల్లిలో జోరుగా నామినేషన్లు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మున్సిపల్ ఎన్నికలకు శుక్రవారం నామినేషన్ల గడు చివరి రోజు కావడంతో అభ్యర్థులు జోరుగా నామినేషన్ల వేయడం తో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ సిపిఐ, సిపిఎం, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు. మున్సిపల్ లో మొత్తం 30 వార్డులు ఉండగా అన్ని వార్డులకు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ప్రధానంగా 22వ వార్డుకు బిఆర్ఎస్ అభ్యర్థి బుర్ర రమాదేవి సదానందం, 29వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి గండ్ర హరీష్ రెడ్డి, 28వ వార్డుకు సిపిఐ అభ్యర్థి సోత్కు ప్రవీణ్, 5 వార్డు గంగసరం, 7 వార్డు లో నూకల భూలక్ష్మి చంద్రమౌళి, 19 వార్డు కురిమిళ్ల శ్రీనివాస్, 19 వార్డు బిఅరెస్ మాడ హరీష్ రెడ్డి, 27వ వార్డుకు సిపిఎం అభ్యర్థిగా ఎర్రం అనూష సతీష్ కుమార్, 11వ వార్డు కాంగ్రెస్ గురజాల రవి, 1వ వార్డ్ బిఆర్ఎస్ నుండి వెంకటరాణి సిద్దు, 9 వార్డు అప్పం కిషన్, 15 వార్డు లో బొజ్జపల్లి అనూష మహర్షి బీఆర్ఎస్ నుండి నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యంగా 29, 30, 19, 23 జనరల్ స్థానాలలో డిమాండ్ అధికంగా ఉండడంతో అధిక నామినేషన్లు దాఖలు అయ్యాయి.

## వనం నుంచి జనంలోకి సమ్మక్క-సారలమ్మ

### శ్రీశ్రీ గబ్బిలాల మడుగు శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో వేలాది మంది భక్తులు


### నేడు వనదేవతలు తిరిగి వనంలోనికి ప్రయాణం



**ప్రజాపక్షం/గూడూరు;**గతంలో ఎన్నడు లేని విధంగా భక్తులతో శ్రీశ్రీ గబ్బిలాల మడుగు శ్రీసమ్మక్క సారలమ్మ జాతర అంగరంగవైభవంగా జాతర ప్రధాన పూజారి కొట్టెం కృష్ణ జాతర కమిటి అధ్యక్షులు అర్రెమ్ వీరస్వామి ఈధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గబ్బిల మీని మైడారం జాతరలో గద్దెలపైకి చేరిన తర్వాత వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.శుక్రవారం శ్రీశ్రీ గబ్బిలాల మడుగు జాతరలో భక్తులు వేలాది మంది హాజరై వనదేవతలు లకు మొక్కులు చేయించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బెల్లం (బంగారం) కానుగా సమర్పిస్తారు.పాఖల వాగులో స్నానం చేసి సమ్మక్క సారలమ్మల చైతన్యాన్ని స్మరించుకుంటారు. శివసత్తులు నృత్యాలు పూనకంలో ఊగిపోయే (శివసత్తులు) నృత్యాలు డప్పు చప్పుళ్ళు డోలు వాయిద్యాలతో గబ్బిల మడుగు మీని మేడారం ప్రాంగణం మారుమోగుతుంది. మొక్కులు బదులు తమ కోరికలు తీర్చిన వనదేవతలకు కోళ్లు మేకలను బలి ఇచ్చి పసుపు కుంకుమ బోనాలు నైదేద్యం వనదేతలకు సమర్పిస్తారు.గబ్బిల మడుగు మీని జాతరుకు గూడూరు మండలంతో పాటు కేసంద్రం నెక్కోండ ఖానాపురం కొత్తగూడ గంగారం మండలలతో పాటు మహబూబాబాద్ జిల్లాతో పాటు ఇతర జిల్లా నుండి కూడా భక్తులు రావడంతో గబ్బిల మడుగు జాతర జనసంద్రంగా మారింది.ఈనెల 21 న వైభవంగా మండ మెలుగు పండుగ నుంచి భక్తులు దర్శించుకుంటున్నారు.ఈనెల 28 న పగిద్దిరాజు గోవిందరాజు నాగులయ్య జంపన్న సారలమ్మ గద్దెపై కి వచ్చింది 29న సమ్మక్క గద్దెపై కొలువుదీరిన వనదేవతలు 30న పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నేడు వనదేవతలు వనం లోనికి తిరిగి ప్రయాణం చేస్తారు అనంతరం శ్రీశ్రీ గబ్బిల మడుగు జాతర మోస్తుంది.

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి తు.చ. తప్పకుండా అమలు

### అధికారులకు కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/జనగామ:**ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా తప్పకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ర్యాలీలు, వాహనాలకు, మైక్‌లకు అనుమతి తీసుకోవాలని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎన్నికల నోడల్ జోన్ అధికారులతో సాధారణ పరిశీలకులు నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌లో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ఎన్నికల విధులు ఎంతో కీలకమని, ఎక్కడా ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించి, సమర్థవంతంగా విధులు నిర్వయించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తితో ఆపటు అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణ పూర్తి అయిన పిదప బ్యాలెట్ పేపర్ల ప్రిటింగ్‌కు మేటిరీయల్ పంపిణికి చేపట్టవలసిన చర్యలపై పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ తప్పనిసరిగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ , యంసిసి బృందాలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట ఉల్లంఘన జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నందున యంసిసి నోడల్ అధికారు దశలవారిగా నివేధికలను సమర్పించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘనపై ఏమైనా ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందిచాలని, అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో తప్పనిసరిగా వెబ్ క్యాస్టింగ్ చేసేందకు ప్రణాళికను సిద్ధం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత చర్యలు పటిష్టంగా చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా సాధారణ అబ్జర్వర్ ఎ నర్సింహారెడ్డి, మాటాలడుతూఏ గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వయించిన తరహాలోనే మున్సిపల్ ఎన్నికలు కూడా సమర్ధవంతంగాఈ ప్రశాంత వాతావరణంలో నిర్వయించుటకు అందరు కృషి చేయాలన్నారు. అభ్యర్థులు రోజువారిగా ఖర్చు చేస్తున్న వివరాలను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. ఆర్ఓలు, ఏఆర్ఓలు నోడల్, జోన్ అధికారులు సిబ్బంది క్రమం పత్తకుండా సమీక్షలు నిర్వయించాలని, సమన్వయంతో విధులు నిర్వయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు ఎస్ జయశ్రీ, జడ్‌పి సిఈఓ మధురిషా, జనగామ స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కమీషనర్లు మహేశ్వర్‌రెడ్డి, రాధాకృష్ణ, పిడి హౌసింగ్ కోదండరామ్, డిసిఓ మాతృనాయక్, ఎలక్షన్ పర్యవేక్షకులు నోడల్ జోనల్ ఆర్ఒలు, ఎఆర్ఒలు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా కలెక్టర్‌లో ఎన్నికల సాదారణ అబ్జర్వర్ బేటీ**

మున్సిపల్ సాధారణ ఎన్నికల అబ్జర్వర్ తెలంగాణ బాషా, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏ నర్సింహారెడ్డి శుక్రవారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ పూల బోకేను అందించి స్వాగతం పలికారు. ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వయించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్ట్ర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పాదర్శకంగా ఎన్నికలు నిర్వయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**పోలింగ్ స్టేషన్లు పరిశీలించిన పరిశీలకులు**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పరిశీలకులు నర్సింహారెడ్డి పోలింగ్ జరిగే ధర్మకంచెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వీవర్స్‌కాలనీలోని డగ్లస్ స్కూల్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఎన్నికల సామగ్రి, రవాణ, భద్రత, తదితర అంశాలపై చర్చించారు. మున్సిపల్ కార్యాలయంలోని భద్రత, ఏకశిల డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.



## స్మార్ట్ కిడ్జ్‌లో క్రీడా సంబురం

### స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన డివైఎస్ఒ సునీల్ రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో క్రీడా సంబురాలు అంబరాన్ని అంటాయి. పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డివైఎస్‌వో) తుంబూరు సునీల్ రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డివైఎస్ఒ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని చాటుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించడానికి పాఠశాల యజమాన్యం నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ పట్ల అభినందనలు తెలిపారు. గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. పాఠశాల చైర్మన్ చింత నిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారన్నారు. రేపు కూడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని కృష్ణచైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ రహిత సమాజ నిర్మాణమే శ్రీనివాసరెడ్డికి ఇచ్చే సిపిఐ ఘన నివాళి



కొల్లు శ్రీనివాసరెడ్డి 11వ వర్ధంతి సభ

**ప్రజాపక్షం/అశ్వాపురం:** దోపిడీ రహిత సమాజ నిర్మాణమే అమరజీవి కామ్రేడ్ కొల్లు శ్రీనివాసరెడ్డి లక్ష్యమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు మున్నా లక్ష్మీ కుమారి అన్నారు. శుక్రవారం మొండికుంటలోని సిపిఐ కార్యాలయం వద్ద కొల్లు శ్రీనివాసరెడ్డి విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ మండల సహాయ కార్యదర్శి కమటం సురేష్ అధ్యక్షతన జరిగిన 11వ వర్ధంతి సభలో వారు ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ప్రజా పోరాటాలకు నిలువుటద్దం నిర్మించి, అనతి కాలంలో మృత్యువడి చేరారని, శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రెడ్డి అరుణ, ఎఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, మాజీ ఎంపిపి కొల్లు మల్లారెడ్డి, సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు కమటం సురేష్, నాయకులు కోడి వెంకన్న, కొడాలి వెంకటేశ్వరరావు, శిషన్, శ్రీద్రక్షలు, దంతాల జగదీష్, కొల్లు ఆశా కుమారి, తేమిటం సంగు, పగిడిపల్లి సమ్మయ్య, కరటం అంజయ, మంగళశిరిర మనిక, కుటుంబ బంధువులు మర్రి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఐదిస్తా 'నేను' ఒకటి అదనంగా ఇస్తా

### మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానం కోసం పోటాపోటీ

### కాంగ్రెస్‌లోనూ కుదరని సక్యత

**ప్రజాపక్షం/ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం పోటీ పెరిగింది. వార్డు, కౌన్సిలర్లతో పాటు చైర్‌పర్సన్ స్థానాలకు పలువురు పోటీపడడంతో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం జిల్లాలో ఓ చైర్మన్ స్థానం కోసం కాంగ్రెస్ నాయకుడొకరు నేను ఆరుకోట్లు ఖర్చు పెడతానని సమావేశంలో వెల్లడించగా అదనంగా నేను మరో కోటి రూపాయలు ఖర్చు చేస్తానని తనకే చైర్మన్ స్థానం కేటాయించాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతుంది. మొత్తంగా ఈ పోటీ తీవ్రం కావడంతో పార్టీ వర్గాలుగా చీలిపోయింది. పలు చోట్ల కాంగ్రెస్ నుంచే ఒక్కో వార్డుకు నలుగురైదుగురు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ స్థానాలు జనరల్ మహిళలకు రిజర్వు కావడంతో పోటీ తీవ్రంగా ఉంది. మధిర, వైరాలో రాజకీయ సమీకరణలతో పాటు ఇతరత్రా సమీకరణలు కూడా సాగుతున్నాయి. చైర్‌పర్సన్ అభ్యర్థిగా భావిస్తున్న వార్డుల్లో కూడా కాంగ్రెస్ నుంచి ఇతరులు నామినేషన్ దాఖలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

**చర్చల దశలోనే పొత్తులు :** ఒకట్రెండు మున్సిపాలిటీలలో తప్ప అది కూడా బిఆర్ఎస్, సిపిఐ(ఎం) మినహాయిస్తే మిగిలిన రాజకీయ పార్టీల మధ్య పొత్తులు చర్చల దశలోనే ఉన్నాయి. నామినేషన్ల అనంతరం చర్చించుకుందామనే రీతిలో మొత్తంగా నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీతో సయోధ్య కుదరడం ఎంత కష్టమో గెలిచిన పంచాయతీ ఎన్నికలు ఇప్పటి మున్సిపల్ ఎన్నికల తీరు రుజువైందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఆ పార్టీలోనే సయోధ్య కుదిరే పరిస్థితి లేనందున ఇక మిగిలిన పక్షాలతో చర్చలు సాగడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అశ్వారావుపేట లాంటి చోట సిపిఐకి ఒక స్థానం ఖరారు చేసి తిరిగి ఆ స్థానంలో కూడా కాంగ్రెస్ నామినేషన్లు వేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మొత్తంగా పొత్తులు నామినేషన్ల ఘట్టం ముగిసిన తర్వాత కూడా చర్చల దశలోనే ఉన్నాయి.

## ప్రశాంతంగా బార్ కౌన్సిల్ ఎన్నికలు




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నికలు జరగగా మొత్తం 990ఓట్లకు గాను 887ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. న్యాయవాదులు ఉత్సాహంగా బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఐఎఎల్ నాయకులు, కార్యకర్తలు దుస్సా జనార్ధన్ గెలుపును కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వద్ద దుస్సా జనార్ధన్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు మాధవరావు, లతీఫ్, శేషగిరి, కొల్లి కొండ శరత్‌బాబు, శివరామకృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఆఖరు రోజు భారీగా నామినేషన్లు



### ఖమ్మంలో 27, భద్రాద్రిలో 70 స్థానాల్లో సిపిఐ నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపోల్స్‌కు సంబంధించి ఆఖరు రోజు శనివారం భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ కేంద్రాల వద్ద అభ్యర్థుల తాకిడి మొదలైంది. ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లోనూ ఆఖరు రోజు భారీగానే నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల సమయం ముగిసిన తర్వాత కూడా అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో ఉండి నామినేషన్లను దాఖలు చేస్తున్నారు.

**సిపిఐ అభ్యర్థుల నామినేషన్ :** కొత్తగూడెం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లు ఉండగా అన్నింటికి సిపిఐ అభ్యర్థులు పార్టీ మద్దతుదారులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇల్లందు మున్సిపాలిటీలో మూడు స్థానాలకు, అశ్వారావుపేటలో రెండు స్థానాలకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఖమ్మం జిల్లాలోని కల్లూరు మున్సిపాలిటీలో రెండు స్థానాలకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా మధిర మున్సిపాలిటీలో 5,6,7,8,17 వార్డుకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 16 వార్డులకు సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఏదులాపురం పాత పంచాయతీ పరిధిలోని ఏడు వార్డులతో పాటు ముత్తగూడెంలో మూడు, జలగం నగర్, నాయుడు పేట, తాళ్లేసేతండా, మద్దులపల్లి సహా సిపిఐకి బలమైన ప్రాంతాల్లో సిపిఐ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు, ఆయా ప్రాంతాల బాధ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో పోటాపోటీ నామినేషన్లు :** అధికార కాంగ్రెస్ పార్టీ గత పరిస్థితి నేడు మళ్లీ సాక్ష్యాత్కరించింది. అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు కూడా ఆ గ్రూపుల లొల్లి కాంగ్రెస్‌ను వదిలే పరిస్థితి లేదు. అన్ని మున్సిపాలిటీలలోనూ పోటాపోటీగా కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక వార్డులో నలుగురైదుగురు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. ఈ పరిస్థితి మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీలలో ఎక్కువగా కనిపించింది. అశ్వారావుపేటలోనూ ఇదే పరిస్థితి ఉందని పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ ల మధ్య సక్యత కొరవడిందన్న సమాచారం. దీనితో పాత కాంగ్రెస్‌కు సరైన రీతిలో టికెట్ల కేటాయింపు జరపలేదని పలు వార్డుల్లో పాత కాంగ్రెస్‌కు చెందిన వారు నామినేషన్లు దాఖలు చేశారు.

# ధన్యజీవి ఏపూరి సీతయ్య

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ సీనియర్ నాయకులు, స్వాతంత్ర్య సమర యోధుడు నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన ఏపూరి సీతయ్య(90) బుధవారం అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. ఆయన మరణవార్త తెలుసుకున్న కూనంనేని శుక్రవారం నాగిలిగొండలోని ఆయన నివాసానికి వెళ్లి సీతయ్య మృతదేహంపై పార్టీ జెండా ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సీతయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేశారని, బ్రతికినంతకాలం ఎర్రజెండాని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి సీతయ్య పాత్ర ఎనలేనిదన్నారు. సీతయ్య కుటుంబం కూడా తండ్రి బాటలోనే నడుస్తుందన్నారు. సీతయ్య కుమారుడు రవీంద్రబాబు జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్నాడన్నారు. సీతయ్య కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఎర్రా బాబు దొండపాటి రమేష్, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, ఏనుగు గాంధీ, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, ఏనుగు వెంకటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, తాటి నిర్మల, కన్నెబోయిన విజయమ్మ, ఏసు, నేరడ, బస్వాపురం, తిరుమలాపురం సర్పంచులు దూసరి నేతాజీ, ఆవుల నర్సింహారావు, చాపలమడుగు వీరబాబు, సిపిఐ నాయకులు తాళ్లూరి యాదగిరి, తాళ్లూరి పుల్లయ్య, రామిరెడ్డి, బొడ్డు కొండలరావు, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జున, గుండ్ల బేబీరాణి, నాగిలిగొండ శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, బాబు, ముఖర్జీ, షేక్ హుస్సేన్, ఏపూరి నర్సయ్య తదితరులు నివాళులర్పించారు.

**పలు పార్టీ నాయకుల నివాళి..**

సీతయ్య మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్, పెంట్యాల అప్పారావు, పెంట్యాల పుల్లయ్య. మాజీ ఎంపిపి కోపూరి పూర్ణయ్య, ఆలస్యం బసవయ్య, కాంద్ర పిచ్చయ్య, టిడిపి మండలఅధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీను, బారాస మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపిపి గురిజాల హనుమంతరావు, మంకెన రమేష్, వేముల నర్సయ్య, వంకాయలపాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చాట్ల సురేష్, గడ్డం శ్రీను, సిపిఎం మదిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, నాయకులు కొండ్రు జానకిరామయ్య, ఓబెనబోయిన వీరబాబు, మద్దిని బసవయ్య తదితరులు నివాళులర్పించారు.

# పోలీసులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గల నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్‌పి ఆ నామినేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అంవాఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని ఎస్‌పి ఆదేశించారు. గంపులు గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేదమని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కుట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేపడతామని ఈ సందర్భంగా ఎస్‌పి తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలు సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసు వారికి సమాచారం ఇందించాలని కోరారు. జిల్లాలో శాంతియుత,స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత పద్ధతుల్లో ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని ఎస్‌సి స్పష్టం చేశారు.

# స్థాయికి మించి చికిత్సలు చేయొద్దు


### ఆసుపత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి తుకారాం



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ కిన్నెరసాని రహదారిలో నిభంధనలకు వ్యతిరేకంగానిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌ను జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ సీజ్ చేశారు. అర్హత కలిగిన వైద్యుల పేరుతో అర్హత లేని వైద్యులతో వైద్య సేవలను అందిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కానింగ్ గది, ఎక్స్‌రే గదులను, రికార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా అందిస్తున్న వైద్యంపై అడిగి తెలుసుకొన్నారు. ఆసుపత్రికి సంభంధించిన అనుమతులకు సంభంధించిన పత్రాలను అడిగారు. దీనితో మావద్ద అందుబాటులో లేవని, యాజమాన్యం కూడా టూర్‌కు వెళ్ళారని సిబ్బంది తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో నిర్వాహణలో వివిధ లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. భవన సెల్లార్ కేవలం పార్కింగ్‌కు మాత్రమే వినియోగించాలని కానీ వివిధ రకాల ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. పూర్తి స్థాయి అనుమతులు లేకుండానే కేవలం అనుమతి ధరఖాస్తులతోనే ఆసుపత్రిలో వైద్య సేవలను ప్రారంభించారని గుర్తించినట్లు తెలిపారు. ఇది నిభంధనలకు వ్యతిరేకమన్నారు. దీనితో ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపిలు, పిఎంపిలు కేవలం ప్రాథమిక వైద్యాన్ని మాత్రమే చేయాలన్నారు. ప్రాథమిక వైద్యశాలలో ఇంజెక్షన్‌లు వేయటం, రక్త,మూత్ర,తదితర వైద్య పరీక్షలకు సిఫారసు చేయటం,(ఐవి) సెలైన్ బాటిల్స్ ఎక్కించటం లాంటివి చేయకూడదన్నారు. ఎవరైనా స్థాయికి మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిసి మోహన్, డిపిఎంఒ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రంగా ఖమ్మంకు ప్రత్యేక గుర్తింపు

### ఖిల్లా రోప్‌వే పనులపై మంత్రి తుమ్మల సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు తీసుకు రావడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖిల్లా రోప్‌వే నిర్మాణంతో ఖమ్మం నగరం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఖిల్లా రోప్ వే నిర్మాణ బాధ్యతలు చేపట్టిన రోప్‌వే సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సిఈవో రంజిత్ పక్రాసి తో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కమిషనర్ వల్లూరి క్రాంతి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో మంత్రి తుమ్మల ఫోన్‌లో మాట్లాడారు. రోప్‌వే నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి పనులు వేగవంతమయ్యేలా చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరం పర్యాటకానికి కీలక ప్రాజెక్టు, చారిత్రిక ప్రాధాన్యత కలిగిన ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణం పూర్తయితే పర్యాటక రంగంలో కొత్త అధ్యయం మొదలవుతుందన్నారు. రోప్‌వే ద్వారా ఖిల్లాను సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని దీనితో ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందన్నారు. రోప్‌వే నిర్మాణానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను ప్రభుత్వం తరుపున అందిస్తామని రోప్‌వే నిర్మాణ సంస్థకు తెలిపారు. పనులు నిర్ణీత గడువు లోగా పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగమంతా కృషి చేయాలన్నారు. ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకుల సంఖ్య పెరగడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. హోటళ్లు, రవాణా, గైడ్ సేవలు తదితర రంగాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు.

**రోప్‌వే పనులను పరిశీలించిన కమిషనర్**



ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. శుక్రవారం ఖిల్లా ప్రాంతంలో అభిషేక్ అగస్త్య పర్యటించి రోప్‌వే నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో పర్యాటకాభివృద్ధిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా నిర్దేశిత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోప్‌వే నిర్మాణంతో ఖిల్లాకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహకం లభిస్తుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిర్మాణ సంస్థ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుంది

### జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మార్చి 6, 7 తేదీలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం సమ్మక్క సారక్కల జాతర వద్ద ఆవిష్కరించారు. ఎకోస్ ఆఫ్ ది పాస్ట్, బీమ్స్ ఆఫ్ లైట్ ఎక్స్ ప్లోరింగ్ ది సైంటిఫిక్ పినామినా బీహైండ్ తెలంగాణ అర్కిటెక్చర్ అనే అంశంపై మార్చి 6,7 తేదీలలో జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో మంచి అంశంపై సదస్సు నిర్వహించటం అభినందనీయం అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జాతరలో సేవలు అందించేందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్ల నుప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ నర్సింగ్ శ్రీనివాసరావు, కాలేజీ ఆకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వింత వ్యాధితో వీధి కుక్కలు

### ఇతర పశువులకు వ్యాపిస్తుందన్న ఆందోళనలో రైతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** కరోనా తర్వాత రకరకాల వ్యాధులు మనుషులతో పాటు పశు పక్ష్యాదులను ఇబ్బందులు పెడుతున్నాయి. అంతుచిక్కని వ్యాధులతో ఇప్పుడు వీధి కుక్కలు ఇబ్బందులు పడుతున్నాయి. చర్మమంతా పొట్టు ఊడిపోయి విపరీతమైన దురదతో బాధపడుతున్నాయి. ఒక ఊర్లోనో రెండు ఊర్లలోనో కాదు ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం ఇదే పరిస్థితి. చిన్న పిల్లలు చూస్తే భయపడే పరిస్థితి. గతంలో తెల్లజాతి పశువులకు ఇటువంటి చర్మవ్యాధి సోకింది. చాలా పశువులు చనిపోయాయి. తెల్లజాతి పశువుల నుంచే కుక్కలకు ఈ చర్మవ్యాధి సంక్రమించిందని భావిస్తున్నారు. ఈ కుక్కల నుంచి ఇతర జంతువులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని చర్మవ్యాధితో బాధపడుతున్న కుక్కలకు వైద్యం అందించకపోతే ఈ అంటువ్యాధి మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వీధి కుక్కల కాటుకు గురై ఇబ్బందులు పడుతున్న దశలో ఇప్పుడు ఈ చర్మవ్యాధి మరో రకంగా భయపెడుతుంది.



## ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీసు కమిషనర్ సునిల్‌దత్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్‌ప్లేటు సరిగా లేని వాహనాలతో పాటు సరైన వాహన పత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. సరైన నెంబర్, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్టేషన్‌కు తరలించి సదరు యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్లేట్లు తీసుకువచ్చి అమర్చిన వారికి మందలించి వదిలివేశారు. ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ చైన్ స్నాచింగ్ వంటి నేరలకు పాల్పడి తప్పించుకునేందుకు నెంబర్ ప్లేటు లేకుండా తిరిగే అవకాశం ఉన్న నేపద్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనాలను నిర్లక్షంగా రహదారుల వెంట నిలపడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నయన్నారు. అదేవిధంగా మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దన్నారు. రోడ్లపై తిరిగే ప్రతి వాహనానికి తప్పనిసరిగా వాహనపత్రాలు ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పెడింగ్ చలానాలను త్వరితగతిన చెల్లించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.



## 11వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా వినోదరావు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి ఊటుకూరు వినోదరావు నామినేషన్ దాఖలు చేశారు. వినోదరావును బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య బలపరిచింది. వినోదరావు సత్తుపల్లిలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించే వారు. నగరంలో అందరికి సుపరిచితుడైన వినోదరావు 11వ వార్డులో నామినేషన్ వేయడంతో గెలుపు ఖాయమన్న ప్రచారం జరుగుతోంది.

# ప్లే ఆఫ్స్‌లో ముంబై నిలిచేనా

## టాస్ గెలిచిన గుజరాత్



మహిళల ప్రీమియర్ లీగ్‌లో ప్లే ఆఫ్స్ బెర్తులపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడే సమయం వచ్చేసింది. చావోరేవో పోరులో తలపడుతున్న గుజరాత్ జెయింట్స్, ముంబై ఇండియన్స్‌లో గెలిచిన జట్టు ముందంజ వేయడం ఖాయం. దాంతో, ఇరుజట్లు విజయంపై కన్నేసిన పోరులో టాస్ గెలిచిన అష్లీ గార్డ్‌నర్ బ్యాటింగ్ ఎంచుకుంది. గత మ్యాచ్‌లో 190 రన్స్ చేసినా హర్మన్‌ప్రీత్ కౌర్ అర్ధశకంతో ఓటమి పాలైన గుజరాత్ ఈసారి గెలుపుపై ధీమాతో ఉంది.

**గుజరాత్ తుది జట్టు :** బేత్ మూనీ(వికెట్ కీపర్), సోఫీ డెవినె, అనుష్క శర్మ, అష్లీ గార్డ్‌నర్(కెప్టెన్), జార్జియా వరేహం, భారతి ఫుల్‌మాలి, కనికా ఆహుజా, కష్వీ గౌతం, తనూజ కన్వర్, రేణుకా సింగ్, రాజేశ్వరీ గైక్వాడ

**ముంబై తుది జట్టు :** హేలీ మాథ్యూస్, సంజీవన్ సంజన, నాట్ సీవర్ బ్రంట్, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), అమన్‌జోత్ కౌర్, అమేలియా కేర్, రహిల ఫిర్దౌస్(వికెట్ కీపర్), సంస్కృతి గుప్తా, వైష్ణవి శర్మ, షబ్నం ఇస్మాయిల్, పూనమ్ ఖెమ్నర్.

ప్రస్తుతం 8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన గుజరాత్ జెయింట్స్ ప్లే ఆఫ్స్ బెర్తుకు చేరువలో ఉంది. గత మ్యాచ్‌లో మూడు పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించిన ఆ జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఓడిస్తే చాలు. దర్జాగా 10 పాయింట్లతో బెర్తు దక్కించుకుంటుంది.

ఒకవేళ ముంబై విజయం సాధిస్తే.. 8 పాయింట్లతో ఇరుజట్లు రేసులోనే ఉంటాయిది. అయితే.. చివరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్ చేతిలో ఢిల్లీ ఓడిందంటే గుజరాత్, ముంబై నాకౌట్‌కు దూసుకెళ్తాయి.

# మారథాన్ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఓటమి.. ఫైనల్లో అల్కరాస్



కొత్త ఏడాదిలో మొదటి గ్రాండ్‌స్లామ్‌లో కార్లోస్ అల్కారాస్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదరగొడుతున్న ఈ టాప్ సీడ్ పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు చెక్ పెట్టాడు. అలాఅనీ జ్వెరెవ్ అలవోకగా తల వంచలేదు. స్పెయిన్ కెరటానికి ముచ్చెమటలు పట్టించిన అతడు.. ఐదు గంటల 27 నిమిషాల పాటు పోరాడాడు. కానీ, చివరకు క్లాస్ ఆటతో చెలరేగిన అల్కరాస్‌ను విజయం వరించింది. ఓపెన్ ఎరాలో చిన్నవయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు నెలకొల్పాడు. నిరుడు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ చెమటోడ్చిన అల్కరాస్‌కు ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. అప్పుడు సిన్నర్‌ను ఓడించేందుకు ఐదు గంటలు కష్టపడిన అతడు.. జ్వెరెవ్‌ను మట్టికరిపించేందుకు ఐదు గంటల 27 నిమిషాలు తీసుకున్నాడు. దూకుడైన ఆటతో జర్మనీ కుర్రాడికి షాకిస్తూ వరుసగా రెండు సెట్లు గెలిచిన అల్కరాస్.. నిర్ణయాత్మక సెట్‌ను ఒక్క పాయింట్‌తో కోల్పోయాడు. దాంతో.. నాలుగో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. దాదాపు ఐదున్నర గంటలు ప్రేక్షకులను అలరించిన ఈ మారథాన్ మ్యాచ్‌లో 6–4, 7–6, 6–7, 7–6, 7–5తో అల్కరాస్ విజేతగా నిలిచాడు. రెండో సెమీఫైనల్లో తలపడుతున్న జన్నిక్ సిన్నర్ , నొవాక్ జకోవిచ్‌లో ఒకరితో అతడు ఫైనల్ ఆడనున్నాడు. ఓపెన్ ఎరాలో అత్యంత చిన్న వయసు(22 ఏళ్లు)లోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు సృష్టించాడు. 1993లో జిమ్ కొరియర్ పేరుతో ఉన్న రికార్డును ఈ యంగ్ సంచలనం బద్ధలు కొట్టాడు.



# వరల్డ్‌కప్ మ్యాచ్ అధికారులుగా శ్రీనాథ్, నితిన్

టి–20 ప్రపంచకప్ టోర్నీకి గడవు సమీపిస్తున్న వేళ మ్యాచ్ అధికారులను ఐసిసి ప్రకటించింది. ఈ మెగా టోర్నీలో లీగ్ దశ నిర్వహణ బాధ్యతలు చూసేందుకు 30మందిని ఎంపిక చేయగా వీరిలో ఇద్దరు భారతీయులకు మాత్రమే చోటు దక్కింది. అంపైర్‌గా నితిన్ మీనన్ , రిఫరీగా జవగళ్ శ్రీనాథ్ ఎంపికయ్యారు. 24 మంది ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనుండగా.. ఆరుగురు మ్యాచ్ రిఫరీలుగా సేవలందించనున్నారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి భారత్, శ్రీలంక వేదికగా పొట్టి ప్రపంచ కప్ షురూ కానుంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటిచడంతో పాటు.. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు చోటు కల్పించిన ఐసీసీ శుక్రవారం మ్యాచ్ అఫీషియల్స్‌ను ప్రకటించింది. అంతర్జాతీయ అనుభవానికి ప్రాధాన్యమిస్తూ 30 మంది (24మంది ఆన్ ఫీల్డ్ అంపైర్లు, ఆరుగురు మ్యాచ్ రిఫరీలు)కి వరల్డ్‌ప్ మ్యాచ్‌ల నిర్వహణ బాధ్యతలు కట్టబెట్టింది. **మ్యాచ్ రిఫరీలు :** జవగళ్ శ్రీనాథ్, డీన్ కొస్కెర్, డేవిడ గిల్బర్ట్, రంజన్ మదుగల్లే, ఆండ్రూ పైక్రాఫ్ట్, రికీ రిచర్డ్‌సన్.

**అంపైర్లు :** నితిన్ మీనన్, రొనాల్డ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార ధర్మసేన, క్రిస్ గఫానే, అడ్రియన్ హోల్డ్‌టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేనీ నైట్స్, డొనొవాన్ కాచ్, జయరామన్ మదనగోపాల్, సామ్ నొగజస్కి, కేఎన్ఏ పద్మనాభన్, అల్లాహుద్దీన్ పాలేకర్, అహ్సాన్ రజా, లెస్లీ రీఫర్, పాల్ రీఫిల్, లాంగ్టన్ రుసెరె, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్, రాడ్ టక్నర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, అసిఫ్ యాకుబ్.







## విస్తరణకు అర్థం ఏమిటి?

విశ్వం విస్తరిస్తోంది అని వినగానే, అది ఎందులోకి లేదా ఏ ప్రాంతంలోకి విస్తరిస్తుంది? అనే ప్రశ్న రావడం సహజం. అయితే, ఇక్కడే మన దైనందిన అనుభవం మనల్ని తప్పుదారి పట్టిస్తుంది. మనకు తెలిసిన ప్రతి విస్తరణ ఒక ఖాళీ స్థలంలోనే జరుగుతుంది. గది విస్తరిస్తే బయట గాలి ఉంటుంది. బెలూన్ ఊదితే దాని చుట్టూ గాలి ఉంటుంది. కానీ విశ్వం అలాంటిది కాదు. విశ్వానికి బయట ఖాళీ గది లేదు. బయట అన్న భావననే ఇక్కడ అర్థం లేదు. ఎందుకంటే విస్తరిస్తోంది అనేది వస్తువులు కాదు.. స్థలం మాత్రమే. గెలాక్సీలు ఒకదాన్నొకటి దూరంగా పారిపోతున్నట్లు కనిపిస్తాయి.. కానీ అవి కదలడం లేదు. వాటి మధ్య ఉన్న స్థలం లాగబడుతోంది. ఇది చాలా ముఖ్యమైన తేడా. రబ్బరు షీట్ మీద బొట్లు గీసి దాన్ని లాగితే, బొట్లు కదలకుండా దూరమవుతాయి. అదే విధంగా విశ్వంలో గెలాక్సీలు ప్రయాణం చేయడం లేదు.. స్థలమే పెరుగుతోంది. అందుకే విశ్వం దేనిలోకి విస్తరిస్తోంది? అన్న ప్రశ్నకు 'ఎందులోకీ కాదు' అనేదే నిజమైన సమాధానం. ఇది మనకు అలవాటైన భౌతిక తర్కానికి విరుద్ధంగా ఉంటుంది. మన మెదడు స్థలాన్ని ఒక కంటైనర్‌లా ఊహించుకుంటుంది. స్థలం కూడా ఒక వస్తువులాంటిదే. అది వక్రంగా వంగుతుంది. దానికి లాగితే సాగే లక్షణం ఉంటుంది. రూపం కూడా మారుతుంది. ఇదే ఆధునిక భౌతిక శాస్త్రం ప్రతిపాదిస్తున్న కొత్త సిద్ధాంతం. అంటే విశ్వానికి అంచు లేదు, గోడ లేదు, బయట ఖాళీ లేదు. అది ఒక మ్యాప్ లాంటిది కాదు. నియమాల ప్రకారం మారే ఒక నిర్మాణం. మనకు స్థలం అనిపించే దానే అసలు మౌలిక వస్తువు కాదు. అది కూడా విశ్వంతో పాటు పుట్టింది, విశ్వంతో పాటు మారుతోంది. ఈ వాదన విచిత్రంగా అనిపించొచ్చు. కానీ శాస్త్రంలో నిజాలు చాలాసార్లు మన అలోచనలకు, అంచనాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఏదిఏమైనా, విశ్వం విస్తరిస్తోంది అనేది ఒక భౌగోళిక సంఘటన కాదు.. అది వాస్తవం తానే ఎలా ప్రవర్తిస్తుందో చూపించే సంకేతం.

# గురుత్వాకర్షణకు కొత్త సిద్ధాంతం



సాధారణంగా మనం గురుత్వాకర్షణను ఒక బలంగా ఊహిస్తాం. భూమి మనల్ని లాగుతుంది, సూర్యుడు గ్రహాలను పట్టుకుంటాడు అన్నట్టుగా. కానీ, గురుత్వాకర్షణ స్వతంత్ర బలం కాకపోవచ్చునని, అది లోతైన అనుసంధానాల ఫలితంగా అనుభూతి అయ్యే ప్రభావం మాత్రమే కావచ్చనీకొంతమంది భౌతిక శాస్త్రవేత్తలు ఒక భిన్నమైన దృష్టికోణాన్ని ప్రతిపాదిస్తున్నారు. అంటే, ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వం అనేది విడివిడిగా ఉన్న వస్తువుల సమాహారం కాదు. అది ఒక అంతర్గతంగా అనుసంధానమైన జాలం. కణాలు ఒకదానితో ఒకటి సమాచారం పంచుకుంటాయి. ఆ సమాచార సంబంధాలు ఏర్పరిచే నమూనాలనే మనం ఆకర్షణగా అనుభవిస్తున్నామని ఈ ఆలోచన చెబుతుంది. ఉదాహరణకు, రెండు వ్యవస్థలు ఎంత బలంగా పరస్పరం అనుసంధానమై ఉంటాయో, అవి అంతగా ఒకదానిపై ఒకటి ప్రభావం చూపిస్తాయి. ఆ ప్రభావాన్నే మనం లాగుతున్నాయి అని భావిస్తున్నాం. అంటే గురుత్వాకర్షణ బలం కాదు... అనుసంధానాల తీవ్రతకు కనిపించే రూపం కావచ్చు. ఈ ఆలోచన ఎందుకు ఆకర్షణీయంగా అనిపిస్తుంది అంటే, ఇది విశ్వాన్ని చాలా సరళంగా చూస్తుంది. అదృశ్య బలాలకంటే, సంబంధాలే ప్రధానమని చెబుతుంది. వస్తువులకంటే, వాటి మధ్య ఉన్న బంధాలే ముఖ్యం అంటుంది. ఇది నిజమైతే, భౌతిక శాస్త్రంలోని క్వాంటం భౌతిక శాస్త్రం, గురుత్వాకర్షణ, సమాచారం సిద్ధాంతం అనే వేర్వేరు రంగాలను ఒకే దారంలో కలపగలదు. అలాగే ఇది మన ఆలోచనలపై కూడా ప్రభావం చూపుతుంది. విశ్వాన్ని చల్లగా, నిర్లిప్తంగా కాకుండా అనుసంధానంతో నిండిన వ్యవస్థగా ఊహించుకునేలా చేస్తుంది. అందుకే చాలామందికి ఇది భావోద్వేగంగా కూడా దగ్గరగా అనిపిస్తుంది. అయితే, ఈ సిద్ధాంతం ఇంకా ప్రతిపాదన రూపంలోనే ఉంది. కొంత మంది శాస్త్రవేత్తలు దీనిని వ్యతిరేకిస్తుండగా, మరికొందరు మరింత లోతైన అధ్యయనం అవసరమని అంటూ, మెరుగులు దిద్దే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సమీక్షలు, పరీక్షలు, విమర్శలు వంటివి శాస్త్రానికి అత్యవసరం. ఇవే పురోగతిని సుసాధ్యం చేస్తాయి. భవిష్యత్తులో ఈ ఆలోచన మారవచ్చు, లేదా కొంత భాగం తప్పు కావచ్చు. అయినా ఇది ఇప్పటికే ఒక మంచి పని చేసింది.. మన ఆలోచనల్ని కదిలించింది. ఇప్పటి వరకు మనకు ఉన్న అనేకానేక అభిప్రాయాలపై పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితిని కల్పించింది. వేర్వేరు రంగాల మధ్య చర్చకు తలుపులు తెరిచింది. గురుత్వాకర్షణ నిజంగా అనుసంధానాల నుంచి పుట్టిందా? అన్న ప్రశ్నకు ఇప్పుడే తుది సమాధానం లేదు. కానీ, సాధారణంగా కనిపించే వివరణల వెనుక చాలా లోతైన అందం దాగి ఉండొచ్చనే ఒక పాఠాన్ని ఈ ఆలోచన మనకు చెబుతుంది. శాస్త్రం ముందుకు సాగేది నమ్మకంతో కాదు. ఆసక్తితో, వినడానికి సిద్ధంగా ఉండటంతో, కలిసి పరీక్షించాలనే మనస్తత్వంతో.

# జోరుగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 28,29,30, 31,32,16,3వార్డులకు సిపిఐ అభ్యర్థులు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, చిన్న సైదిరెడ్డి పాల్గొన్నారు.




**దేవరకొండ :** నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపాలిటి 10వ వార్డు సిపిఐ అభ్యర్థిగా జూలూరి మమత జ్యోతిబస్ శుక్రవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.



**చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేట నాలుగో వార్డు సిపిఐ అభ్యర్థిగా జెల్ల ధనమ్మ శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య, చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.



**చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలోని రెండవ వార్డుకు సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, ఏడవ వార్డుకు బొలుగూరి లింగయ్య భార్య సుగుణమ్మ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, అక్బర్, జిల్లా సత్యం పాల్గొన్నారు.



**మధిర :** మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో మడుపల్లిలోని 5, 6, 7 వార్డులకు, పట్టణంలో 8వ వార్డులో సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. 5వ వార్డుకి పెరుమాళ్ళపల్లి వసంత, 6వ వార్డుకు ఊట్ల మరుద్వతి, 7వ వార్డుకు ఊట్ల కొండలరావు, 8వ వార్డుకి బెజవాడ రవిబాబు నామినేషన్ వేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఊట్ల కామేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ముడపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, పున్నవల్లి అప్పారావు, ఊట్ల పూర్ణచంద్రరావు, చింతలపట్ల కృష్ణ, నాగుల్ మీరా, శిలువేరు శ్రీనివాసరావు, గాంధీ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



**భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు పొత్తులో భాగంగా బలపరిచిన నలుగురు అభ్యర్థులతో పాటు 30 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొలిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. సిపిఐ నుండి 5వ వార్డులో గంగ సరం శ్రీనివాస్, 7వ వార్డులో నూకల భూలక్ష్మీచంద్రమౌళి, 24 వార్డు వేముల జ్యోతి శ్రీకాంత్, 28 వార్డు సొత్కు ప్రవీణ్ కుమార్ లు నామినేషన్ వేశారు.

**నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 20వవార్డు కౌన్సిలర్‌గా సిపిఐ అభ్యర్థిగా కపిలవాయి మానస గోపిచారి రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌పత్రాలు అందజేశారు. నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, సిపిఐ జిల్లా కౌన్సిల్‌సభ్యులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





**అమరచింత :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో నాలుగు వార్డులలో అభ్యర్థులు నామినేషన్లు ఎన్నికల అధికారులకు సమర్పించారు. 2వ వార్డు అభ్యర్థిగా కే.భారతమ్మ, 3వ వార్డు అభ్యర్థిగా కే.శంకర్, 4వ వార్డు అభ్యర్థిగా ఏ.బాలేశ్వరి, 9వ వార్డు అభ్యర్థిగా ఏ.భాస్కర్ నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. నామినేషన్ల కార్యక్రమానికి సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్, నాయకులు పి.సురేష్, లక్ష్మీ నారాయణ, సీఎన్.శెట్టి, శ్యాంసుందర్, కుతుబ్ , బాలస్వామి, హాజరయ్యారు మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ నుంచి ఏడు వార్డుల్లో నామినేషన్లు వేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు తెలిపారు. సిపిఐ నుంచి రెండవ వార్డు అభ్యర్థిగా కె.భారతమ్మ, మూడవ వార్డు అభ్యర్థిగా కె.శంకర్, 4వ వార్డు అభ్యర్థిగా ఏ.బాలేశ్వరమ్మ, 5వ వార్డు అభ్యర్థిగా ఎస్.స్వప్న అరవ వార్డు అభ్యర్థిగా భీమన్న, 8వ వార్డు అభ్యర్థిగా ఎండి కుతుబ్, 9వ వార్డు అభ్యర్థిగా ఏ.భాస్కర్ నామినేషన్లు సమర్పించినట్లు తెలిపారు.



**సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని 37వ వార్డు నుండి సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థిగా పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, 4వ వార్డు నుండి ఐతరాజు లింగమ్మలు శుక్రవారం నామినేషన్‌లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఐ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని నామినేషన్ల కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దోరెపల్లి శంకర్, నాయకులు ఖమ్మంపాటి రాము, చామల అశోక్ కుమార్, రేగట్టి లింగయ్య, ఏడెల్లి శ్రీకాంత్, ఐతరాజు వెంకన్న, పాషా, పొదిల లింగయ్య, పొదిల వెంకటమ్మ, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.



**కల్లూరు :** ఖమ్మం జిల్లా కల్లూరు మునిసిపాలిటీలోని 16వ వార్డుకు శుక్రవారం సిపిఐ తరఫున దామల దయాకర్‌రావు నామినేషన్ వేశారు.



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల బరిలో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బబ్బురి శ్రీధర్‌కు పార్టీ అధికారిక ధృవీకరణ పత్రం శుక్రవారం నాయకులు అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్‌లు శ్రీధర్‌కు అందజేశారు.





**నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్‌లో సిపిఐ నుంచి 1వ డివిజన్ అభ్యర్థిగా గొలుసుల రమేష్, 17వ డివిజన్ అభ్యర్థిగా బి.స్వప్నలు శుక్రవారం నామినేషన్ వేశారు. నామినేషన్ల కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు ముత్యాలు, అనిల్, సయ్యద్ ఫిరోజ్‌అలీ, గోవర్ధన్, తిరుపతి, నాగేష్, రవి, లక్ష్మీ పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల బరిలో.. 60 డివిజన్లలో సిపిఐ నామినేషన్లు









**భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సిపిఐ అభ్యర్థులు 60కి 60 డివిజన్లలో నామినేషన్లు అందజేశారు. దీంతో కార్పొరేషన్‌లో సిపిఐ సింగిల్ ఫైట్‌కు సిద్ధ పడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌తో డివిజన్ల సర్దుబాటు ఎటూ తేలికపోవడంతో తప్పని సరీ పరిస్థితుల్లో అన్నిడివిజన్లలో నామినేషన్లు వేయాల్సి వచ్చింది. ఫిబ్రవరి 3వ తేదీ ఉపసంహరణ నాటికి ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నటు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీతో సిపిఎం పొత్తు కుదుర్చున్నట్లు తెలుస్తోంది. సిపిఎంకు 21,31 డివిజన్లను కాంగ్రెస్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక బిఆర్ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులు ఇప్పటి వరకు ఎవ్వరితో ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండానే నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. సిపిఐ, కాంగ్రెస్‌ల మధ్య సీట్లు సర్దుపాటు కాకుంటే ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో జత కట్టి ఉన్న సిపిఐకి గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఒకట్రెండు చోట్ల తప్ప కాంగ్రెస్ ఎక్కడా మద్దతు పలకలేదు. అయినప్పటికీ భారీ స్థానాలతో పాటు మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ కైవసం చేసుకుని సత్తా చాటింది. ఆ ఎన్నికల ఫలితాల అనంతరం సిపిఐతో పొత్తు పెట్టుకుని ఉంటే బాగుండంటూ కాంగ్రెస్ శ్రేణులు బాహాటంగానే చర్చించాయి. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు చులకన చేసి మాట్లాడటంతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు నడిపించారు. దీంతో కాంగ్రెస్ ఖంగు తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అధిష్టానం పొత్తు వ్యవహారంలో సుముఖంగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయనే చర్చ సాగుతోంది. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం సిపిఐ ఒంటరిపోరుకు దిగితే పెద్ద ఎత్తున డివిజన్లలో సత్తా చాటి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకునే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు వాదన. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సిపిఐకి మంచి పట్టు ఉండటంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి.

ఖమ్మంలో...



## వసతి గృహాల్లో మెనూ ప్రకారం ఆహారం అందించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/హుస్నాబాద్ : ప్రభుత్వం వసతి గృహాల్లో కామన్ డైట్ మెనుప్రకారం నాణ్యమై అహారం అందించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమవతి హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలోని వెనుకబడిన బాలుర వసతి గృహంలో నాణ్యతలేని బోజనం పెడుతున్నారని గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించిన సంఘటన కలెక్టర్ క్షేత్రస్థాయితో శుక్రవారం అకస్మికంగా తనిఖి చేశారు. వంటగది వంటలను విద్యార్థులకు ఇస్తున్న భోజనంను పరిశీలించారు. కూరగాయలు నాణ్యత,వసతి గృహాలోపల బైట పరిశుభ్రతను పాటించాలని అన్నారు. వసతి గృహంలో సీసీ కెమోరాలను ఏర్పటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షన చేయాలని అన్నారు. ధర్నాపై విద్యార్థుల ద్వారా విచారణ జరిపించి నివేదిక సమర్పిచాలని తహశీల్దార్‌ను అదేశించారు. ఈ లాంటి సంఘటనలు ఎక్కడ తలెత్తకుండ వసతి గృహలను తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులను అదేశించారు. విద్యాకర్థుల బోజనం వసతి విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండ చూడాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. కలెక్టర్ వెంట అర్‌డివో రాంమూర్తి తహశీల్దార్ లక్ష్మ రెడ్డి, హస్టల్ వెల్ఫేర్ అధికారి మల్లెశం పాల్గోన్నారు.

## మల్లన్న సాగర్ కెనాల్ నుంచి సాగు నీరు విడుదల



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు మల్లన్న సాగర్ కెనాల్ నుండి కొడకండ్ల గ్రామం వద్ద కాలువలోకి సాగునీరు వదిలారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్, రాయవరం, తిమ్మాపూర్, వెంకటాపూర్ (బిజి) గ్రామాలలో కెనాల్‌కు ఇరువైపుల పంటలు సాగు చేసిన రైతులు గురువారం కాలువ ద్వారా నీరు విడుద చేయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కెనాల్‌లో నీరు లేక బోరుబావుల్లో నీరు అడుగంటి పోతున్న క్రమంలో పంటలు ఎండిపోయే పరిస్థితిని ఇరిగేషన్ అధికారులతో పాటు గజ్వేల్ మాజీ ఎంఎల్‌ఎ తూంకుంట నర్సారెడ్డిదృష్టికి తీసుకుపోయారు. దీంతో నర్సారెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరించగా, శుక్రవారం కెనాల్ ద్వారా కొడకండ్ల గ్రామం వద్ద మల్లన్న సాగర్ నీటి విడుదలకు అధికారులకు అదేశాలు జారి చేయడంతో వెంటనే అధికారులు నీరు విడుదల చేశారు. అడిగిన వెంటనే సాగునీరు విడుదలకు కృషి చేసిన నర్సారెడ్డికి మండల రైతులు ధన్యావాదాలు తెలిపారు.

## దుబ్బాకలో 235 నామినేషన్లు



ప్రజాపక్షం/దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీలో నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముసిగింది. శుక్రవారం భారీ నామినేషన్ దాఖలయ్యాయి. 20 వార్డులకు గాను 235 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపాలిటీ కమిషన్ రమేష్‌కుమార్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియను జిల్లా సీపీ రష్మీ పెరుమాళ్ సందర్శించి ఎన్నికల అధికారులతో కలిసి బందో బస్తుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

## హుస్నాబాద్‌లో మూడవ రోజు అత్యధికంగా 119 నామినేషన్లు



ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్ మున్సిపల్ రెండవ విడత మున్సిపల్ ఎలక్షన్ సందర్బంగా మూడ రోజు వివిధ పార్టీల నుండి పోటాపోటిగా అత్యధికంగా 119 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి రోజు 4 నామినేషన్లు, రెండ వ రోజు 26 మంది నామినేషన్లు దాఖల చేయగా మూడవ రోజు 119 మంది మొత్తం 20 వార్డులకు గాను 149 మంది అశవాహులు నామినేషన్లు వేశారు. కాంగ్రేస్ పార్టీ , బిజెపి , బిఅర్ ఎస్ బిఎస్ పి , సిపిఐ , జనసేన, పార్టీల నుండి, కాక స్వతంత్రులు అత్యధికంగా నామినేషన్లు దాఖల చేశారు. ముఖ్యంగా మున్సిపల్ చైర్మెన్ అభ్యర్తులుగా కేడం లింగ మూర్తి కాంగ్రేస్ పార్టీ నుండి బిఅర్ ఎస్ పార్టీ నుండి కోంకట నళిని పోటిలో ఉన్నారు.

## వనదేవతలను దర్శించుకున్న అధికారులు



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీసమ్మక్క, సారలమ్మలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్‌ఐ నూతి శ్రీధర్‌లు శుక్రవారం దర్శనం చేసుకున్నారు. గద్దెల వద్ద అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. జాతర ప్రారంభమైన రోజు నుంచి పోలీస్‌శాఖ ఆద్వర్యంలో చేపడ్తున్న బందొబస్తు ఏర్పాట్లపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అమ్మవార్ల వన ప్రవేశం పూర్తి అయ్యేంత వరకు భక్తులకు తగిన రక్షణ కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ సభ్యులు పోలీసు అధికారులను శాలువాలతో సత్కరించారు.

## మున్సిపల్ ప్రిసైడింగ్, అసిస్టెంట్ అధికారులకు ర్యాండమైజేషన్ శిక్షణ: కలెక్టర్




ప్రజాపక్షం/సిద్దిపేట: సాధరణ మున్సిపల్ ఎన్నికల 2026 ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లేక్స్ మిని కాన్ఫరెన్స్ హాల్‌లో గజ్వేల్, చేర్యాల, దుబ్బాక. హుస్నాబాద్ మున్సిపాల్టీలకు సంబంధించిన ప్రిసిడింగ్ అధికారులు, ఆసిస్టేంట్ ప్రిసిడింగ్ అధికారులు మొదటి విడుత ర్యాండ మైజేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడతూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడుత ర్యాండమైజేషన్ ద్వారా ప్రిసిడింగ్ , అసిస్టేంట్ అధికారుల కేటాయింపులు చేపట్టినట్లు తెలిపారు. కేటాయింపుల పొందిన అధికారులకు ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు మాస్టర్ ట్రైనర్ల నిర్ణయించిన తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఈడిఎం ఆనంద్, కలెక్టరేట్ ఎఓ రాజ్‌కుమార్‌తో పాటు ఇతర సంబధిత అధికారులు పాల్గొన్నారు.

**శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హరిత మినర్వ హోటల్‌లో జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషనర్ కార్యదర్శి శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ హైమావతి మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందచేశారు.ఈసందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల ప్రస్తుత పరిస్థితి, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అబ్దుల్ హమీద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పురపాలకలో కాంగ్రెస్‌దే గెలుపు కావాలి



మంత్రి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/ధర్మపురి:మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రేస్ అభ్యర్థులను గెలిపించి పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.ధర్మపురి పట్టణంలో శుక్రవారం మంత్రి అడ్లూరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ధర్మపురిలో గడిచిన రెండేళ్ళలో అనేజ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, మరింత అభివృద్ధి చెందాలంటే మున్సిపాలిటీపై కాంగ్రేస్ జెండా ఎగరాలని మంత్రి పేర్కొన్నారు. మొత్తం 15 వార్డుల్లో కాంగ్రేస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. పట్టణానికి చెందిన ఒడ్డెర యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఒల్లెపు శంకర్ రాజు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు.

**అగ్నిప్రమాద భాదితులకు మంత్రి పరామర్శ:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని స్టార్ బిర్యానీ సెంటర్లో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి పెద్దమొత్తంలో ఆస్తినష్టం జరగగా శుక్రవారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భాదితులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి బిర్యానీ సెంటర్‌ను పరిశీలించి ప్రమాద, ఆస్తినష్టం వివరాలను బాధితుడి నుండి అడిగి తెలుసుకున్నారు. రెండు అగ్నిప్రమాదాలలో రూ.30 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు షబ్బీర్ మంత్రికి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వ పక్షాన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ట్రాన్స్కో సీ అండ్ ఎండీకి మంత్రి సూచించారు.

## సమ్మక్కను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/బెజ్జంకి: మండల పరిధిలోని వడ్లూర్ గ్రామంలో వన దేవతలైన సమ్మక్క సారలమ్మల జాతర మహోత్సవాల్లో భగంగా శుక్రవారం టిపీసీసీ ఎస్‌సి సెల్ చైర్మెన్ మానకొండూర్ ఎంఎల్‌ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణ అమ్మవార్లను దర్శించుకోని ఎత్తు బంగారన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది వారిని శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తన్నీరు శరత్ రావు, సర్పంచ్ పులి రమేష్, ఉప సర్పంచ్ అనీల్, వార్డు సభ్యులు, నాయకులు పులి సంతోష్, మిట్టపల్లి చెన్నారెడ్డి, ఐలేని శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉంటూ.. వాహనాల తనిఖీ: ఇన్‌చార్జి కలెక్టర్




ప్రజాపక్షం/వేములవాడ: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్) చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న సంకేపల్లి, జగిత్యాల రోడ్డులో ఉన్న శాత్రాజపల్లి, కోరుట్ల రోడ్డులో కోనాయపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టీ చెక్ పోస్టులను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, తరలించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెక్ పోస్టులో నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు తనిఖీ చేసిన వాహనాల వివరాలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు ఉన్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. వాహనాల తనిఖీ ప్రక్రియ కట్టుదిట్టంగా చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే ప్రతి తనిఖీ వివరాలను స్పష్టంగా రి జిస్టర్లలో నమోదు చేయాలని, వీడియో రికార్డింగ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు చెక్ పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అ మలు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. తనిఖీ లో తహసీల్దార్ జయంత్ కుమార్, రెవెన్యూ, పో లీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డొక్కు స్కూటర్ నుంచి రూ.వందల కోట్లకు అధిపతి

సునీల్ రావుపై నిప్పులు చెరిగిన వెలిచాల



ప్రజాపక్షం/కరీంనగర్: డొక్కు స్కూటర్ పై తిరిగిన సునీల్ రావు వందల కోట్లకు అధిపతి అయ్యారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. మేయర్ గా పనిచేసిన కాలంలో స్మార్ట్ సిటీ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి వందల కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. 42వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పంజాల రాజన్న గౌడ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ లో అపార్ట్మెంట్ కట్టినా ఇల్లు కట్టినా దుకాణం పెట్టినా ఇతర అభివృద్ధి పనులు చేపట్టినా ఆయనకు కప్పం కట్టాల్సిందేనని కట్టకపోతే పనులు ఆపేవారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రజల జేబుల్లో చేతులు పెట్టి ప్రజలను దోచుకుతిని నేడు నీతి వాక్యాలు బోధిస్తున్నారని విమర్శించారు. తనపై వ్యక్తిగతంగా దూషణలకు దిగుతూ బాడీ షేమింగ్ కు పాల్పడ్డారని ఆయనకు ఏమాత్రం రాజకీయ విలువలు లేవని దుయ్యబట్టారు. 42వ డివిజన్ ప్రజలు నీతిగా నిజాయితీగా వ్యవహరించే డాక్టర్ రాజన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ముఖ్యులు ఆయా డివిజన్ లో అధ్యక్షులు నాయకులు వివిధ సంఘాల నాయకులు మహిళా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నామినేషన్లను సజావుగా సాగే విధంగా చూడాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్



ప్రజాపక్షం/రాయికల్: రాయికల్ మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ శుక్రవారం రోజున పరిశీలించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డులకు దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటిని, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వెంట వెంటనే రోజు వారీగా టీ. పోల్ యాప్‌లో అప్ లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఈ పరిశీలనలో రాయికల్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోయల్‌వాడ జాతరకు పోటెత్తిన భక్త జనం



ప్రజాపక్షం/అంతర్గాం: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం గోయల్‌వాడ గోదావరినది తీరాన నిర్వహిస్తున్న శ్రీసమ్మక్క, సారాలమ్మ జాతరకు శుక్రవారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తజనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు జిల్లాల మధ్యన నది ఒడ్డున జరిగే ఈ జాతరకు అమ్మవార్లను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు బారులు కద్దున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వేలాది మంది భక్తులు మంచిర్యాల పట్టణం వైపు నుంచి గోదావరినది దాటి గోయల్‌వాడ జాతరకు చేరుకున్నారు. గోదావరినది ఒడ్డున తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నదిలో కుటుంబసభ్యులతో కలిసి పుణ్యస్నానాలు చేసి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. నది ఒడ్డున శివాలయంలో అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం గద్దెల వద్ద కొలువైన వనదేవతలను దర్శనం చేసుకొని చీర, సారె, గాజులు, బంగారం(బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించారు. కొబ్బరికాయలు కొట్టి భక్తి పారవశ్యంతో మొక్కుతూ మమ్మల్ని సల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ జాతరను సందర్శించారు. అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని మొక్కుగా సమర్పించారు. జాతర ఏర్పాట్లను ఘనంగా నిర్వహించడం, విజయవంతంగా పూర్తి చేయడం పట్ల పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, దేవదాయశాఖల అధికారులను, జాతర కమిటి ఛైర్మన్ గీట్ల శంకర్‌రెడ్డి, ఈ.వో. రాజ్‌కుమార్, మాజీ కమిటి ఛైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి, కమిటి సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. జాతర చివరి రోజు కావడం, శుక్రవారం రాత్రి సమ్మక్క, సారలమ్మలు వన ప్రవేశం చేయనుండటంతో దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించేందుకు భక్తులు అధిక సంఖ్యలో గోయల్‌వాడ జాతర వైపు పయనం అవుతున్నారు.

## కెసిఆర్‌కు ఎన్ని నోటీసులు ఇచ్చినా.. సిఎంని ప్రశ్నించటం మానం

మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట: కెసిఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వటమంటే..సూర్యుని మీద ఉమ్మివేసినట్లేనని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చినోడు.. తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడు కెసిఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మహామ్మయి 126 వారికోత్సవాల్లో భాగంగా శత చండ్రీ యాగంల పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కోటిలింగాల ఆలయంలో జరుగుతున్న శ్రీలలిత తిథి నిత్య మహాయోగ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నకోడూరు మండలం కిష్టాపూర్,నంగునూర్ మండలం అక్కెనపల్లిలో జరిగి సమ్మక్కసారక్క జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ అంటనే నమ్మకం భరోసా అన్నారు. సమ్మక్క,సారాలమ్మ ఆశీస్సులతో ప్రజలందరు బాగుండాలని మళ్లీ మనకు మంచి రోజులు రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సమ్మక్క సారాలమ్మ జాతర అక్కనపల్లిలో జరగటం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి దయతో తెలంగాణ రాష్ట్రం వచ్చి పసిడి పంటలు పండుతున్నాయన్నారు. కెసిఆర్ పాలన స్వర్ణయుగమని.బంగారు పంటలు పండినాయన్నారు. సమ్మక్కసారాలమ్మదయతో మంచి రోజులుకావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డి వచ్చాక అన్ని ఆగమైనాయన్నారు. ఒక్క ఫ్రీ బస్ ఇచ్చి అందులో ఆడోళ్లకు ఉచితంగా ఇచ్చి మొగాళ్ల వద్ద డబుల్ టికెట్ వసూలు చేస్తున్నారన్నారు. బతుకమ్మచీరలు కూడ ఎగ్గొట్టినట్లు తెలిపారు. చెరువులో చేప పిల్లలు వేసుడు బంద్ అయిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో భూములు రేట్లు తగ్గాయన్నారు. రేవంత్‌రెడ్డి సర్కాల్‌లో అన్యాయాలు, అవినీతిని, ప్రజలకు ఇచ్చిన హామీలను అము చేయాలని ప్రశ్నిస్తున్నందుకు నోటీసులు పంపుతున్నారన్నారు. ఎన్ని నోటీసులు పంపించిన రేవంత్‌రెడ్డి నిన్ను ప్రశ్నించటం మానమని, ఇంకా గట్టిగా ప్రశ్నిస్తామని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు.

## ధర్మపురిలో రికార్డు నామినేషన్లు



ప్రజాపక్షం/ధర్మపురి : తెలంగాణ రాష్ట్రంలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 ఎన్నికలకై నామినేషన్ల గడువు శుక్రవారం ముగియగా జగిత్యాల జిల్లా ధర్మపురి పురపాలక సంఘంలో రికార్డు స్థాయిలో అభ్యర్థులు నామినేషన్లను సమర్పించారు.ధర్మపురి మున్సిపాలిటీ లో మొత్తం15 వార్డులకు గాను తొలి రోజు 10 నామినేషన్ సెట్లు దాఖలు కాగా రెండవ రోజు గురువారం 40 నామినేషన్లు వచ్చాయి.చివరిరోజైన శుక్రవారం ఇండిపెండెంట్, వివిధ పార్టీల పక్షాన భారీగా తరలివచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో శుక్రవారం ఏకంగా 63 సెట్లు నమోదుకాగా మొత్తంగా 75 మంది అభ్యర్థులు113 నామినేషన్లు దాఖలు చేసినట్లు పురపాలక కమిషనర్ మామిల్ల శ్రీనివాసరావు తెలిపారు.

## ఆధార్ సెంటర్‌లో అధిక రుసుము తీసుకుంటే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్.లత




ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కలెక్టరేట్ సమావేశలో మందిరంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్.లత జగిత్యాల జిల్లాలోని ఆధార్ సెంటర్ ఆపరేటర్స్ సమావేశం శుక్రవారం రోజున నిర్వహించారు. అదనపు కలెక్టర్ బిఎస్.లత మాట్లాడుతూ యూఐడిఎఐ నిర్దేశించిన రుసుములను మాత్రమే తీసుకోవాలని ఎవరైనా అధిక రుసుము తీసుకున్నచో కఠిన చర్యలు తీసుకోబడునని ఆధార్ ప్రైజ్ చార్ట్స్ & సైన్ బోర్డ్స్ ఉండాలని ఆధార్ నమోదు, సవరణలు చేసే సమయంలో నిర్దేశించిన డాక్యుమెంట్లను మాత్రమే అప్లోడ్ చేయాలని ఆధార్ సెంటర్ ఆపరేటర్స్ కు అదనపు కలెక్టర్ సూచించడం జరిగింది. యూఐడిఎఐ ఆఫీస్ నిర్వహించే ఎన్.సి.ఈ.ఏ.ఆర్ సర్వేలో అందరూ పాల్గొని ఫిబ్రవరి ఐదవ తేదీ వరకు పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత ఆదేశించారు. ఇట్టి సమావేశంలో జగిత్యాల జిల్లా ఈడిఎం మమత, టిజిటిఎస్ డిఎం చేతన్, జిల్లాలోని ఆధార్ సెంటర్ ఆపరేటర్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల పర్యవేక్షణకు మీడియా సెంటర్

జిల్లా కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని రూమ్ నంబర్ 13లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసిఎంసి)ను రాజ్యస మండలాధికారి లోకేశ్వర్ రావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంసిఎంసి ద్వారా చెల్లింపు వార్తలు, ప్రచార ప్రకటనల వ్యయాన్ని పర్యవేక్షిస్తామని చెప్పారు. సోషల్ మీడియా పోస్టులపై నిఘా ఉంచాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో మీడియా సహకారం అందించాలని కోరారు. జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

ఎంపిడిఒ సురేష్



**ప్రజాపక్షం / కేరమేరి :** నూతనంగా ఎన్నికైన సర్పంచులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఎంపిడిఒ సురేష్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన పాలకవర్గ సభ్యులకు నిర్వహించిన పరిచయ, సన్మాన కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే నిధులను గ్రామాభివృద్ధికి సద్వినియోగం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని, తాగునీరు, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## సిఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం




**ప్రజాపక్షం/నిజాంపేట్;** నిజాంపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో శుక్రవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీవో రాజిరెడ్డి,తాహసిల్దార్ శ్రీనివాస్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలోని యువకుల క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు.ఈ మండల స్థాయి క్రీడలు కోకో, వాలీబాల్, కబడ్డీ, పోటీలలో గెలుపొందిన విజేతులను జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందని తెలిపారు. యువకులు చెడు దారిన పడకుండా ఆటల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తుందని ఈ చక్కటి అవకాశాన్ని యువత సద్వినియం చేసుకోవాలని కోరారు. ఎంఈఓ యాదగిరి, ఇన్చార్జ్ ఎంపీవో నరసింహారెడ్డి, మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొమ్మన మల్లేశం, మండల అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కోమ్మట బాబు,సర్పంచ్ లు చలిమేటి నరేందర్, బాబు నాయక్, ఉప సర్పంచ్ గేరిగంటి బాబు, వార్డు సభ్యులు లక్ష్మణ్, టంకరి ప్రశాంత్, మ్యాదరి నర్సింలు, కృష్ణ, కార్యదర్శులు నర్సింలు, హరిఫ్ హుస్సేన్, కవిత, రాము, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి చేరికలు




**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలోని నందిగల్లికి చెందిన యువకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి శుక్రవారం చేరారు. ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీలో చేరిన వారికి ముత్యాల సునీల్‌కుమార్ కండువాలు కప్పి హృదయపూర్వకంగా ఆహ్వానించారు. చేరిన వారిలో హరీష్, రాజు, వినీత్, గణేష్, వినయ్, అజయ్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలపరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ ఎ న్నికల సాధారణ పరిశీలకులు సిహెచ్‌సత్యనారాయణరెడ్డి నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 13, 14, 15 డివిజన్ల నామినేషన్ల స్వీకరణ కేంద్రంతో పాటు ఆర్సపల్లి వాటర్ ట్యాంకు జోన్ ఆఫీస్, బోధన్, ఆర్మూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో అందుబాటులోని సదుపాయాలు హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల సన్నద్ధతపై అధికారులతో చర్చించి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల మెటీరియల్‌పై అడిగి తెలుసుకున్నారు. టీ పోల్ యాప్‌లో ఎన్నికల రిపోర్టులు అప్‌లోడ్ చేస్తున్న వైనాన్ని పరిశీలించారు. అబ్జర్వర్ వెంట బోధన్, ఆర్మూర్ సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమీషనర్లు ఉన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత

నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు, హాస్టళ్ల ప్రాంతీయ సమన్వయకర్తలు (ఆర్‌సీఓ)లు నిర్వాహకులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనలను ఉటంకిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ తరహా ఉదంతాలు చోటు చేసుకోకుండా పిల్లల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి బాలికల వసతిగృహాలు, గురుకులాల నిర్వహణ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికల హాస్టళ్లలో ఇతరులు ఎవరూ ప్రవేశించకుండా కట్టడి చేయాలని, తల్లిదండ్రులు వస్తేనే వారి వెంట ఇంటికి పంపాలని సూచించారు. సీసీ కెమెరాలు తప్పనిసరిగా పని చేయాలన్నారు. వసతిగృహాల ప్రాంగణలు, పరిసరాలలో ఎక్కడైనా గుంతలు వంటివి ఉంటే తక్షణమే పూడ్చివేయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, శుభ్రమైన నీటి సరఫరా, ఆహార పరిశుభ్రత, పౌష్టికాహారమందించటానికి కావల్సిన ఏర్పాట్లను అను నిత్యం పర్యవేక్షించాలన్నారు. గురుకులాల, సంక్షేమ హాస్టళ్లలోని పరిసర ప్రాంతాలలో పిచ్చిమొక్కలు, గడ్డి వంటివి పెరగకుండా చూడాలని, పాముకాటు వంటి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం శుభ్రమైన ఆహార పదార్థాలను అందించటానికి వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించడానికి కలుషిత ఆహారం ద్వారా వ్యాధులు సోకకుండా ఫుడ్ పాయిజన్ సమస్యను నివారించడానికి సానిటేషన్ సిబ్బందికి, వంటగదిలో పని చేస సిబ్బందికి తగిన సూచనలు చేయాలన్నారు. వంట పాత్రలు శుభ్రంగా కడిగేలా పర్యవేక్షణ జరపాలని, నిల్వ ఉంచిన నాన్‌వెజ్‌ను అందించకూడదని ఆదేశించారు. విద్యార్థులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ తమ స్వంత బిడ్డలుగా వారి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈఓ అశోక్, ఆర్‌సీఓలు, హాస్టళ్ల నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు..

## నామినేషన్ల స్వీకరణలో సమయపాలన పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్ :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి అన్వేష్, ఎఒ పిన్న రాజేశ్వర్ లతో కలిసి ఆయన పరిశీలించారు. సాయంత్రం 5 గంటలకు కేంద్రం గేటు మూసివేయాలని, అప్పటికే లోపల ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. ఈ నెల 31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08736250501) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

## నిర్మల్ రైల్వే లైన్‌కు.. నిధులు కేటాయించాలి

2026 బడ్జెట్‌పై రైల్వే సాధన కమిటీ ఆశలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే లైన్ నిర్మాణానికి 2026 కేంద్ర బడ్జెట్‌లోనైనా నిధులు విడుదల చేయాలని రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ ఎంసీ లింగన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదిలాబాద్ నుండి నిర్మల్,ఆర్మూర్ మీదుగా హైదరాబాద్ వరకు రైల్లే లైన్ నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు.గతంలో ఈ డిమాండ్‌పై విద్యార్థులు,మేధావులు,పుర ప్రముఖులు పెద్ద ఎత్తున ర్యా లీలు, అవగాహన సదస్సులు నిర్వహించినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.2024లో సాధన కమిటీ ప్రతినిధులు వారం రోజుల పాటు ఢిల్లీలో ఉండి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు బండి సంజయ్,ధర్మపురి అరవింద్,సోయం బాబూరావు,రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణ య్య,బడుగుల లింగయ్య యాదవ్ లను కలిసి విన్నవించినప్పటికీ.2025 బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది.ఈ నేపథ్యంలో,ప్రస్తుతం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ రాజ్యసభ సభ్యులు నిరంజన్ రెడ్డి పార్లమెంటులో ఈ అంశాన్ని బలంగా వినిపించారని,స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించినందున ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు వస్తాయని ప్రజలు ఆశాభావంతో ఉన్నారని తెలిపారు.నిర్మల్ మీదుగా రైల్వే లైన్ ఏ ర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని,కావున ఈ బడ్జెట్‌ను చివరి అవకాశంగా భావించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న ముదిరాజ్,సెక్రటరీ గొజ్జ జనార్థన్,జాయింట్ సెక్రటరీలు రాఘవులు,చాంద్ పాషా, మూర్తి ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొని తమ గళాన్ని వినిపించారు.

## కాంగ్రెస్‌కు అండగా నిలిస్తేనే గజ్వేల్ అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యపడనుండగా, ప్రజల సొమ్మును అప్పనంగా మేస్తున్న ఇక్కడి ఎమ్మెల్యే కెసిఆర్ ను నిలదీయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీఫాంలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జీతభత్యాల కోసమే కెసిఆర్ ఎమ్మెల్యే పదవిని పట్టుకొని వేలాడుతుండగా, ప్రచారానికి వచ్చే ఆ పార్టీ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అండగా నిలిచి ఆశీర్వదించాలని, తద్వారా అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. అందుకు భిన్నంగా కెసిఆర్ కు ఓటు వేస్తే సిద్దిపేట అభివృద్ధి జరుగుతుందని, ఇక్కడి సమస్యలను పదేళ్లుగా కెసిఆర్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగినన్ని నిధులు కేటాయిస్తుండగా, ముంపు బాధితుల సమస్యల పరిష్కా రం కాంగ్రెస్ తోనే సాధ్యపడుతుందని అన్నారు. మున్సిపల్ పరిధిలో రోడ్లు అధ్వాన్నంగా మారగా, అడిగిన వెంటనే రేవంత్ రెడ్డి నిధులు మంజూరీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కా ర్డులు మంజూరి చేస్తుండగా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా తదితర మంచి పనులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దీవించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గజ్వేల్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తుండగా, పేదల అభ్యున్నతికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని వివరించారు.

## నేటి నుండి గంగాపూర్ జాతర షురూ.





**ప్రజాపక్షం / రెబ్బెన :** రెబ్బెన మండలం గంగాపూరి వాగు ఒడ్డున వెలసిన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతర శనివారం నుండి మూడు రోజుల పాటు వైభవంగా జరగనుంది. భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా వెలసిన ఈ క్షేత్రంలో ఫిబ్రవరి 1న మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. శనివారం రోజున స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరగనుండగా, భక్తులు ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించి అన్నదానం చేయనున్నారు. ఆదివారం రథసప్తమి రోజున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ముడుపులు చెల్లించి స్వామివారిని దర్శించుకోనున్నారు.కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలు, మహారాష్ట్ర నుండి భక్తులు తరలిరానున్నారు. జాతరలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా ఎస్పి నికితా పంత్ ఆధ్వర్యంలో సిఐ సంజయ్ కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి, ఆసిఫాబాద్ డిపోల నుండి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతుండగా, అత్యవసర సేవల కోసం మెడికల్ క్యాంపును అందుబాటులో ఉంచారు.

## ఎన్నికల ప్రచార ఖర్చులపై పకడ్బందీ నియంత్రణ

అనుమానాస్పద లావాదేవీలపై గట్టి నిఘా

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్




**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** జిల్లాలో జరుగుతున్న మున్సిఫల్ ఎన్నికలు స్వేచ్ఛా యుతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రచార ఖర్చులకు పకడ్బంగీగా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ సంబంధిత అదికారులను ఆదేశించారు. ఎన్నికలు పూర్తి య్యేవరకు ఎఫ్ఎస్‌టీ ,ఎస్ఎస్‌టీ ,ఏఈఓల బృందాలు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏం సిసి ,ఎంసిఎంసి నోడల్ అదికారులు,ఎఫ్ ఎస్‌టీ, ఎస్ఎస్ టీ బృందాలు ఏఈఓలు తదితరులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వ్యయ నియంత్రణలో అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు . ఎన్నికల ప్రచార ఖర్చులు ప్రతి అభ్యర్థి ఖాతాలో ఖచ్చితంగా నమోదు చేయాలని ఎన్నికల ను ప్రబావితం చేసే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా డబ్బు,మద్యం విలువైన వస్తువులు తదితరాలను అక్రమంగా పంపిణి చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమానాస్పద లావాదేవీలు, బల్క్ గా సరఫరా అవుతున్న వస్తువులు నగదు, కదిలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వ్యయ నియంత్రంలో భాగంగా ఎస్ఎస్‌టీ ,ఎఫ్ ఎస్‌టీ బృందాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గట్టి నిఘా కొనసాగించాలన్నారు. ఎన్నికల పిర్యాదులు అందిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్టను పకడ్బందీగా అమలు చేయాలని ఏ చిన్న ఉల్లంఘనకైనా, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా అధికారులు సమిష్టిగా పనిచేసినప్పుడే ఎన్నికల ప్రక్రియ పారదృకంగా సాగుతుందని తెలిపారు.జడ్పీ సీఈఓ జానకీ రెడ్డి, ఎక్సైజ శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ డీసిఓ కిరణ్ కుమార్; ఎంసిసి నోడల్ అధికారి జగదీష్, ఎంసిఎంసి నోడల్ అధికారి విజయలక్ష్మి ఎల్‌డిఎం నర్సింగ్‌రావు, అసిస్టెంట్ ఎక్స్పెండీచర్ అబ్జర్వర్లు ఎస్ఎస్‌టీ బృందాలు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి

కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్ గుప్తా

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు ప్రజలు తనకు కౌన్సిలర్ గా అవకాశం ఇస్తే వార్డులోని సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్ గుప్తా అన్నారు. గురువారం నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో 9వ వార్డు కాంగ్రెస్ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా పైడి సిరిధర్ గుప్తా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో 9వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలుపొందిన వారు వార్డులోని సమస్యలను పట్టించుకోకుండా వదిలివేశారని అన్నారు. దీంతో 9వ వార్డు ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా బస్టాండు కుంటను పూడ్చి వేయడం వల్ల విగ్నేశ్వర కాలనీవాసులు వర్షం పడినప్పుడల్లా మురికి నీరంతా ఇళ్లలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు .ప్రస్తుతం జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డు ప్రజలు తనను కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డులో ఉన్న సమస్యలు అండర్ డ్రైనేజ్, మురికి కాలువలు సిసి రోడ్లతోపాటు మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానన్నారు. 9వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ గా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి కి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కి గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు నామినేషన్ వేసేందుకు నర్సాపూర్ పట్టణంలోని మెదక్ రోడ్ లో ఉన్న ఓ దాబా నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండి పై ఎక్కి బాజా భజంత్రీల మధ్య భారీ ప్రజల నడుమ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి తో కలిసి పైడి శ్రీధర్ గుప్తా భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు.

## భీమ్‌గల్‌లో పోలీసుల బందోబస్తు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ చివరి రోజు కావటం, నామినేషన్ వేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని భావించిన పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 వరకు నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు ఎలాంటి వాహనాలు అనుమతి లేని వ్యక్తులు రాకుండా ఏర్పాట్లు చేశారు. సుమంగళి చౌరస్తా, ముచ్కూర్ చౌరస్తా వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థితో ఇద్దరికి మాత్రమే అనుమతినిచ్చారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎ లాంటి సంఘటనలు జరగకుండా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో భీమ్‌గల్ ఇన్‌చార్జి, ఆర్మూర్ రూరల్ సిఐ జాన్‌రెడ్డి, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ ఎస్సైలు రాము, అనిల్‌రెడ్డి, తిరుపతి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## హామీల అమలులో కెసిఆర్ విఫలం

కేంద్ర నిధులతో పట్టణాల అభివృద్ధి

మెదక్ ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** కెసిఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుండి ప్రాతినిథ్యం వహిస్తూ రెండుసార్లు ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నప్పటికీ ఆయన గజ్వేల్ ప్రజలకు ఇచ్చిన హామీలలో విఫలం చెందినట్లు మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు విమర్శించారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపల్ లో పట్టణ పార్టీ అధ్యక్షులు మనోహర్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరిట నిధులు దుర్వినియోగం కాగా, నిర్మించిన డబల్ బెడ్ రూం ఇండ్లు పేదలకు పంపిణీ చేయలేక పోయినట్లు ఆరోపించారు. మొదటి సభలో 5వేల ఇండ్లు నిర్మించి ఇస్తానని కెసిఆర్ ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. అంతేకాకుండా గజ్వేల్ ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోగా, ఆయన దర్శన భాగ్యమే కరువైనట్లు ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజలు ఆయనపై ఎంతో ఆశతో గెలిపించగా, నిరాశే మిగిల్చడంతోపాటు ప్రశ్నించిన వారిపై ఆ పార్టీ నేతలు అక్రమ కేసులు బనాయించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పా ర్టీలు కుమ్మకై బిజెపిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగా, ఇక్కడి కార్యకర్తల కృషితో 20 వార్డుల్లో సత్తా చాటుతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు పెద్ద ఎత్తున కేటాయిస్తుండగా, ఇక్కడి సమస్యల పరిష్కారంలో తన వంతు భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ శ్రేణులు కష్టపడి పని చేస్తుండగా, మున్సిపల్ లో బిజెపి జండా ఎగరవేస్తామని వివరించారు. బిజెపి పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గాడిపల్లి కళ్యాణి, బిజెపి అభ్యర్థులు ఉప్పల మధుసూదన్ గుప్త, పల్వనూరి కల్పన రవీందర్ రెడ్డి, రేణుక నాగు ముదిరాజ్, సందీప్ కుమార్, రొట్టెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు సత్యనారాయణ కన్నుమూత

**ప్రజాపక్షం / రెబ్బెన :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సీనియర్ నాయకులు రాయల సత్యనారాయణ ఆకస్మిక మృతి చెందారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్షిప్ రమణారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న ఆయన మరణ వార్త తెలియగానే పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతికి లోనయ్యాయి. శుక్రవారం పార్టీ బాధ్యులు శేషు పంతులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణ మరణం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి రాయల నరసయ్య, పెద్దింటి మహేష్, ప్రభాకర్, బాబురావు, సంతోష్ పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
31-01-2026
www.prajapaksham.in

“హనుమాన్ సినిమా హీరో తేజ సజ్జ మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. ‘మన శంకర వర ప్రసాద్ గారు’ సినిమా సంక్రాంతికి విడుదలై బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన నేపథ్యంలో ఘనంగా సన్మానించారు. చిరంజీవి ఇంద్ర సినిమాలో తేజ సజ్జ బాల నటుడిగా నటించారు.”

# రీల్

## 'నీమాయలో' అంటున్న నరేష్ అగస్త్య



నరేష్ అగస్త్య హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ 'అసురగణ రుద్ర'. సంగీర్తన విపిన్, ఆర్యన్ రాజేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మురళి కాట్రగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కమ్మల ప్రొడక్షన్స్ పతాకంపై మురళి కమ్మల, వంకీ నిర్మిస్తున్నారు.తాజాగా 'నీ మాయలో పడేట్టుగా' అనే సాంగ్‌ను రిలీజ్ చేశారు. శేఖర్ చంద్ర ఈ పాటను హృదయాన్ని తాకే బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా, చైతన్య అందించిన సాహిత్యం పాటకు మరింత ప్రాణం పోశాయి. రమ్య బెహారా, సిద్ధార్థ్ మీనన్ గాత్రం మెలోడీని మరో స్థాయికి తీసుకెళ్లాయి.కొత్తగా పెళ్లయిన జంట ప్రేమను సెలబ్రేట్ చేసే ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మొత్తం మీద ఈ పాట మ్యూజిక్ లవర్స్ మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది.ఈ చిత్రానికి అమర్నాథ్ బొమ్మిరెడ్డి డీవోపీ, శ్రీకాంత్ పట్నాయక్ ఆర్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ రఘు కులకర్ణి. ఇతర పాత్రల్లో మురళీ శర్మ, శత్రు, రవివర్మ, శుభలేఖ సుధాకర్, ప్రియాంక శర్మ, ఆర్యన్ రాజేష్, అమిత్ శర్మ, దేవి ప్రసాద్, ఆమని, నిఖిల్ దేవదాలు, బేబీ శ్రీదేవి నటిస్తున్నారు.ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సుధాకర రెడ్డి వివ్వల, అప్పి రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర,సినిమాటోగ్రఫీ అమర్నాథ్ బొమ్మిరెడ్డి,ఎడిటింగ్ శ్రీకాంత్ పట్నాయక్ ఆర్, కొరియోగ్రాఫీ : పొలాకి విజయ్, వెంకట్ దీప్, స్టంట్స్: నబా మాస్టర్, నందు మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శ్రీహరి గౌడ్.

## శ్రీనివాస మంగాపురంలో 'మంగం' ఫస్ట్ లుక్ రిలీజ్



ఆర్ ఎక్స్ 100, 'మంగళవారం' చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్ట్ 'శ్రీనివాస మంగాపురం' కు దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, జయ కృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె, 'ఆయ్ అమ్మ' పాటతో గుర్తింపు పొందిన రాషా థడానీ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. నిర్మాత అశ్విని దత్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, 'చందమామ కథలు' బ్యానర్ పై నిర్మాత పి కిరణ్ దీనిని నిర్మిస్తున్నారు. టైటిల్ రివీల్, ఆకట్టుకున్న ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా శుక్రవారం ఈ చిత్రం నుంచి రాషా థడానీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు, ఇందులో ఆమెను 'మంగ' పాత్రలో పరిచయం చేశారు. సాంప్రదాయ దుస్తులలో రాషా హుందాతనం, అందమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. మోషన్ పోస్టర్‌లో ఆమె ఆకట్టుకునే లుక్స్ ఇప్పటికే ప్రేక్షకుల, సినీ వర్గాలని అలరించాయి. ఈ చిత్రం ఇటీవలే 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రెండవ షెడ్యూల్ జరుగుతోంది. ఉన్నత నిర్మాణ విలువలు, క్రియేటివ్ విజన్ తో టీం వేగంగా ముందుకు సాగుతోంది.మహేష్ బాబుతో సహా తెలుగు చిత్రసీమలో అనేక పెద్ద స్టార్స్ ని పరిచయం చేసి, కృష్ణతో కూడా ఒక సినిమా నిర్మించిన అశ్విని దత్, ఇప్పుడు మరో కొత్త జయ కృష్ణ ఘట్టమనేనిని పరిచయం చేయడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం. ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, జయకృష్ణ ఐఎస్సి డీవోపీగా పని చేస్తున్నారు. మాధవ్ కుమార్ గుల్లపల్లి ఎడిటర్, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. రియల్ సతీష్ యాక్షన్ కోరియోగ్రఫీ చేస్తున్నారు.

## ఫిబ్రవరి 6న 'సుమతీ శతకం' విడుదల



విజన్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి సుధాకర్ కొమ్మలపాటి నిర్మాతగా ఎంఎం నాయుడు రచన దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సుమతీ శతకం. అమర్ దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో తేజ, మహేష్ విట్ట, జెడివి ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, నెల్లూరు నీరజ, మలక్‌పేట్ శైలజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఫిబ్రవరి 6వ తేదీన మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ మా హీరో అమర్ దీప్ మన పక్కింటి అబ్బాయిలా కనిపిస్తూనే అద్భుతమైన నటన కనబరిచారు. షూటింగ్ సమయంలో చేతికి తీవ్రమైన గాయమైనా, సర్జరీ జరిగే పరిస్థితి వచ్చినా, సినిమా కోసంఆ బాధను భరించి షూటింగ్ పూర్తి చేశారు. ఫిబ్రవరి 6న విడుదలవుతున్న ఈ చిత్రం మీ అంచనాలకు ఏమాత్రం తగ్గ కుండా ఉంటుంది, అందరూ తప్పకుండా థియేటర్లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత సుధాకర్ మాట్లాడుతూ 'శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీలో మా 'సుమతి శతకం' ట్రైలర్ లాంచ్ జరగడం, ఇక్కడ విద్యార్థుల నుండి వచ్చిన స్పందన చూడటం చాలా ఆనందంగా ఉంది. మేము మా ప్రమోషన్ కార్యక్రమాలను రాయలసీమ నుంచే ప్రారంభించాం. కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల్లో ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉంది. ఫిబ్రవరి 6న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్ గా విడుదల చేస్తున్నాము అని అన్నారు. హీరోయిన్ శైలి మాట్లాడుతూ మీ అందరినీ ఇలా చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మీ ఎనర్జీ చూస్తుంటేనే చాలా ఉత్సాహంగా అనిపిస్తోంది. ఇప్పుడే మీరు మా సినిమా ట్రైలర్ చూశారు. మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను అని అన్నారు. హీరో అమర్‌దీప్ మాట్లాడుతూ 'అందరికీ నమస్కారం.నా కెరీర్ 'రామ' అనే పేరుతోనే మొదలైంది అన్నారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రానున్న వారణాసి




మహేష్ బాబు హీరోగా, ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వారణాసి సినిమా విడుదల తేదీ ఖరారు చేశారు. ఏళ్ళ తరబడి సినిమాలు తీస్తున్నారు అనే ఆరోపణలకు రాజమౌళి చెక్ పెడుతూ వారణాసి విడుదల తేదీని ప్రకటిస్తూ శుక్రవారం ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మహేష్ బాబు రాముడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే టీజర్ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా జరిపిన రాజమౌళి శరవేగంగా షూటింగ్ చేస్తున్నారు. రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ సెట్ లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. శ్రీ దుర్గ ఆర్ట్స్ బ్యానర్ పై కె ఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్ ఆర్ ఆర్ సినిమా ఆస్కార్ అవార్డు తరువాత రాజమౌళి చేస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీగా అంచనాలు పెరిగాయి. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ ఒక పక్క జరుగుతుంటే మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయని నిర్మాత కె ఎల్ నారాయణ చెప్పారు. ఈ సినిమా మహేష్ బాబు అభిమానులకు ఓ పండుగలా ఉంటానని ఆయన పేర్కొన్నారు. పృథ్వి సుకుమారన్ , ప్రకాష్ రాజ్ మరో కీలకపాత్రను పోషిస్తున్న ఈ చిత్రానికి మూల కథ విజయేంద్ర ప్రసాద్, సినిమాటోగ్రఫీ పీ ఎస్ వినోద్ పని చేస్తున్నారు.

## ఒక కొత్త అనుభూతిని ఇచ్చే సినిమా



తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు.ఈ సినిమా జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సృజన్ మీడియాతో చిట్ చాట్ చేశారు. నాకు యూఎస్ లో ఫస్ట్ డే మార్నింగ్ షో సినిమా చూడటం అలవాటు. దాదాపు అన్ని భాషల సినిమాలు చూస్తుంటాను. ఈ సినిమా చూసిన మరుక్షణమే ఇది తెలుగులో బాగా వర్క్ అవుట్ అవుతుందనిపించింది. అప్పటికే నేను మలయాళం లో ఒక సినిమా చేస్తున్నాను. ఆ సినిమా హీరో ద్వారా బాసిల్ జోసెఫ్ నెంబర్ తీసుకుని నిర్మాతలతో మాట్లాడాను. వెంటనే రీమేక్ రైట్స్ తీసుకున్నాను.చిన్నప్పుడు నుంచి ఊర్లో కనిపించిన పాత్రలు అనిపించాయి. అమ్మాయిలపై చేయి చేసుకోవడం చూస్తుంటాం. కానీ వాళ్లు రివర్స్ అయితే పరిస్థితి ఏమిటి అనే పాయింట్ నాకు చాలా నచ్చింది. ఆ సినిమా చూస్తున్నప్పుడు తెలుగు సెన్సిబిలిటీస్ కి ఎలా మార్చుకోవచ్చు అన్నది ఆలోచించుకున్నాను. ఓటీటీ లో తెలుగు డబ్బింగ్ వున్నప్పటికీ ఈ సినిమాని ఇంకా చాలామంది ఆడియన్స్ చూడలేదు. అయితే చూసినవాళ్లు కూడా ఒక కొత్త అనుభూతి ఇవ్వాలి. దాన్ని ఎలా చేయాలనే ప్రయత్నంతో ఈ సినిమా చేశాం. అది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థమవుతుంది. కథవరకూ మాతృక ఉండవు కానీ తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చాలా మార్పులు చేశాం.ఒరిజినల్ సినిమా హీరోయిన్ దర్శనకు ఈ పాత్ర ఏమిటో వుంటుంది. షూటింగ్ అంతా గోదావరి ప్రాంతంలో చేశాం. దర్శకుడు కి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాము. షూటింగ్ ఎలా చేయబోతుందని ఎలా చేయబోతున్నాం అని ముందే పూర్తిగా పేపర్ మీద ఉంటుంది. నేను యూఎస్ లో ఉంటాను కాబట్టి షూటింగ్ కి వెళ్లడం కుదరలేదు.జై క్రిష్ మ్యూజిక్ గురించి చాలా ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. ఈ సినిమా తర్వాత తనకు చాలా మంచి అవకాశాలు వస్తాయి.మలయాళం లో కంటే సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మొదటినుంచి నేను కంటెంట్ సినిమాలు చేస్తూ వచ్చాను. ఇప్పుడు కంటెంట్ కమర్షియల్ సినిమాలపై దృష్టి పెట్టాను. 35 చిన్న కథ కాదు కమర్షియల్ సినిమానే. ఈ సినిమా కూడా అందరికీ రిలేట్ అయ్యే కమర్షియల్ ఎంటర్టైనర్. నెక్స్ట్ చేయబోయే సినిమాలు కూడా కాన్సెప్ట్ పరంగా చాలా కమర్షియల్ గా ఉంటాయి. ప్రస్తుతం గతం2, ఈ నగరానికి ఏమైంది రీటేక్, అలాగే ప్రియదర్శితో ఒక సినిమా నడుస్తున్నాయి.



## రొమాంటిక్ పొలిటికల్ డ్రామా భగవంతుడు

హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా ‘భగవంతుడు‘. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ వన్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ‘భగవంతుడు‘ సినిమా ఈ సమ్మర్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో చిత్ర టీజర్ ను హీరోలు విశ్వక్ సేన్, సందీప్ కిషన్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ రవి పనస నాకు మంచి మిత్రుడు. ఆయన నా విరాటపర్వం మూవీకి రైటర్ గా వర్క్ చేశారు. మీడియాలో పనిచేస్తున్న గోపిని ధైర్యంగా ఇండస్ట్రీకి రమ్మని నేనే ప్రోత్సహించాను. ఆయన దగ్గర ఉన్న రెండు మూడు కథలు విన్నాను అని అన్నారు.డైరెక్టర్ జి.జి. విహారి,హీరోయిన్ ఫారియా అబ్దుల్లా ,ప్రొ డ్యూసర్ రవి పనస, హీరో తిరువీర్హీరో విశ్వక్ సేన్ మాట్లాడారు.

---

### డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పర్యవేక్షణ..

# ఇక ‘గృహ నిర్మాణ సంస్థ’ చేతికి

**కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం**
**అన్ని ప్రాజెక్టులు ఇకపై గృహ నిర్మాణ సంస్థ పరిధిలోకి బదిలీ**
**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ గౌరవ గృహాల పథకంలో ప్రభుత్వం కీలకమైన పాలనాపరమైన మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ప్రాజెక్టులన్నింటిని ఇకపై తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ (టిజిహెచ్‌సిఎల్) పరిధిలోకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సమన్వయ లోపానికి చెక్–అంతా ఒకే గొడుగు కిందకు**

ఇప్పటివరకు ఈ ఇళ్ల నిర్మాణ బాధ్యతలు పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి, రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి), ప్రజారోగ్య శాఖ వంటి విభిన్న విభాగాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. దీనివల్ల శాఖల మధ్య సమన్వయ లోపం, నిధుల విడుదలలో జాప్యం, పనుల పురోగతిపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం ఈ ‘సింగిల్ విండో’ విధానాన్ని తీసుకొచ్చింది. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ దశలో ఉన్న అన్ని ప్రాజెక్టులను తక్షణమే టిజిహెచ్‌సిఎల్‌కు అప్పగించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలు తమ వద్ద ఉన్న ప్రాజెక్టు రికార్డులు, నిధులు, నిర్వహణ బాధ్యతలను గృహ నిర్మాణ సంస్థకు బదిలీ చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే టిజిహెచ్‌సిఎల్ ఇకపై అన్ని జిల్లాల్లోని పనులను నేరుగా పర్యవేక్షిస్తుంది. దీనివల్ల కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడమే కాకుండా, నిర్మాణ నాణ్యతలో జవాబుదారీతనం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నారు.

**లబ్ధిదారులకు ఊరట :** రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5.72 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకోగా, వేల సంఖ్యలో ఇళ్లు 90 శాతం పూర్తి చేసుకుని, కేవలం విద్యుత్, నీరు వంటి చిన్న చిన్న వసతులు లేక లబ్ధిదారులకు అందకుండా పోయాయి. తాజా నిర్ణయంతో మౌలిక వసతుల పనుల్లో వేగం పెరిగి, ఇళ్లు త్వరగా లబ్ధిదారులకు అందుతాయి. కొత్తగా ప్రవేశపెట్టిన ‘ఇందిరమ్మ ఇళ్లు’ పాత డబుల్ బెడ్‌రూమ్ పథకాలు రెండూ ఒకే సంస్థ పరిధిలోకి రావడంతో నిధుల పంపిణీలో స్పష్టత ఉంటుంది. లబ్ధిదారుల డేటా, కేటాయింపు ప్రక్రియ అంతా ఒకే చోట ఉండటం వల్ల గందరగోళానికి తావుండదు. పెండింగ్ బిల్లుల కారణంగా నిలిచిపోయిన పనులను పరుగులు పెట్టించి, అర్హులైన పేదలకు త్వరగా సొంతింటిని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కీలక అడుగు వేసింది.

## పిటి ఉష భర్త మరణం దిగ్భ్రాంతి కలిగించింది: మంత్రి వాకటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు,రాజ్యసభ సభ్యురాలు పి.టిఉష భర్త శ్రీనివాసన్ ఆకస్మిక మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని క్రీడల శాఖమంత్రి వాకటి శ్రీహరి పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆమెకు, కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# భక్తజన గుడారం... మేడారం

**ప్రజాపక్షం/మేడారం :** సమ్మక్క సారలమ్మలను కొలిచేందుకు తరలిస్తున్న ప్రజలతో మేడారం భక్తజన గుడారంగా మారింది. లక్షలాదిగా తరలిస్తున్న భక్తుల భక్తిపారవశ్యంతో తడిసి ముద్దవుతోంది. ఎలాంటి గుడి, గోపురం లేని చిన్న అడవిపల్లె నేడు మహా ఆధ్యాత్మిక శిఖరమై మెరిసిపోతున్నది. నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరలో గురువారం మహా ఘట్టం ఆవిష్కృతమై జనం కోసం పుట్టిన వనదేవత సమ్మక్క భక్తుల జయజయధ్వానాల నడుమ గద్దెపై కొలువుదీరింది. దీంతో సమ్మక్క రాకతో భక్తులు శుక్రవారం వరదలా పోటెత్తుతున్నారు. మేడారానికి ఇప్పటికే సుమారు 90లక్షల మంది వరకు వచ్చారని అంచనా వేస్తున్నారు. శుక్రవారం మొక్కుబడుల రోజు వీరి సంఖ్య భారీగా పెరిగింది. ఈ సారి కోటికి పైగా భక్తులు రావచ్చునని అంచనా వేస్తున్నారు. ముందు జాగ్రత్తగా జాతరకు కొన్ని రోజుల ముందే 50లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. అయినా భక్తుల తాకిడి అంతకంతకు పెరుగుతోంది. తల్లుల గద్దెల వద్ద ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. క్యూ లైన్లలో భక్తులు బారులు తీరి నిల్చొని ఉండడం కనిపిస్తోంది. గతంలో వనదేవతలను దర్శించుకోవడానికి మూడు, నాలుగు గంటల సమయం పట్టగా ఈ సారి భారీ మార్పులు చేపట్టి గద్దెల పునర్నిర్మాణం చేపట్టడం, దారులు వెడెల్పు చేయడంతో దర్శనం గంటలోపే పడుతోంది. కాగా భక్తులు తల్లులను దర్శనం చేసుకొని త్వరత్వరగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నా తాకిడి మాత్రం తగ్గడం లేదు.





**పది రోజుల ముందు నుండే భారీగా జనం**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షలమంది నాలుగు రోజుల నుంచి మేడారానికి బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్లబండ్లలో తరలి వచ్చి మేడారం చుట్టుపక్కల విడిదిచేశారు. దీనితో మేడారానికి ఎటు అయిదు కిలోమీటర్ల వరకు ఎటు చూసిన భక్తు జనసందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనం మయమైంది. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి గద్దెల దర్శనానికి బారులుతీరారు. లక్షలమంది భక్తులతో జంపన్నవాగు కిటకిటలాడుతోంది. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద కొందరు స్నానాలు చేస్తుండగా వాగునీటిలో మూడు మునకలు వేసి మరికొందరు తలారా పుణ్యస్నానమాచరిస్తున్నారు. ఇక్కడే కొలువైన జంపన్న, నాగులమ్మ గద్దెలకు తొట్టెలు, ముడుపులు కట్టి కొబ్బరికాయలు కొడుతున్నారు. వాగులో శివసత్తులు పూనకాలతో ఊగిపోతున్నారు. కడుపు పండాలని, వ్యాధులు నయం కావాలని భక్తులు వరంప ట్టారు. ఆ తర్వాత వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని కోళ్లు, మేకలను బలిస్తున్నారు.

**పెరుగుతున్న విఐపిల తాకిడి**



సామాన్య భక్తజనంతో శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లోని వీఐపీలు వనదేవతలను దర్శించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర డిజిపి శవధర్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, పలువురు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు రాజకీయ, వివిధ రంగాలకు చెందిన విఐపిలు వనదేవతలను దర్శించుకున్నారు. వీరి వెంట పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు ఉన్నారు.

---

## ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

అనితను ఇచ్చిపెళ్లి చేయాలని బతిమిలాడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో అనితకు తన క్లాస్‌మేట్ జబ్బార్ లాల్‌తో చనువు ఏర్పడింది. అతడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్లు రాజేందర్‌కు తెలిసింది. కోపంతో జబ్బార్‌కు రాజేందర్ ఫోన్ చేసి అనిత గురించి తప్పుగా చెప్పాడు. అప్పటి నుంచి జబ్బార్ కూడా అనితను వేధించడం మొదలుపెట్టాడు. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇద్దరి వేధింపులతో మానసికంగా కుంగిపోయిన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి కన్నీళ్లు పెట్టుకుంది. నువ్వు, జబ్బార్ కలిసి నా జీవితాన్ని నాశనం చేశారు.. మీ వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. కానీ రాజేందర్ ఆ మాటలను ఏ మాత్రం పట్టించుకోలేదు. చస్తే చావు అంటూ రాజేందర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో వెంటనే గడ్డిమందు తాగి అనిత ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు అనితను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అనిత మరణించింది. అనిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శానిటరీ ప్యాడ్స్

**(మొదటి పేజీ తరువాయి)**

దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. పాఠశాలల్లో కేవలం శానిటరీ ప్యాడ్స్ అందించడం మాత్రమే కాకుండా, మౌలిక వసతుల విషయంలో కూడా కోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పాఠశాలలో బాలికలు, బాలురకు విడివిడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపింది. అదేవిధంగా దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పరిశుభ్రత, భద్రత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది.

**ఆదేశాలను పాటించకపోతే గుర్తింపును రద్దు చేసే చర్యలు :** ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ప్రైవేటు విద్యా సంస్థలు ఈ ఆదేశాలను పాటించకపోతే వాటి గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. బాలికలకు కనీస సదుపాయాలు కల్పించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపింది. ఇక ప్రభుత్వాల బాధ్యతలపై కూడా సుప్రీంకోర్టు గట్టిగా స్పందించింది. టాయిలెట్లు, ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటిని జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది. అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేసి, పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.

**తుది తీర్పు రిజర్వ్ :** దేశవ్యాప్తంగా బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మెన్స్ట్రువల్ హైజీన్ పాలసీని అమలు చేయాలంటూ జయా ఠాకూర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఈ విధానాన్ని సమగ్రంగా అమలు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో తుది తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్‌లో ఉంచింది. మొత్తంగా చూస్తే, బాలికల ఆరోగ్యం, విద్య, గౌరవం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ మార్గదర్శకాలు దేశవ్యాప్తంగా పాఠశాల వ్యవస్థలో కీలక మార్పులకు దారితీసే అవకాశం ఉంది. రుతుక్రమంపై ఉన్న సామాజిక అపోహలను తొలగిస్తూ, బాలికలు నిర్బంధాలు లేకుండా చదువు కొనసాగించే దిశగా ఇది కీలక అడుగుగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మోదీకి ఇష్టం లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

‘ఎంజినరేగా చోర్–గద్దీ చోడ్’ అని నినాదాలు చేశారు. అనంతరం ‘ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర’ కార్యక్రమంలో రమేష్ ప్రసంగిస్తూ మోదీ ప్రభుత్వం దానిపై బుల్డోజర్ నడపడం ద్వారా నరేగా చట్టాన్ని రద్దు చేసిందని మండిపడ్డారు. ఎంజి నరేగా 2005 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించబడిన చారిత్రాత్మక, విప్లవాత్మక చట్టమని, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ జీ, సోనియా గాంధీ జీ, రాహుల్ గాంధీ జీ ఈ చట్టం రూపకల్పనలో గణనీయమైన కృషి చేశారన్నారు. ఎంజి నరేగా చట్టం రాజ్యాంగబద్ధమైన హక్కు, ప్రజలకు ఉపాధికి చట్టపరమైన హామీని ఇస్తుందని, ఈ చట్టం పంచాయతీలను బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. మొదటిసారిగా డిబిటి ద్వారా ప్రతి కుటుంబానికి డబ్బు పంపిణీ చేయబడిందన్నారు. కానీ మహాత్మా గాంధీ జీతో ముడిపడి ఉన్న ఈ చట్టం ఎక్కువ కాలం కొనసాగకూడదని నరేంద్ర మోదీ కోరుకోవడం వల్ల ఈ చట్టాన్ని రద్దు చేశారని ధ్వజమెత్తారు. ప్రజలు తమ హక్కులను పొందాలని ఆయన కోరుకోవడం లేదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ గట్టిగా నిలబడుతుందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖేరా అన్నారు. దేశంలోని రైతులు, కార్మికులు, యువతను అవమానించే ప్రభుత్వం ఎక్కువ కాలం అధికారంలో ఉండలేవని, తన ప్రభుత్వం దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుందని నరేంద్ర మోదీ అర్థం చేసుకోవాలని హితవు పలికారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా) లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఉపాధికి చట్టబద్ధమైన హక్కును ఇచ్చిందని, అయితే కేంద్రం ఈ నిబంధనలను క్షీణింపజేస్తోందని రమేష్ మండిపడ్డారు. ‘విబి– జి రామ్ జి’ పథకం యుపిఎ కాలం నాటి ఎంజి నరేగా అసలు స్ఫూర్తిని నీరుగార్చిందన్నారు. నిరసనను ఉద్దేశించి ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (డిపిసిసి) అధ్యక్షుడు ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలు పేదలపై నిరంతర దాడిని సూచిస్తున్నాయన్నారు. ‘విబి– జి రామ్ జి’ చట్టాన్ని రద్దు చేయాలని, నరేగాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ 45 రోజుల దేశవ్యాప్తంగా ఎజినరేగా బచావో సంగ్రామ్ యాత్రను ప్రచారం ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రభుత్వం నిరంతరం పేదలపై దాడి చేస్తోందన్నారు. ఒకప్పుడు ఉపాధి హామీ పొందిన ప్రజలు ఇప్పుడు హామీలను తుంగలో తొక్కడాన్ని గమనిస్తున్నారని, వారికి మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన వ్యవస్థలు క్రమంగా కూల్చివేయబడుతున్నాయన్నారు. ఇది చిన్న పోరాటం కాదు కాబట్టి ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఇది చాలా సుదీర్ఘమైన యుద్ధమని, ఈ సుదీర్ఘ పోరాటానికి, మనం క్రమశిక్షణతో ఉండాలిలని, ఈ ప్రభుత్వ మెడలు వంచేలా అందరం కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం, 2025 (విబి–జి రామ్ జి), ప్రతిపక్షాల గర్జన మధ్య ఉభయ సభలు ఆమోదించాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com